ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




వేసవి మబ్బులు


23-6-48 **ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY** వెల **4** అణాలు

ముక్తసరంలో సిక్ఖు వీరోత్సవాలు

ముక్తసరం ఇండో-పాకిస్థాన్ సరిహద్దుకు చాలా దగ్గరలో ఫిరోజ్‌పూరుజిల్లాలో ఉంది. ఇక్కడ సిక్ఖు వీరోత్సవాలు, పండుగలు జరుగుతుంటాయి.



పండుగనాడు ప్రొద్దున్నే ఊరి ప్రజలంతా ముక్తసరంలోని ఈ సరోవరంలో స్నానంచేస్తారు.



ఉత్సవ యుద్ధప్రదర్శనంలో, రెండుపక్షాల వీరు లిల్లా బారులుదీర్చి సన్నాహంలో ఉంటారు.



వీరప్రదర్శనానికి పూర్వం, వీరులంతా ఒక్కొక్కరేవచ్చి ఆయుధాలకు నమస్కారంచేస్తారు.



సమరప్రదర్శనం సాగుతూంది. శిక్షాగురువు ప్రక్కనే నిల్చుని పర్యవేక్షిస్తున్నాడు.





దీవనకలాపము. యుద్ధానంతరము వీరులూ, ప్రేక్షకులూ "మొగలులతో గురుదేవుని పూర్వరణాల" చారణగీతాలు వింటూ కూర్చుంటారు—దీవనకలాపము వింటూన్న వనితాలోకం.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును


ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 40


సంచిక 41

Founder: K. NAGESWARA RAO.

సర్వధారి సంవత్సర జ్యేష్ఠ బహుళ విదియ బుధవారము



'పండిట్ నెహ్రూ, ఆయన కుమార్తె, జాతీయ ప్రదర్శనంలో కొత్త వస్తువులను పరిశీలిస్తున్న దృశ్యం.



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ జూన్ నెల 23-వ తేదీ బుధవారము

విద్యామంత్రి విపరీత ప్రకటన

చెన్నపట్టణమున తమిళమే ప్రాంతీయ భాష యని విద్యామంత్రి అవినాశలింగం చెట్టిగారు ప్రకటించుటలో విపరీతమేమియు లేదు. వీరు విద్యామంత్రిగ రెండు సంవత్సరముల క్రితము అధికారమును స్వీకరించినది మొదలు తమిళేతరభాషలపై ధ్వజ మెత్తిరి. పట్టణమున, పట్టణ పరిసరములలో తమిళేతర భాషలకు స్థానము లేకుండ చేయుటకు ఇంతవరకు రహస్యముగ; ప్రచ్ఛన్నముగ జరుపుచుండిన కార్యకలాపమును ఇప్పుడు బహిరంగముగ కొనసాగించుచుండిరి. గత సంవత్సరము విద్యాబోధ ప్రాంతీయ భాషలయందే జరుగవలెనని ఉత్తరువుచేసి పట్టణమునందలి పాఠశాలల్లో ఒక్క తమిళముననే విద్యాబోధనకు వీలుకల్గించిరి. అంతవరకు ఏ భాష విద్యార్థులకు ఆ భాషయందు విద్యను గరపుచుండిన పాఠశాలలు అన్నియు ఒక్క తమిళమునకు మాత్రమే స్థానముంచి, ఇతర భాషలలో విద్యాబోధనకు అవకాశము లేకుండ చేసెను. నగరమునందలి కార్పొరేషను పాఠశాలలందు ఇతర భాషలందు విద్యాబోధనమునకు స్వస్తి చెప్పి, ఇతర భాషల తరగతులను ఎత్తివేయుట జరిగినది. విద్యామంత్రి "నిరంకుశ" విధానమును నిరసించుచు జరిగిన ఆందోళనము చెవిటి వాని ముందు శంఖ మూదిన ట్లయ్యెను. ఆంధ్ర మంత్రులును ఈ విషయమున ఉపేక్షాభావమునే ప్రదర్శించిరి. ఆంధ్రుడు ప్రధానిగనున్న కాలముననే ఈ నిర్ణయము జరిగినదని తెలిపి తమ ఈ వైఖరిని సమర్థించుకొన జూచిరి. కాని ఈ మధ్య ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు డాక్టర్ కట్టమంచి రామలింగా రెడ్డిగారు ఈ విధానమును తీవ్రముగ ఖండించగ ఆర్థిక మంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఈ విషయమును విచారించుటకు ఒక కమిటీని నియమింతుమని తెలిపిరి.

ఈ కమిటీ విచారణ జరిగి, ప్రభుత్వమునకు నివేదిక సమర్పింపబడి, అందుపై ప్రభుత్వమువారు తమ తీర్మానమును ప్రకటించుట పూర్తికాకపూర్వమే విద్యామంత్రి శ్రీ అవినాశలింగం చెట్టిగారు తమిళమే చెన్న నగరమున ప్రాంతీయ భాషయని ప్రకటించిరి. ఇది కేవలము పాఠశాలలకు, విద్యాబోధనకు మాత్రమే సంబంధించినదిగాదు. యావత్తు రాజకార్యములకు ఇది సంబంధించినది. విద్యాబోధనకు సంబంధించినంతవరకు మాత్రమే తెనుగు, కన్నడ, మలయాళ భాషలనుకూడ ప్రాంతీయ భాషలుగ పరిగణించడమౌనని వీరు విశదము చేసిరి. ఈ విశదీకరణవలన వారి మొదటిప్రకటన ఆంతర్యము స్పష్టమగుచున్నది. తమిళము నగరప్రాంతీయ భాషయని ప్రకటించుటతో నగరము తమిళప్రాంతమని నిశ్చయపరచుట జరిగినది. మా విలేఖరి ఇట్టి ప్రకటనచేయుటకు ఆధారము లేమని ప్రశ్నింపగా "మద్రాసులో తెలుగు తమిళముల ప్రాతినిధ్యముల నిర్ణయించుటలో తమిళులకు 51 స్థానములును, తెలుగువారికి 39 స్థానములును అని చాలాకాలము క్రితమే నిర్ణయింపబడినది. ఈ ప్రాతినిధ్యపు నిష్పత్తిపై ఆధారపడి మద్రాసు ప్రాంతీయభాష తమిళమని నిర్ణయించడమైనది." అని విద్యామంత్రి సమాధానమిచ్చెను.

అసలు "చెన్ననగరమున తమిళము ప్రాంతీయభాషగ పరిగణించడమైనది. తెలుగు, మళయాళము, కన్నడము భాషలలో విద్యాబోధచేయు పాఠశాలలు ఇచట ఉండుటకు అనుమతింపబడుచున్నవి. అట్టి అవసరములకు ఈ భాషలనుకూడ ప్రాంతీయ భాషలుగ పరిగణింపబడును." అని విద్యామంత్రి అసందిగ్ధముగ ప్రకటించెను. తమిళమే ప్రాంతీయభాష అయినను వారి 'ఔదార్యము'వలన విద్యా బోధనకు సంబంధించినంతవరకు ఆంధ్ర, కేరళ, కర్నాటక భాషలుకూడ ప్రాంతీయభాషలుగ పరిగణింపబడుచున్నవి! నగరమున తమిళ జనాభా మొత్తములో సగమునకు తక్కువే. ఆంధ్రులకంటె తమిళుల జనాభా ఒక లక్ష మాత్రమే ఎక్కువ. ఇట్టి పరిస్థితులలో మద్రాసు ప్రాంతీయ భాష తమిళమని ప్రకటించుట సాహసము గాదా? ప్రాంతీయ భాషలో విద్యాబోధన సమస్యపై బొంబాయి ప్రభుత్వము ఇటీవలనే ఒక నిర్ణయము చేసియుండెను. ఆ సందర్భమున బొంబాయి నగరము బహుభాషా ప్రాంతమనియు, కనుక అందలి పాఠశాలలలో విద్యాబోధన భాషను ప్రత్యేక సమస్యగా విచారింపవలసి యుండుననియు వారు స్పష్టము చేసిరి. చెన్నపట్నమునకును ఇదే వర్తింపవలసి యుండును. లోగడ నగరమున రేషను ఫారములు, వోటరుల జాబితాలు ఇత్యాది అధికార పత్రములు ఒక్క తమిళమునందే ప్రకటింపబడుచుండగా, ఇతరులు ఆందోళన చేసిరి. అపుడు తెనుగునకూడ వీటిని ప్రచురించుటకు వీలుచేయబడెను. ఇకముందట్టి అవకాశము లేకుండచేయుటే అవినాశలింగము చెట్టిగారి ఉద్దేశము. కనుకనే వారు ప్రాంతీయ భాష ప్రసక్తికి అవసరముగాని, అవకాశముగాని లేకున్నను మొన్న 17 వ తేదీన ఈ ప్రకటనను చేసిరి.

శ్రీ సాంబి వెంకటాచలం చెట్టిగారును, మంత్రి శ్రీ వేముల కూర్మయ్యగారును సమర్థించినట్లు, భాషారాష్ట్ర నిర్మాణము జరుగనున్న ఈ సమయమున, మద్రాసు భవిష్యత్తువిషయమై తీవ్ర వాదోపవాదములు జరుగుచుండ విద్యామంత్రి తమకు చెందని విషయమున ఇట్టిప్రకటన చేయుట సమంజసముగాదు. మంత్రివర్గములోని ఆంధ్ర మంత్రులు ఈ విషయమై తమ తీవ్ర అధిక్షేపణమును తెలుపుట అభినందింపతగ్గ విషయమే. తమిళము నగర ప్రాంతీయ భాష యని ప్రకటించుట ఒక్క విద్యామంత్రికి మాత్రమే సంబంధించినది గాదు. యావత్తు మంత్రివర్గమునకును సంబంధించినది. అయినను అవినాశలింగం చెట్టిగారు స్వతంత్రించి ఇట్లు ప్రకటించుట వారి విధానమునకు తగ్గట్టుగనేయున్నది. ఈ ప్రకటనవల్ల ఏర్పడిన దురభిప్రాయములను తొలగించుటకు ప్రభుత్వము ఈ ప్రకటనను సవరించుచు చెన్ననగరమునకు సంబంధించినంతవరకు అన్ని విషయములందును, అన్ని వ్యవహారములందును ఆంధ్ర, తమిళ, కర్నాటక, కేరళ భాషలు ప్రాంతీయ భాషలని విస్పష్టము చేయుట అత్యంతావశ్యకము.

హైదరాబాద్

"హైదరాబాదు భారత సమితిలో చేరుటా చేరకపోవుటా అన్నది అసలు విషయం గాదు. భవిష్యత్తులో భారత-నైజాం సంస్థానముల సంబంధములు ఎలాఉండాలన్నది కూడా పెద్ద సమస్య గాదు. ఇవి చాలా ప్రధానమైన విషయాలే అయినప్పటికినీ, ప్రస్తుతంలో ఈ రెంటికంటే చాలా ప్రధానమైనది సంస్థానములోనూ సరిహద్దులలోనూ శాంతి పరిస్థితులు ఏర్పడేటట్లు చేయడము. అరాచకమును, అశాంతిని ప్రోత్సహించు సంఘములను, సంస్థలను రద్దుచేయడమే. పరిపాలనాధికారమును ప్రజాయత్తం చేయడం ద్వారానే ఇది సాధ్యమౌతుంది." అని భారత ప్రధానామాత్యుడు పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఆ మధ్య బొంబయిలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సంఘసమావేశములోనూ, అనంతరం ఢిల్లీలో జరిగిన పత్రికావిలేఖరుల సమావేశములోనూ స్పష్టము చేసెను. ఇతర సంస్థానములను భారత సమితిలో కలిపివేసినట్లే నైజాం సంస్థానమునుకూడ కలిపివేయుట భారతప్రభుత్వ సంకల్పము గాదని, భారత-హైదరాబాద్‌లమధ్య ఒకవిధమైన సమానభాగస్వామ్యపద్ధతిని నెలకొల్పుటే తమ అభిమతమని ఉదకమండలం, కోయంబత్తూరులందు జరిగిన బహిరంగసభలలో ఉపన్యసించుచు వెల్లడించిరి.

భారత ప్రభుత్వము అంత్య ప్రతిపాదనలని హైదరాబాదు రాయబారవర్గమునకు అందచేసిన ఒడంబడిక ఫర్మానా ముసాయిదాలను పరిశీలించిన, ఏనాటికైన భారతసంస్థాన భూభాగములో కలసిపోవలసిన సంస్థానముతో సంఘర్షణ ఎందులకన్న భారత ప్రభుత్వ అభిప్రాయము స్పష్టము కాగలదు.

హైదరాబాదు ప్రభుత్వమునకు కొంతకాలము సలహాదారుడుగ పనిచేసిన సర్ సుల్తాన్ అహమ్మద్, కౌన్సిల్ ఆఫ్ స్టేట్ మాజీ అధ్యక్షుడు హొస్సెన్ ఇమాం ప్రభృతులు సైతము భారతప్రభుత్వ అంతిమ ప్రతిపాదనలు న్యాయముగను, అంగీకారయోగ్యముగను ఉన్నవని ప్రకటించిరి. కాని హైదరాబాదు నవాబుగారు, వారి సలహాదారులు మాత్రము భారత ప్రభుత్వ ప్రతిపాదనలు నైజాం స్వాతంత్ర్యమును హరించునవిగ నున్నవని ప్రకటించిరి. వీరికి ఆ ప్రతిపాదనలు అర్థముగాకుండనైనను ఉండవలెను; లేక భారతప్రభుత్వముతో సమాధానమునకు వచ్చుట వారికి అయిష్టముగనైన ఉండవలెను. తన సంస్థాన భవిష్యత్తు విషయమున ప్రజాభిప్రాయమునకు కట్టుబడుదు నని ప్రకటించిన నైజాం వర్తమానకాలములో పరిపాలనాధికారమున కొంత సంస్థానప్రజల పరము చేయ నిరాకరించుట విచిత్రముగ కన్పించును. అసలు జనవాక్య నిర్ధారణ అంటే ఏమో, వీరికి బోధపడినట్లు కన్పింపదు. ఇటీవల చకస్లవేకియాలో జరిగిన ఎన్నికల పద్ధతిని సంస్థానములో జనవాక్యనిర్ధారణ కార్యక్రమమును కొనసాగింపవచ్చునని నైజాం, కాసిం రజ్వీ, మీర్ లాయక్ ఆలీ ప్రభృతులు ఆశించియుండవచ్చును. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యమున ఈ కలాపమును సాగింతుమని ప్రకటించుట ప్రపంచమును మోసపుచ్చుటకు ఉపయోగపడవచ్చును. కాని భారతప్రభుత్వము ఇట్టి ఏర్పాట్లను ఎన్నటికిని అంగీకరింపదు. అసలు నైజాం ఏనాడు ఈ అంతిమ ప్రతిపాదనలనుకూడ తిరస్కరించెనో అప్పుడే వాటిని భారతప్రభుత్వము ఉపసంహ

నేటిప్రపంచం:

బర్మా కమ్యూనిస్టు పంథా

ప్రధాని థాకిన్‌నూ ప్రకటనపై బ్రిటిష్‌వర్గాల ఆందోళన

బర్మా ప్రధాని థకిన్‌నూ దాదాపు పదివేల మంది ప్రజలు హాజరైన ఒక బ్రహ్మాండమైన సమావేశంలో ఉపన్యసిస్తూ రష్యాకూ తన దేశానికీ మధ్య ఆర్థిక రాజకీయ సంబంధాలను స్థాపించడానికి శక్తికొద్దీ కృషిచేస్తానని ప్రకటించాడు. ఇంతేగాకుండా తమ దేశానికి ఇరుగు పొరుగున బ్రిటన్, అమెరికా ఆధిపత్యానికి లోబడిన రాజ్యాలు వున్నప్పటికీ బర్మా నాయకులు సోవియెట్‌రష్యా ఆర్థిక సిద్ధాంతాలను అనుసరించాలనే అభిలషిస్తున్నారని కూడా థకిన్‌నూ విశదపరిచాడు ధనికవాదాన్ని రద్దు చేయడం, ఎగుమతి దిగుమతి వ్యాపారాన్ని ప్రభుత్వాధ్వర్యాన స్థాపించడం, తమ దేశ స్వాతంత్ర్య ప్రతిపత్తికి భంగం కలిగించే విదేశీ సహాయాన్ని దేన్ని అయినా నిరాకరించడం, భూస్వామ్య విధానాన్ని తొలగించివేసి, ధనికవాదంపై కార్మిక కర్షకవర్గాలు సాగించే పోరాటాన్ని బలపరచడం, మార్క్సిస్ట్ సిద్ధాంతాల ప్రచారానికి అనుమతించడం ఇవన్నీ తమ భవిష్యత్ కార్యక్రమంలో భాగాలు కాగలవనీ ఖండితంగా చెప్పాడు.

బర్మా ప్రధాని థకిన్‌నూ దేశంలోని వివిధ వామపక్షాలనూ కూడదీసి "యునైటెడ్‌పార్టీ" అనే సంయుక్త వామపక్షాన్ని స్థాపించదలచి, దాని జాతీయ కార్యక్రమాన్ని పైవిధంగా స్పష్టీకరించడం జరిగింది. లెఫ్టిస్టు దృక్పథం గల వివిధ రాజకీయ వర్గాలకూ ఈ కార్యక్రమం అంగీకృత మవుతుందని ఆశిస్తున్నట్లు తెలియజేశాడు కీర్తిశేషుడు అంగ్‌సాన్ కృషిఫలితంగా ఏర్పడిన ఫాసిస్టు ప్రతికూల ప్రజాస్వాతంత్ర్య సమితిలో అంతర్భాగాలగావున్న సోషలిస్టులు, పీపుల్స్ వాలంటీర్ సంస్థవారు తమతమ పక్షాలను రద్దుచేసుకొని కొత్తగా ఏర్పడుతున్న "యునైటెడ్ లెఫ్టిసుపార్టీ"లో చేరిపోవాలని సైతం థకిన్‌నూ ఆదేశించాడు. ఫాసిస్టు ప్రతికూల ప్రజాస్వాతంత్ర్య సమితి కార్యవర్గం ఈ నూత్న కార్యక్రమాన్ని ఆమోదించిందిగాని, పీపుల్స్ వాలంటీర్ సంస్థవారుమాత్రం అంగీకరించవట్లు వార్తలు తెలుపుతున్నవి.

సహజ సామ్యవాద దృక్పథం గల బర్మా ప్రధాని థకిన్‌నూ తనకు అభిమానపాత్రమైన విధానాన్ని ఇంత బాహాటంగా ప్రకటించేసరికి నిన్న మొన్నటి వరకూ బర్మాపై ఆర్థిక రాజకీయ ఆధ్వర్యం వహించిన బ్రిటనులో అలజడి, ఆందోళన బయలుదేరినవి. ఏ దేశమైతే తమకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించిందో ఆ దేశానికే, ఆ దేశ ప్రజలైన బ్రిటిష్‌వారికే బర్మా ఎదురు తిరిగిందనే ఖంగారు ప్రారంభమైంది—ఇంకేముంది. బర్మాలో ఫాసిస్టు ప్రతికూల ప్రజాస్వాతంత్ర్య సమితి పలుకుబడి, ప్రభుత్వాధర్మము నాశనమైనదనీ, బర్మా అంతా కమ్యూనిజం వెల్లువలో మునిగి తేలుతుందనీ వివిధ బ్రిటిష్‌వర్గాలవారూ ఊహాగానం చేయడం ప్రారంభించారు.

తాను కమ్యూనిజంపట్ల అనుకూల విధానాన్ని అనుసరించినప్పటికీ దేశంలో తీవ్రఅశాంతిని అరాజకాన్ని లేవదీస్తున్న బర్మా కమ్యూనిస్టులతో మాత్రం ఏవిధమైన రాజీ రాయబారాలూ జరపనని ప్రధాని థకిన్‌నూ స్పష్టపరిచినా, కమ్యూనిస్టుల ధాటికి తట్టుకోలేక బర్మా ప్రధాని ఇదొక ఎత్తువేసి రాజకీయ ఐక్యతకు తాపత్రయ పడుతున్నాడని బ్రిటిష్‌వారు వ్యాఖ్యానించారు. బర్మా, రష్యా అండన చేరితే, భారతదేశం గతి ఏమవుతుందో చెప్పలేమని కూడా అభిప్రాయపడ్డారు.

బ్రిటనులో ప్రథమ బర్మా రాయబారిగా పనిచేస్తున్న సర్ మాంగ్ గ్యీని బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఎర్నెస్ట్‌బెవిన్, బర్మాప్రధాని ప్రకటన వెలువడిన ఈ తరుణంలోనే పిలిపించుకొని పరిస్థితి నంతటినీ బర్మా బ్రిటనుల సంబంధాలను సమగ్రంగా చర్చించాడు. ఈనాడు బ్రిటిష్ కామన్వెల్తులో లేకపోయినప్పటికీ స్వతంత్ర బర్మాతో బ్రిటనుకు అతిసన్నిహితమైన సంబంధాలు వున్నవి. ఇవి ఎక్కడ చెడిపోతవోననే ఆదుర్దాతో బ్రిటన్ విపరీతమైన శ్రద్ధను కనబరిచింది. బర్మా స్వతంత్ర రాజ్యమైనప్పటికీ, ఆ దేశంలో బ్రిటిష్‌వారి ఆర్థిక ప్రాబల్యం మాత్రం యథాప్రకారంగా వున్నది కాబట్టి, ముందుగా ఏవిధమైన సంప్రతింపులనూ సమగ్రంగా జరపకుండానే ఈ మాసారంభంలో బర్మా ప్రభుత్వం తమ దేశంలో వున్న కొన్ని బ్రిటిష్ కంపెనీలను స్వాధీనపరుచుకొన్నది కాబట్టి బర్మా ప్రధాని థకిన్‌నూ ప్రకటన బ్రిటిష్ వర్గాలలో ఇంత ఆందోళన కలిగించివుంటుంది.

బ్రిటిష్ విదేశాంగమంత్రి బెవిన్ కామన్సు సమావేశంలో, బర్మా ప్రధాని ప్రకటనపై ప్రసంగిస్తూ, "బర్మాకు యథాప్రకారం సహాయం చేస్తుండాలనే బ్రిటన్ తాపత్రయ పడుతున్నది. ఐతే ఈ సహాయాన్ని బ్రిటన్ ఇవ్వగలదా లేదా అనే విషయం బర్మా ప్రభుత్వం ఆంగ్లో-బర్మీస్ ఒడంబడిక షరతులను సుహృద్భావంతో సంతృప్తికరంగా నెరవేర్చడంమీద ఆధారపడి వుంటుంది...ఏదైనా ఒకదేశం స్వతంత్రమైనప్పుడు దానిచేత ఏపనినైనా సవ్యంగా చేయించుకోవలెనంటే కొంతవరకు ఓర్పూ, సహనభావమూ వుండడం అవసరం. బర్మా విషయంలో నేను ఓర్పునే వహించదలిచాను... బ్రిటన్ చూపుతున్న విశ్వాసభావానికి బర్మా భిన్నంగా ప్రవర్తించినట్లయితే, అప్పుడు ఆదేశంపట్ల మన విధానంకూడా తదనుగుణంగానే మార్పు చెందకతప్పదు" అని ఒకవిధమైన హెచ్చరికా, లాలనా చేశాడు. థకిన్‌నూ కార్యక్రమం అంతటినీ చూస్తే బర్మా ప్రజాస్వామ్య సోషలిస్టు పరిపాలనా విధానానికే స్వస్తిచెప్పినట్లు తోస్తున్నదనికూడా బెవిన్ విమర్శించాడు.

పైగా, బర్మాప్రధాని చేసిన ప్రకటన వ్యక్తిగతమైన ఒక ఉపన్యాసమేగాని ప్రభుత్వవిధానంలో ఏవిధమైన మార్పూ లేదనీ, ఇది బర్మా మంత్రివర్గం సమిష్టిగా చేసిన ప్రకటన కాదనీ కూడా చెప్పి బెవిన్ కన్సర్వేటివ్ సభ్యుల విమర్శలను అరికట్టాడు.

బర్మా విదేశాంగ విధానంలో ఏవిధమైన మార్పూ రాలేదనీ, కమ్యూనిస్టు విధానాన్ని అనుసరించి రష్యా అండన చేరడం తమ ఉద్దేశం కాదనీ, వివిధదేశాలతో స్నేహసన్నిహితభావాలను పెంపొందజేసుకొని ప్రపంచశాంతికి శక్తికొద్దీ దోహదం చేయడమే తమ సంకల్పమనీ, భారతదేశ రాజ్యాంగపరిషత్తులో ప్రధాని నెహ్రూ నిర్వచించిన విధానానికీ, తాము అనుసరించదలచిన విధానానికీ ఏవిధమైన వ్యత్యాసమూ లేదనీ బర్మా విదేశమంత్రి యు టిన్ టట్ బ్రిటిష్ విమర్శలకు సమాధానంగా మరొక విస్పష్ట ప్రకటన చేసినప్పటికీ, బర్మా విషయంలో బ్రిటిష్‌వారి అనుమానాలు పూర్తిగా తీరివుండవనే భావించవచ్చు. పర్యవసానంగా ఎగుమతి దిగుమతి వ్యాపారమంతా బర్మా ప్రభుత్వాధ్వర్యం క్రిందికి రాకమానదనీ, బ్రిటిష్ ఆస్తులను వేటిని స్వాధీనపరుచుకున్నప్పటికీ బర్మాప్రభుత్వం వారికి తగిన పరిహారం ఇస్తుందనీ, బ్రిటనుతో చేసుకున్న ఒడంబడికను (1947) ఖాతరీ చేయక పోవడమంటూ జరగదనీ, ఎటుచేరీ, థకిన్‌నూ నిర్వచించిన విధానాన్ని బర్మా ఆచరణలోకి దించేసరికి కనీసం ఆరునెలలైనా పడుతుందనీ కూడా యు టిన్ టన్ ఇదే ప్రకటనలో అన్నాడు.

యూరప్‌ఖండంలో పశ్చిమ ప్రజాస్వామ్య రాజ్యాలు చేసిన కట్టుదిట్టాల కారణంగా కమ్యూనిజం విస్తరణకు ఇక అవకాశం లేదు కాబట్టి, రష్యా తన దృష్టిని ఆసియాఖండంపైకి త్రిప్పిందని బ్రిటిష్ లిబరల్ పత్రిక మాంచెస్టర్ గార్డియన్ ఒక పెద్ద సంపాదకీయ వ్యాసం వ్రాసింది. యూరప్‌ఖండంలో గ్రీసు కమ్యూనిస్టులకు లొంగిపోయినట్లయితే, ఇటలీకి తీరని ప్రమాదం తప్పక సంభవించేదేననీ, ఆసియా ఖండంలో బర్మా, మలయా, సయాం, దేశాలకు యూరప్‌లో గ్రీస్‌కు వున్నంత ప్రాధాన్యం వున్నదనీ, బర్మా, మలయా, సయాం ఈ మూడు రష్యాప్రాబల్యంకిందికి పోతే భారతదేశస్థితి ఇటలీ స్థితిగా పరిణమించి ముప్పు సంభవిస్తుందనీ బ్రిటిష్ కన్సర్వేటివ్ పత్రిక (స్పెక్టేటర్) హెచ్చరిక చేస్తున్నది.

ద్వితీయ ప్రపంచసంగ్రామం ఫలితంగా ఏ ఫలితాలు చేకూరినా చేకూరకపోయినా, సుస్థిర ప్రపంచశాంతి లభ్యమైనా లభ్యంగాకపోయినా, చిరకాలంగా దాస్యశృంఖలాలలో పడివున్న ఆసియాఖండ దేశాలలో జాతీయభావాలు, స్వాతంత్ర్యోద్యమాలుమాత్రం పెద్దపెట్టున విజృంభించినవి. బర్మా, సింహళ భారతదేశాలు స్వతంత్రమైన వంటే, ఇండొనీసియా, ఇండోచైనా మొదలైన పాశ్చాత్య వలసరాజ్యాలలో ఇప్పటికీ స్వాతంత్ర్య సమరాలు సాగుతున్నవంటే ద్వితీయ ప్రపంచ సంగ్రామ ప్రభావమే కారణం. జాతీయభావో జ్జృంభణతోపాటు యుద్ధం తాకిడివల్ల ఆసియాఖండ రాజ్యాలలో ఆర్థికవ్యవస్థకూడా తారుమారై విపరీతమైన సంక్షోభం, అశాంతి రేకెత్తినవి. ఈనాడు ఇండియా, బర్మా, సింహళ, మలయాలలో కమ్యూనిస్టులు విశృంఖలంగా ప్రజలను రెచ్చగొడుతున్నారంటే ఈ అశాంతి, సంక్షోభమే కారణాలు. మలయాలో రబ్బరు తోటల యజమానులపై ఈనాడు దారుణ హత్యాకాండ సాగడానికీ, దాన్ని అణచివేయడానికి సైనిక బలాన్ని సైతం ప్రయోగించవలసి రావడానికీ కమ్యూనిస్టు ప్రచారమే కారణం. ఆసియాఖండ వివిధ రాష్ట్రాలలోను నూతనంగా అధికారంలోకి వచ్చిన ఆయా ప్రభుత్వాలు యుద్ధానంతర పరిస్థితులకు అనుగుణమైన అభ్యుదయ పంథాలను అనుసరించక పోవడం వల్లనే కమ్యూనిస్టు సిద్ధాంతాలు ప్రజను బాగా ఆకర్షించడం జరుగుతున్నది. సైనిక బలాన్ని ప్రయోగించినందువల్ల కొంత మంది కమ్యూనిస్టులను హతమార్చవచ్చుగాని, కమ్యూనిజంను మాత్రం చంపలేము. అందువల్ల సాధ్యమైనంత వరకు ప్రజలను కమ్యూనిజం ఆకర్షించకుండా చేయవలెనంటే ఆయా దేశాల ప్రభుత్వవిధానాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చి, అవి సాధారణ ప్రజానీక క్షేమానికి పనిచేయక తప్పదు. బర్మా ప్రభుత్వం అనుసరించ దలచిన నూత్న విధానం బ్రిటన్ ఎంత ఆందోళన పడినప్పటికీ, ఆ దేశ ప్రభుత్వ బలాధిక్యతకే, సహాయపడుతుంది కాని దాన్ని దుర్బలపరచదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

సామ్రాజ్యతత్వదేశాలు ఎంత పట్టుకొని ప్రాకులాడినా, సామ్రాజ్యవాదం ప్రపంచంలో నశించిపోవడం తథ్యం. జాతీయ స్వాతంత్ర్యోద్యమాలు ప్రబలిన ఈ రోజులలో సామ్రాజ్య వాదానికి స్థానం లేదు. అందుచేతనే ఇండొనీషియా, ఇండోచైనాలలో డచ్చి, ఫ్రెంచి సామ్రాజ్యవాదం చావలేక బ్రతకలేక చస్తున్నది. డచ్చి ఫ్రెంచి సామ్రాజ్యవాదుల కుతంత్రాలు ప్రపంచానికి తేటతెల్లమవుతున్నవి.

ఇండొనీషియాలో డచ్చి సామ్రాజ్యవాదులు అక్కడి రిపబ్లికన్ ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఎంత ఉపద్రవకరమైన కపట నాటకం ఆడుతున్నదీ భద్రతామండలిలో భారత ప్రతినిధి డా. పి. పి. పిళ్లేగారు తీవ్రమైన హెచ్చరిక చేస్తూ ఈ వారం ఉపన్యసించారు.

ఐక్యరాజ్య సమితి నియమించిన డచ్చి ఇండొనీషియా సామరస్య సంఘం ఇప్పటి వరకూ పంపిన నాల్గు నివేదికల పైనా భద్రతా మండలి మొన్న చర్చ జరిపింది. ఇండొనీషియా రిపబ్లికన్ ప్రభుత్వాన్ని దుర్బల పరచడానికి డచ్చివారు అనేక రిపబ్లికన్ భూభాగాలను కుతంత్రాలద్వారా ఆక్రమించారనీ, "రెన్విల్" ఒడంబడిక షరతులకు పూర్తిగా విరుద్ధంగా డచ్చివారు ప్రవర్తిస్తున్నారనీ, ప్రజోద్యమాలను అణచివేస్తూ ప్రతీపశక్తులను ప్రోత్సహించి అధికారంలోకి తెస్తున్నారనీ డా. పిళ్లై స్పష్టపరిచాడు. పశ్చిమ జావా, మదురా దీవులలో జనవాక్య నిర్ధారణ నిష్పాక్షికంగా జరగలేదనీ, స్థానికంగా ఎవరినో కొంత మందిని దగ్గరకు తీసి వారే ఆయా ప్రాంతాల తాత్కాలిక పార్లమెంటు సభ్యులని డచ్చివారు ప్రకటించడం జరుగుతున్నదనీకూడా భారత ప్రతినిధి హెచ్చరిక చేశాడు.

డచ్చి సామ్రాజ్యవాదులు 'ఈ విభజించి పాలించు' పద్ధతిని విరమించి, ప్రజాక్షేమాన్ని అభిలషిస్తూ తమ ఆధిపత్యాన్ని త్యజించనంత కాలం అక్కడ అశాంతి తప్పదు. డచ్చి కుతంత్రాలను సకాలంలో అరికట్టడానికి ప్రయత్నించనంతకాలము ప్రపంచ శాంతి స్థాపనకై ఏర్పడిన ఐక్యరాజ్య సమితి తన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించిందనిపించుకోలేదు.

రించుకొనవలసియుండెను నైజాంతో రాజీ అసంభవము. ఒడంబడికల గౌరవింపలేని ప్రభుత్వముతో సమాధానమేమిటి? తమ గౌరవము, ప్రతిష్ఠ, స్వతంత్ర స్థాయినిగురించి నవాబుగారును, వారి మంత్రులును పదేపదే ప్రకటించుచుండిరి. సంస్థానములో శాంతిని కాపాడలేని, తన ప్రజల సంరక్షింపలేని ప్రభుత్వమొక ప్రభుత్వమా? మధ్యయుగములనాటి సంప్రదాయములకు, పైశాచిక విధానములకు బానిసలైన పాలకులకు ఈ ప్రజాస్వామికమున గల గౌరవమేమి? ప్రతిష్ఠ ఏమి? ఏమైనను దాదాపు ఒక సంవత్సరముగనున్న సందిగ్ధావస్థ తొలగిపోవుట సంతసింపతగ్గది. భారతప్రభుత్వము కూడ వెనుకటివిధానమును పూర్తిగ విసర్జించి వేయవలెను. అంతేగాక, నైజాం ఒడంబడికపత్రంపై సంతకము చేయుటకు కాలనిర్ణయము లేని గడువును పెట్టరాదు. యథాతథపు ఒడంబడికకు దుర్భకొనుటకుగల ప్రధాన హేతువు తొలగిపోయినందున, నైజాం ప్రభుత్వము ఆ ఒడంబడికపై సంతకము పెట్టినది మొదలు నేటివరకును తద్విరుద్ధముగనే వ్యవహరించుచున్నందున ఆ ఒడంబడిక దానికదె రద్దయిపోయినది. ఆర్థికదిగ్బంధనముతో అధినివేశప్రభుత్వము తృప్తి చెందరాదు. "ఆలస్యం అమృతం విషం" కనుక ఇతరసంస్థానముల పరిష్కరించినట్లే ఈ సమస్యను వెంటనే పరిష్కరించివేయవలెను.



౨౧

ఆర్కాడీ నిద్రలేచి కిటికీ తలుపు తెరవగానే మొట్టమొదట అతనికి అగుపించినది వాసిలీ ఇవానోవిచ్. పాతకాలపు వదులు అంగరఖా తొడుక్కుని నడుము దగ్గర రుమాలతో బిగించి కట్టి తోటలో శ్రద్ధగా వంగి పనిచేస్తున్నాడు. అతిథిని చూడగానే తవ్వుగోలమీద ఆనుకొని నిలబడి కేక వేశాడు: "కులాసాగా ఉన్నారా? బాగా నిద్రపట్టిందా?"

"చాలాబాగా పట్టింది", ఆర్కాడీ జవాబుగా అన్నాడు.

"చూశారా! ముసలివాడినయినా అవసరమయితే శ్రమపడతాను. జవాలు లేత టంటకి మడి తయారు చేస్తున్నాను. భగవంతుడి దయవల్ల పరిస్థితులు మారిపోయాయి. ఎవరి భుక్తికి వారు కష్టపడవలసిన సమయం వచ్చింది. ఇతరుల మీద ఆధారపడి లాభంలేదు. ఎవరిమట్టుకు వారే శ్రమించాలి. ఒక అరగంటక్రితం నన్ను ఇంకొక అవతారంలో చూసి ఉందురు మీరు. ఒక పాటకపుస్త్రీ కడుపు వదులుగా ఉందంటూ వచ్చింది—వాళ్ళు అల్లాగే అంటారు లెండి, మనం విరేచనాలు పెడుతున్నాయంటాము. నల్లమందు వేశాను. ఇంకొక మనిషికి ఒక పిప్పిపన్ను ఊడదీశాను. నొప్పి తెలియకుండా మత్తుమందు వేస్తానన్నాను. ఆమె మాత్రం ఒప్పుకోలేదు.

"ఇదంతా నేను ఉచితంగానే చేస్తాను. ఇది నేను వృత్తిగా పెట్టుకోలేదు. అలవాటయిపోయిందనుకోండి. చూశారూ! నేను సామాన్య కుటుంబంలో పుట్టినవాడిని. పాతకాలపు గొప్ప వంశాల్లో కాదు, నా భార్యలాగ. ఇల్లా ఈ నీడలోకి రాకూడదూ? టీ తాగేముందు ఈ స్వచ్ఛమయిన పొద్దుటిగాలి పీలిస్తే హాయిగా ఉంటుంది"

ఆర్కాడీ అతనిదగ్గరికి వెళ్ళాడు.

"రండి! రండి! స్వాగతం" అన్నాడు వాసిలీ ఇవానోవిచ్; తన నెత్తిమీద ఉన్న చమురు రంగు టోపీ చెయ్యి ఎత్తి సైన్యంలో అలవాటయిన పద్ధతిని సలాం పెట్టాడు. "నాకు తెలుసును. మీరు సుఖాలకి అలవాటుపడ్డారు. భోగాలకు అలవాటుపడ్డారు. కాని ఈ లోకంలో ఎటువంటి గొప్పభోగులయినా కొద్దికాలంపాటు ఒక చిన్న కుటీరంలో గడపడానికి అంత అసహ్యించుకోరని అనుకుంటాను"

"అదేమిటి!" ఆర్కాడీ నిరసించాడు, "ఈ లోకంలో గొప్పభోగులలో ఒకడినా ఏమిటి నేను? అసలు నేనంత సుఖాలకు అలవాటుపడ్డవాడిని కాను."

"క్షమించండి, క్షమించండి" వాసిలీ ఇవానోవిచ్ మర్యాద ఉట్టిపడేట్టు అన్నాడు. "ఇప్పుడీ కుటీరంలో సాధారణంగా గడుపుతున్నా, నా రోజుల్లో నేనూ లోకంలో ఇటూ అటూ తిరిగినవాడినే. ఎగిరేదాన్ని పట్టి అది ఏ పక్షో గుర్తుపట్టగలను. నా ధోరణిలో నేనూ మనస్తత్త్వ పరిశోధన చేస్తాను. శరీరశాస్త్రాన్ని కూడా చదువుకొన్నాను. ఆ పరిజ్ఞానం నాకు లేకపోయినట్లయితే, చాలాకాలం క్రితమే నేను చితికిపోయి ఉందును. నావంటి పేదవాడికి ఇంక సాధనాలు ఏముంటాయి? నేను పొగడ్తకోసం అనడంలేదు, మీకూ మావాడికీ మధ్య ఉన్న స్నేహం చూస్తే నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇంతక్రితమే చూశాను. మామూలువేళకే లేచాడు—మీ కెరుగుదురు కాదూ, అతను చాలా పెందలకడే లేస్తాడు. అలా తిరిగి రావడానికి పోయాడు. అడుగుతున్నందుకు మన్నించండి—మా అబ్బాయిని చాలాకాలంనించి ఎరుగుదురా?"

"క్రిందటి శీతకాలంనించీ ఎరుగుదును."

"సత్యం. ఒకప్రశ్న అడుగుతాను మన్నించండి—మనం కూర్చుంటే బాగుంటుందేమో? నేను అతని తండ్రిని గనక అడుగుతున్నాను, మన్నించండి; మనస్సు విప్పి అడుగుతున్నాను. మా యెవ్‌గనీ విషయమయి మీ అభిప్రాయం ఏమిటి?"

"మీ అబ్బాయంత విచిత్రమయిన ప్రజ్ఞగల వ్యక్తిని నేను ఇంతవరకు చూడలేదు." ఆర్కాడీ దృఢంగా సమాధానం చెప్పాడు.

వాసిలీ ఇవానోవిచ్ కళ్ళు గుండ్రంగా అయాయి. చెక్కులు అస్పష్టమయిన ఎర్ర రంగుతో మెరిశాయి. తవ్వుగోల చేతిలోనించి పడిపోయింది.

"అయితే మీ అభిప్రాయం" అంటూ చెప్పబోయాడు.... ......

"నాకు గట్టి నమ్మకం ఉంది," అన్నాడు ఆర్కాడీ, "అతను ముందుముందు చాలా గొప్పవాడవుతాడు. మీకు ప్రతిష్ఠ వస్తుంది. అతన్ని మొట్టమొదట చూసినప్పుడే నాకు దృఢమయిన నమ్మకం ఏర్పడింది.

"అంటే......ఎల్లాగ?" వాసిలీ ఇవానోవిచ్ అతిప్రయత్నంమీద అనగలిగాడు. అతని పెద్ద నోరు పంక్తిప్రకారమయిన చిరునవ్వుతో విప్పారింది. ఆ నవ్వు పెదవులమీద ముద్రవేసినట్టు నిలిచిపోయింది

"మీ అభిప్రాయం మాకు అసలు పరిచయం ఎల్లాగయిందో చెప్పమన్నా?"

"అవును...తరువాత మొత్తంమీద..."

ఆర్కాడీ ఆ కథ చెప్పడం ప్రారంభించాడు. ఓడింట్సోవ సతితో మజూర్కా నాట్యం చేస్తూ చెప్పినప్పటికంటే ఎక్కువ ఉత్సాహంగా, ఆహ్లాదంగా బజరోవ్‌ని గురించి చెప్పాడు. వాసిలీ ఇవానోవిచ్ శ్రద్ధగా విన్నాడు. అతని కనురెప్పలు చటుకుని మూసుకు తెరుచుకున్నాయి రుమాలు రెండు చేతుల్లోనూ ఉండగా చుట్టాడు. గొంతుక సవరించుకున్నాడు. జుట్టు చేతివేళ్ళతో చెరుపుకున్నాడు. ఇంక తన ఉద్రేకాన్ని ఆపుకోలేక పోయాడు. ఆర్కాడీ మీదికివంగి అతని భుజంమీద పెదవులు మోపాడు "నాకు ఎంతో ఆహ్లాదం కలిగించారు" అన్నాడు పెదవులమీది చిరునవ్వు ఉపసంహరించకుండానే "నేను మీతో ఒక విషయం చెప్పాలి. నేను... నాకు మా అబ్బాయి ఒక ఆరాధ్యదైవం. నా ముసలి భార్య విషయమయి నేను చెప్పన— తల్లిహృదయం ఎల్లాంటిదో మనకందరికీ తెలుసును కాని నా హృదయం అతని ఎదుట వ్యక్తం చెయ్యడానికి సాహసించను. అతనికి నచ్చదు ఏ రకమయిన అనురాగ ప్రదర్శనమన్నా సరే అతనికి అసహ్యం. అంత దృఢమయిన మనస్సున్నందుకు కొంతమంది తప్పు తలస్తారు కూడాను అతనికి హృదయం లేదనీ, లేక పొగరు ఎక్కువనీ అనుకుంటారు. కాని అతనివంటి వాళ్ళని మామూలు పద్ధతిగా ఎంచడానికి వీల్లేదు. అవునంటారా? ఉదాహరణకి చెపుతున్నాను, ఇంకో కుర్రవాడయితే అతని పరిస్థితుల్లో తలిదండ్రుల మెడకి గుదిబండలాగ అయిపోను. భగవంతుడి ముఖంచూసి చెపుతున్నాను—చిన్నవాటినించి ఇంతవరకూ అవసరమయిన దానికంటే దమ్మిడీ ఎక్కువ అడగలేదు మీరు నమ్ముతారో లేదో."

"అతను చాలా నిజాయితీ ఉన్నవాడు, అనవసరమయిన విషయాలవేపు అతను చూడడు," అన్నాడు ఆర్కాడీ.

"నిజం. అతనికి అనవసరమైన విషయాలు అక్కర్లేదు. అతను నాకు ఆరాధ్యుడే కాదు, ఆర్కాడీ నికోలెచ్, అతన్ని చూస్తే నాకు గర్వం. నాకు పెద్దఆశ ఒకటుంది, ఒక సామాన్య సైనిక వైద్యుని కుమారుడు, కాని కుమారుని ప్రతిభ గురించిన తండ్రి అతని విద్యాభ్యాసానికి ఏవిధమయిన లోటూ లేకుండా చేశాడు..." ముసలివాడి గొంతుక గద్గదమయింది.

ఆర్కాడీ అతని చేతిని మృదువుగా నొక్కాడు.

"మీ ఉద్దేశం," వాసిలీ ఇవానోవిచ్ అడిగాడు, "వైద్యవృత్తిలోనేనా అతడు గొప్పపేరు గడిస్తాడని మీరు అనుకుంటుంటా?"

"అచ్చే వైద్యంలో కాదు. అందులో కూడా అతను పెద్దశాస్త్రజ్ఞులకు తీసిపోడనుకోండి."

"అయితే, ఆర్కాడీ నికోలెచ్ ఎందులో గొప్పవాడవుతాడని మీ అభిప్రాయం?"

"ఇప్పుడు చెప్పడం కష్టం. కాని గొప్పకీర్తి గడిస్తాడు"

"గొప్పకీర్తి గడిస్తాడు", ముసలి వైద్యుడు పునశ్చరణచేశాడు. ఏదో ఊహలో మగ్నుడయిపోయాడు.

"అరీనా వ్లాసీవ్నా టీకి రమ్మని పిలుస్తున్నారు", ఆన్ఫుసుష్కా పండు పూతిక పళ్లని ఒక పెద్ద పళ్లెంలో పట్టుకుని వస్తూ చెప్పింది.

వాసిలీ ఇవానోవిచ్ చటుకుని ఊహాలోనించి మేలుకున్నాడు. "పూతిక పళ్లలోకి చల్లని మీగడ కూడా ఉంటుందా?"

"ఆ."

"చల్లగా ఉండాలిసుమా! రండి, మొగమాటపడకండి ఆర్కాడీ నికోలెచ్, ఇంకా తీసుకోండి. యెవ్‌గనీ ఇంకా రాలేదేమీ?"

"ఇదుగో ఇక్కడున్నాను", బజరోవ్ గొంతుక ఆర్కాడీ గదిలోనించి వినపడింది.

వాసిలీ ఇవానోవిచ్ చటుకుని వెనక్కి తిరిగి చూశాడు

"ఆ. నీ స్నేహితుడిని చూద్దామని వచ్చావు. కాని నువ్వు చాలా ఆలస్యం చేశావు. నేనప్పుడే చాలాసేపు అతనితో మాట్లాడాను. ఇంక మనం టీకి వెళ్ళాలి అమ్మ పిలిచింది. మరిచిపోయాను, నీతో కాస్త మాట్లాడాలి."

"ఏ విషయం?"

"ఇక్కడో రైతు ఉన్నాడు. ఇక్టిరస్‌తో బాధపడుతున్నాడు..."

"నీ అభిప్రాయం కామెర్లనా?"

"అవును. చాలా తీవ్రమయిన ఇక్టిరస్. కొన్ని మూలికలు ఇచ్చాను. ములంగి తినమన్నాను కాని అవన్నీ కాస్త ఉపశమనంగా పనిచేస్తాయి. ఏదన్నా సరియయిన మందు పడాలి. వైద్యమంటే నీకు వేళాకోళమేగాని నువ్వు ఏదన్నా మంచి సలహా ఇవ్వగలవు సరే అది తరవాత మాట్లాడదాం. టీతాగుదాం రండి."

వాసిలీ ఇవానోవిచ్ తను కూర్చున్న ఆసనం మీదనించి చటుకున లేచాడు. మెల్లగా గొంతుకలో రాబర్ట్ వెడబుల్ వ్రాసిన పాట పాడుకున్నాడు.

"మాకు మేము విధించుకున్న పథము
సుఖముకొరకు జీవనము."

"చిత్రమయిన జీవశక్తి," అనుకున్నాడు బజరోవ్, కిటికీదగ్గరనించి ఇవతలకు వస్తూ.

* * * *

అప్పుడే మధ్యాహ్నమయింది. చిరుగులేని పల్చని మబ్బుతెరవనక సూర్యుడు వేడిగా వెలుగుతున్నాడు. శబ్దంలేని నిస్సబ్దత అంతటా ఆవరించింది. దూరంగా పల్లెలో మట్టుకు కోడిపుంజులు ఒకదాన్ని ఉద్దేశించి మరొకటి చిరాకుగా కూస్తున్నాయి. ఆ కూతలు వింటుంటే చిత్రమయిన మగత. అసహనం మనస్సుని ఆవరిస్తున్నాయి. ఎక్కడో చెట్ల చిటారు కొమ్మల్లో డేగ కీచుగా కూస్తోంది ఒక చిన్న గడ్డివాము నీడలో ఆర్కాడీ బజరోవ్‌లు వెల్లకిల పడుకున్నారు. ఇంకా పచ్చదనంపోని కొత్తగడ్డి మెత్తగా పరుచుకుని పడుకున్నారు.

"ఆ సరవ ఐడిచెట్టు చూస్తే," బజరోవ్ ప్రారంభించాడు, "నాకు నా చిన్ననాటి రోజులు జ్ఞాపకం వస్తాయి. ఇటికలకోసం తవ్విన పట్టిగోతుల పక్కని మొలిచింది. ఆ గోతులు, ఆ చెట్టు, వాటిలో ఏదో నన్ను కాపాడే శక్తి ఉందని ఆ రోజుల్లో నేను గట్టిగా నమ్మేవాడిని. అక్కడ ఉన్నంతసేపూ నాకు తోచకపోవడమంటూ ఉండేదికాదు. దానికి కారణం చాకురతనమేనని నాకు ఆ రోజుల్లో తోచలేదు. ఇప్పుడు నేను పెద్దవాడినయాను. వాటిలోనించి ఆశక్తి ఏదో పోయింది"

"ఇక్కడ మొత్తంమీద ఎన్నాళ్లున్నావు?" ఆర్కాడీ అడిగాడు.

"రెండుసంవత్సరాలు పూర్తిగా ఉన్నాను. తరువాత్తరువాత ఇక్కడా అక్కడా తిరిగాం. చాలావరకు ఒక ఊరినించి ఒకఊరు తిరగడంతోనే సరిపోయింది."

"ఈ ఇల్లుకట్టి చాలాకాలమయిందా?"

"అవును. మా తాత కట్టించాడు—మా అమ్మ తండ్రి."

"ఎవరాయన?—మీ తాత?"

"ఎవడికి తెలుసు? ఏదో సహాయదళాధిపతి అనుకుంటాను. సువరోవ్ కింద పనిచేశాడు. ఆల్ప్స్‌పర్వతాలు ఎల్లా దాటాడో కథలుగా చెపుతుండేవాడు—బహుశా కోతలనుకుంటా."

"ముందు సావడిలో సువరోవ్ పటం ఉంది. మీ ఇల్లులాంటి పాతకాలపు ఇళ్ళంటే నాకు ఎంతో ఇష్టం. ఎంతో వెచ్చగా ఉంటాయి. చిత్రమయిన గంధం ఏదో వాటిని పట్టుకుని ఉంటుంది."

"కాలిన చమురువాసన," బజరోవ్ ఆవులిస్తూ అన్నాడు, "తరవాత ఈ ప్రియతమమయిన పాతఇళ్ళలో ఈగలూ...అబ్బ!"

"అవునుగాని," ఆర్కాడీ కొంచెంసేపు ఆగి అడిగాడు, "నీ చిన్నతనంలో నిన్ను మీ పెద్దలు బాగా అదుపాజ్ఞలో పెట్టేవారా?"

"మా అమ్మ, నాన్న, ఎలాంటివాళ్లో నువ్వు చూశావుగా. అంత కఠినమయిన మనుష్యులు కారు."

"యెవ్‌గనీ, నీకు వాళ్ళంటే ప్రేమ ఉందా?"

"ఉంది ఆర్కాడీ."

"నువ్వంటే ఎంత ప్రేమోయి వాళ్ళకి!"

బజరోవ్ కొద్దిసేపు మౌనంగా ఉన్నాడు. "నా ఉద్దేశమేమిటో తెలుసా?" అన్నాడు చివరకి. చేతులు రెండూ తల వెనక ముడుచుకున్నాడు.

"నా తలిదండ్రులకు జీవితం చాలాసుఖమయినది. అరవైయేండ్ల వయస్సులో ఊరికే తాపత్రయ పడుతున్నాడు—ఉపశమనాలంటూ, వైద్యమంటూ, రైతుల ఎడ తన దాతృత్వం ప్రకటిస్తూ—చాలా కులాసాగా రోజులు గడుపుతున్నాడు. మా అమ్మకూడా సుఖంగానే బతుకుతోంది. రకరకాలు చిన్న చిన్న బాధ్యతలు మీద వేసుకొని రోజంతా ఏదో పనితొందరలోనే ఉంటుంది. తన్ను గురించి ఆలోచించుకోడానికైనా తీరిక లేదని సరదాగా మూలుగుతుంటుంది. ఇంక నేను..."

"నువ్వు?"

(19వ పేజీ చూడుడు)

స్వకీయరచనలషష్టిపూర్తిఉత్సవం

జరుపుకొన్నరచయిత

క్లైవ్ హాలండు

[క్లైవ్ హాలండ్ సుప్రసిద్ధ బ్రిటిషురచయిత: 82 సంవత్సరాలవృద్ధు. జాన్ ఆఫ్ లండన్ మొదలైన ఉత్తమసాహిత్య పత్రికలలో అతని రచనలు ప్రకటితమౌతూ ఉంటాయి. ఈ సంవత్సరము ఏప్రెల్ నెలనాటికి, అతనికి ప్రథమరచన ప్రచురణమయి 61 ఏండ్లు నిండాయి. తరువాత ఆయనకు పేరు తెచ్చిన నవలలలో "మైజపానీస్ వైఫ్" అనే నవల. కేవలం ఊహాకల్పితమైన గాథ. చాలా ప్రశస్తికి వచ్చింది. జపానీయులు కూడా, ఆనవలలో చిత్రితమైన పరిస్థితుల వాస్తవికతకు చాలా ముగ్ధులయ్యారు. ఆనవల ఆయన వ్రాసి 53 ఏళ్లు అయింది. అప్పటినుంచి బాగా అమ్మకమయ్యే పుస్తకాలలో ఒకటిగా చలామణీ అవుతూనే వచ్చింది. తన రచయితా జీవితంలోనిండిన షష్టిపూర్తి ఉత్సవ సమయంలో ఆయన ఈవ్యాసం వ్రాశారు. మన కవులలో కూడా, ఈమాదిరిగా 60 ఏళ్ళు. కవిత్వజీవితం గడిచినవాళ్ళు చాలామంది ఉంటారు. అట్టివారు స్వయంగాగాని, వారి నెరిగున్నవారుగాని, ఆయా యదార్థ వృత్తాంతాలు తెలిపితే ప్రచురించగలమని ఆశిస్తున్నాము. సం."]



తమ మొదటి ప్రచురణకు 60 ఏళ్లూ నిండిన ఉత్సవాన్ని స్వయంగా చూసి ఆనందించ గలంతకాలము జీవించిన రచయితలు బహుకొద్దిమంది ఉంటారు. కాని నాకీ అదృష్టం సంభవించటంతో, ఇల్లాంటివాళ్లు ఇంకెవళ్లైనా ఉన్నారో కనుక్కొందామని కొంత ఉత్సాహం కలిగి పరిశీలించటం మొదలుపెట్టాను.

ముందు స్ఫురించినపేరు జార్జి బెర్నార్డుషా పేరు. 1879 లో ఆయన మొదటి నవల ప్రచురితమయింది. అందుచేత 1939 నాటికే ఆయన ప్రథమ ప్రచురణానికి షష్టిపూర్తి ఉత్సవం కుదిరింది.

ఇక కనబడ్డ రెండోపేరు, లార్డు టెన్నిసన్‌ది, 1830 లో మొట్టమొదట ఆయన తన పద్యాలను ప్రచురించాడు. 1890 లో ఇక రెండేళ్లకు ఆయన చనిపోతాడనగా ఆ ప్రచురణకు అరవై ఏళ్లూ నిండాయి.

నా ఎరుకలో నాకీ యిద్దరు రచయితలే కనబడ్డారు.

నేను మొదటిగా ప్రచురించిన పుస్తకం ఒక పిల్లల నవల. అసలు ఆ నవల ఉద్భవించిన గాథ కొంత గమ్మత్తుగానే ఉంటుంది. అప్పుడు జరిగిన విషయ మిది:

నా పదుమూడో ఏట నన్నొక "పబ్లిక్ స్కూలు"లో చదవేశారు. ఆ బడి వాతావరణం నాకు చాలా కొత్తగానూ గందరగోళంగానూ, ఆ పసితనంలో నాకు అడలు పుట్టించేటట్టుగా కనపడుతూండేంది. ఎప్పుడు చీకటిపడి, ఇంక నిద్రకు నడుం వాలుస్తామా అని ఆతృతగా ఉండేది.

అక్కడ చేరిన మొదటిరాత్రి, పిల్లల హాస్టలు లోని నెం 3 రు డార్మిటరీలో మా గది ఉంది. ఆ పొద్దున్నుంచీ అక్కడి బడీ, ఆ పిల్లల అల్లరి, ఆ కొత్త వాతావరణం, అంతా చాలా గగ్గోలుగా అనిపించి, ఎప్పుడు పక్కలో చేరి ముసుగెట్టుకు పడుకొందామని చూచాను.

ముసుగు బిగించి, ఆ కొత్తదనంలో, ఒంటరివాడిలాగా బాధపడుతూ, అమ్మా, నాన్నా, ఇల్లు, ఇంటిదగ్గర సుఖమూ, అన్నీ జ్ఞాపకాలొచ్చి, చెంగగా కన్నీళ్లు కారుస్తూ పడుకొన్నాను. ఇంతలో పక్కనున్న పెద్దకుర్రాడు, నన్ను కేకవేశాడు. "ఏయ్! కొత్తబ్బాయి, నువ్వేదన్నా కథ చెప్పాలి. ఇక్కడికొచ్చిన కొత్తవాళ్లంతా అల్లా చెప్పాల్సిందే" అన్నాడు.

చిన్నపిల్లడిగా ఉన్నప్పుడు నేను చాల కథలే చదివాను. ఆ కథల్లోంచి, ఊహిస్తూ, కొంత కొంత కథలు పొడిగించుకొంటూండే వాణ్ణి.

ఇప్పుడు ప్రక్కనున్న కుర్రాళ్ళు అడిగేటప్పటికి ముందు కొంత తటపటాయించి, చెప్పలేనని బ్రతిమాలుకొన్నాను. చెప్పక వీల్లేదని వాళ్లు పట్టుపట్టారు. చివరికి ధైర్యం తెచ్చుకొని కథ అల్లటం మొదలు పెట్టాను. కుర్రాళ్లంతా కుతూహలంగా వినటం మొదలుపెట్టారు. ఆ కథ ఆ రాత్రితో అంతం కాలేదు. రోజూరోజూ వాళ్ల ప్రోత్సాహంతో, సీరియల్ కథగా మారింది. పోనుపోనూ, మా గదిలో పడకొనే కుర్రాళ్లే కాకుండా, ప్రక్కగదుల్లో కుర్రాళ్ళుకూడా కథ వింటానికి రహస్యంగా అక్కడ చేరుండేవారు. రహస్యంగా ఎందుకంటే, రాత్రి వార్డెన్ వచ్చేడుప్పటికి ఏ గదిలో పిలలు ఆ గదిలో నిద్రపోతూండాలి. లేకుంటే శిక్షతప్పదు. అందుచేత మా కథ చెప్పుకొనేవేళకూడా, వార్డెన్ వచ్చే వేళలు తప్పించుకొనే అమర్చుకొనేవాళ్లం. ఎప్పుడు వార్డెన్ వచ్చినా నెం 3 రు. డార్మిటరీలో పిల్లలంతా ఎవళ్లగదులో వాళ్లు, మంచిపిల్లల్లాగా నిద్రపోతున్నట్టే ఉండేవాళ్లం.

బాల్యం గడిచి పెద్దరికం పైన బడుతూన్న రోజుల్లో, ఆనాటి కథంతా నాకు జ్ఞాపకం వచ్చింది. అప్పటికే ఇంకా చాలా ప్రపంచ జ్ఞానమూ, పుస్తకజ్ఞానమూ కూడా అలవర్చుకొన్నాను. ఊహాశక్తి కూడా వృద్ధి పొందింది. ఆ చదువు కోటాల్లో, నేనుకూడా స్వయంగా రచయిత నెందుకు కాకూడదా అనిపించింది.

చిన్ననాడు చెప్పిన కథ ఎందుకు వ్రాయకూడదా అని మెఱపులాగ స్ఫురించింది. నాకు జ్ఞాపకశక్తి బాగా ఉండేదే. అందుచేత కథ అంతా కూడా స్పష్టంగా జ్ఞాపకమూ ఉంది. అప్పటికి లాయరు పట్టాకి తయారులో ఉన్నాను. రచయిత నవగలనా! ఏమో ఎవ రెరుగుదురు. ఆ కథ వ్రాసి ప్రయత్నించి చూస్తా ననుకొన్నాను.

కథవ్రాసి, మా తండ్రికి చూపించాను. "బాగుంది, పబ్లిషర్సుకు పంపిస్తా"నని, మాతండ్రి ఉత్సాహ మిచ్చారు. ఆ పబ్లిషర్సు, పుస్తకాన్ని తీసుకొని ప్రకటించారు. సరిగ్గా ఈ 1948 ఏప్రిల్ కు ఆ ప్రచురణ జరిగి ఆగవై ఏళ్ళు నిండాయి.

పత్రికలు ఆ పుస్తకాన్ని అభిమాన పూర్వకంగా విమర్శించాయి. పుస్తకం రెండోముద్రణ అందుకుంది.

ఆ విధంగా నా రచన ప్రారంభమయింది.

రచయిత జీవితంలోని వైఫల్యాలు, నైరాశ్యం—వాట్ల విషయం ప్రసంగించటం అంత మంచిది కాదు కనుక వదిలేస్తున్నాను. పోతే ఆ జీవితంలో ఉన్న సుఖాలలో పర్యటనకున్న మహదవకాశం ఒకటి: రచయిత ఎక్కడ ఏచోటున కూర్చునైనా రచన సాగించుకోవచ్చు. అదీకాక ఈ పర్యటనల సందర్భంలో, చాలామంది క్రొత్తవారు, కొత్తకొత్త రమ్యమైన స్నేహాలూ, అనేకమంది సాటి రచయితలతో పరిచయాలూ కలగటమనేది ఒక గొప్ప సుగుణం.

నేను లాయరువృత్తిలో పేరు దెచ్చుకోబోటంలేదని మావాళ్లకు తెలిసేటప్పటికి వాళ్లకు చాలా ఆశాభంగం అయింది. నా పేరుతోనే రచనలుకూడా ప్రకటించసాగితే మావాళ్ళకింకా బాధగా తోస్తుందేమోనని భయమేసి, అప్పటికి అందంగా తోచిన ఒక మారు పేరు పెట్టుకొని రచన సాగించాను.

రాబర్టు లూయీ స్టీవెన్సన్ అంతటి మహాకవి కూడా నాకు చాలా ప్రోత్సాహ మిచ్చి, రచనలో నా కౌతుహ్యం కల్గించాడు. ఆయనను నేను మొదట కలుసుకొన్నప్పటికి, ఆయన ఆరోగ్యంకోసమని బోర్నమత్‌లో విశ్రాంతి తీసుకొంటూన్నాడు. బోర్నమత్ నేను పుట్టిన ఊరు. చాలాకాలం పెరిగిందికూడా అక్కడే. ఆయన వ్రాసిన పుస్తకాలు అప్పటికే నేను చాలా చదివాను. ఒక జూలై నెలలో, మధ్యాహ్నంవేళ. ప్రకృతి చాలా రమ్యంగా ఉన్న సమయంలో, వెస్ట్ క్లిఫ్ కొండమీద నిల్చొని, సముద్రతీరం వంపున ఉన్న కొండలను, వాటిని అంటిఉన్న పచ్చికబయళ్లను చూస్తూ నిలుచున్నాడు ఆయన గుస్తులను బట్టి పోల్చుకొన్నాను. బక్క పలచనిరూపం బుజాలదాకా జీరాడుతున్న నిడుపు వెంట్రుకలు, ఏదో తీరని కోర్కె వెలిబుచ్చే, దీనవదనం—ఆ అందమైన కళ్లూ—ఆయన్ని వెంటనే పోల్చుకొన్నాను.

ఆ రోజుల్లో ఉండే యువక సాహసంతో, కాస్సేపు అల్లా ఆయన ప్రక్కనే నుంచున్నాను. ఆయన కొండల్లోనుంచి పచ్చికల్లోనుంచి, దూరాన ఏదో ఒక ప్రత్యేక స్థలంకేసి దృష్టి సారిస్తూన్నట్లుగా చూస్తున్నాడు. తాను నిల్చున్న ఆ చోటు తన కిష్టమైనదని, ఆ స్థలం తనకు స్కాట్లండును జ్ఞప్తికి తెస్తూంటూ దని ఆయన తర్వాత నాకు చెప్పాడు. అల్లా కాసేపు ఆగి "మీరు రాబర్టు లూయీ స్టీవెన్సన్ గారు కారా?"అని అడిగాను. "ఔ"నన్నాడు. ఆయన "ట్రెజర్ ఐలండ్" చదువుతూంటే, నాకు ఎంత ఆనందం కలుగుతూండేదో ఆయనతో వివరించసాగాను—

"కుర్రతనపు కథ—అంతకంటే అందులో ఏమీ లేదు" అని ఆయన జవాబు చెప్పాడు—

ఆ తర్వాత ఒకసారి, ఆ కథ వ్రాయటం ఎల్లా మొదలు పెట్టాడో ఆయన నాకు చెప్పాడు. ఒకనాడు వర్షం కురుస్తోంటే, ఆయనచుట్టాల్లో ఒక యువకుడు, ఆయనా ఒక గదిలో కూర్చుని, కాలం గడపవలసిరావటంలో, నేలమీద పెద్దదిగా "ట్రెజర్ ఐలండ్" పటం గియ్యటానికి ఎల్లా మొదలు పెట్టిందీ, ఆతర్వాత కథ ఎల్లా పుట్టుకొచ్చిందీ, అదంతా కూడా ఆయన చెప్పాడు.

అప్పటో ఆయన ఇంటికి తరుచు వెళ్తూండే వాణ్ణి. ఆ యింటికి ఆయన "స్కెర్రీవోర్" అని పేరు పెట్టాడు—ఆ పేరు ఒక ప్రసిద్ధమైన లైట్ హౌస్ పేరు. ఆ లైట్‌హౌస్‌ను ఆయన తాతగారైన రాబర్టు స్టీవెన్సను—ఇన్నర్ హెబ్రిడీస్ దీవుల అంచుకొండల్లో,—స్వయంగా నిర్మించాడు. ఆ పేరు స్మృతి చిహ్నంగా కవి తన నివాసానికి పెట్టుకొన్నాడు.

ఆయన యింటికి వెళ్తూ వస్తూఉండే రోజుల జ్ఞాపకాలన్నీ మధుర స్మృతులై, నా మనస్సులో హత్తుకొనిపోయి ఉన్నాయి. ఒక మధ్యాహ్నం అక్కడకు వెళ్లినప్పుడు ఆయన మేడమీదనుంచి మెట్లు దిగిరావటంకోసం క్రింది హాలులో కనిపెట్టుకొని కూర్చున్నాను. మిసెస్ స్టీవెన్సను, ఆయన్ను తన చేతులో పసిపిల్లవాడి నెత్తుకొనివస్తూన్నట్లు, ఎత్తుకొని మెట్లు దిగి వస్తూన్న దృశ్యం, అల్లాగే నా మనస్సులో హత్తుకుపోయింది. అప్పటికి స్టీవెన్సను అంత కృశించిపోయి, పసిపిల్లవానికన్న తేలికగా అయిపోయాడు.

తర్వాత ఆయన సమోవా దీవులకు వెళ్లిపోయాడు. అక్కడి ప్రాకృతిజనం, ఆయననొక నాయకుని చూచినట్లుగా ప్రేమతో చూసుకొనేవారు ఆ రోజుల్లో ఆయనకూ నాకూ చాలా ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయి. ఒక్క ఉత్తరంలో, నా రచనను గురించి వ్రాస్తూ, నాకూ చాలా ప్రోత్సాహమిస్తూ వ్రాశాడు. వర్ధమానరచయితకు ఆ ఉత్తరంలోని సలహాలు చాలా ఉపకరించాయి. కౌమార్యంలో, రచయిత సాధకబాధకాలను స్టీవెన్సను బాగా ఎరుగును. "నువ్వు కాస్త పైకొస్తున్నావని చెప్పుకో గలిగినందుకు నాకు చాలా సంతోషము. మనం చెయ్యగల్గింది ఎడతెగని కృషి చేసూ నిరంతరమూ రచన సాగించటమే——కృషికూడా తీవ్రమూ, ఉద్విగ్నమూ, అయితే,—కీర్తిపథాన్ని అదే చాలమటుకు సుగమ్యంగా చేసి పెడుతుంది."

రచనలో శ్రమదీసుకోటం అంటే ఏమిటో ఆయనకు బాగా తెలుసును. తన రచనలను పునఃపునః పరిశీలించుకోటంలో, ఎంతో శ్రమ ఎంతో జాగ్రత్త ఆయన తీసుకొనేవా.

స్టీవెన్సనను కలుసుకొన్న కొన్ని ఏండ్లకు థామస్ హార్డీని కలుసుకొన్నాను. అప్పటికింకా ఆయన "టెల్ ఆఫ్ ది డర్బరీ విల్లేస్" ప్రచురణతో వచ్చిన విమర్శకదుమారం ఆగలేదనే నాకు జ్ఞాపకం. నాకు అంతకుముందే ఎప్పటినుంచో హార్డీ రచనలంటే అభిమానం ఉండేది. ఆయన రచనల గురించి చాలా వ్యాసాలు కూడా వ్రాశాను. ఆ సందర్భంలోనే న్యూయార్కులోని, ఉత్తమసాహిత్య పత్రికా సంపాదకు లొకరు—హార్డీ నవలలను గూర్చి, ఆ నవలల కాటపట్టయిన వెస్సెక్సు ప్రాంతం గూర్చి, ఒక మూడు వ్యాసాలు వ్రాసియిస్తారా అని నన్నడిగారు. హార్డీ రచనలలోని స్థలాలకు చాలా వాట్లకు నా దగ్గిర ఛాయాచిత్రాలున్నాయని వాళ్లు విన్నారట. చివరకు వ్యాసాలు వ్రాస్తానని ఒప్పుకున్నాను.

ఆ కారణంగా, "మిమ్మల్ని ఒకసారి కలుసుకొని మాట్లాడాలి. రావచ్చునా!" అని హార్డీకి ఉత్తరం వ్రాశాను. వెంటనే "తప్పక, రావలసిందని" క్లుప్తంగా జవాబిచ్చాడు. హార్డీ మాటలు న్యాయం చెయ్యడు. ఆయనతో స్నేహం ఆవిధంగా మొదలు పెట్టి, ఆయన మరణానంతరం దాకా సాగింది.

బూర్న్మత్ నుంచి సైకిల్‌మీద బయలుదేరి ఒక జూలై మధ్యాహ్నంవేళ మాక్సిగేట్ (హార్డీ ఉన్నచోటు) చేరుకున్నాను. కచ్చేరీ గదిలో కాసేపు కూర్చునేలోపలే ఆయన నా దగ్గిరకు వచ్చాడు. ఆ గదిలో చుట్టూ వెస్సెక్సు ప్రకృతి రంగాల దృశ్యాల, చిత్రాలు అలంకరించి ఉన్నాయి. బీరువాలలో వింతవింత పురాతన వస్తుసముదాయం అమర్చబడి ఉంది. డార్చెస్టరు రోమక పరిపాలనంలో ఉన్న నాటి పురాతన వస్తువులు, మాక్సగేటు శిథిలాలను తవ్వినప్పుడు దొరకిన వాటిని సేకరించానని ఆయన చెప్పాడు. గదిలో గాలీ, వెల్తురూ, విశాలంగా ప్రసరిస్తూ సుఖదాయకంగా ఉన్నాయి.

ఒక బ్రౌను ట్వీడ్‌నిక్కరూ, ఒక వదులు చొక్కా తొడుక్కొని ఉన్నాడు ఆయన. ఆ దుస్తులంటే ఆయనకు చాలా ప్రీతి. చాలాసేపు అవీ, ఇవీ అన్నీ మాట్లాడుకుంటూ గడిపాము. తరువాత తోటలోకి కవిలో, అల్పాహారాలు స్వీకరించాము.

ఆ తోటలో ఒకమూలగా ఒక నిటాలుగా ఉన్న పొడుగాటి శిలాఖండము ఉంది. బహుశా డ్రూయిడ్సు కాలమునాటి దయి ఉంటుందని ఆయన చెప్పాడు. ఆ శిల ప్రక్కని మల్చొని, అక్కడ తవ్వినప్పుడు రోమకసైనికుల అస్థిపంజరాలు ఎన్నో దొరికిన కథంతా ఆయన చెప్పటం మొదలుపెట్టాడు. ఉండిఉండి హఠా

(16 వ పేజీ చూడుడు)

తెలుగులో వ్యవహారము

శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి

స్వరాజ్యం ధర్మమా అని నేటికి మాట పుట్టింది. తూర్పుగోదావరిజిల్లాలో ఆచరణలోనికి వచ్చింది. రమారమి నూటేళ్లకు మళ్ళీ మన మాతృభాష రాజకీయ కార్యాలయాలలో ప్రవేశించడమనేది గొప్ప యోగమే. ఇందుకు ప్రభుత్వమును ప్రశంసిస్తూ, ఈ విషయమును గూర్చి యించుక ముచ్చటించుకొందము.

సాధారణంగా గ్రాంథికభాషకు వ్యావహారిక భాష కొంచెం దూరంగా ఉంటుందన్నమాట స్పష్టమేకాని, సుమారు నాలుగువందల సంవత్సరములు మనదేశము విజాతీయ ప్రభుత్వముల పాల్పడియుండుటచే పరభాషలతో చెలిమి సలుపుచువచ్చిన మన నేటి వాడుక తెలుగు. మన ప్రాచీనభాషకు బాగా దూరంగా ఉన్నదనీ, నేడు దేశము నలుగెలల బయలువెడలుచున్న రకరకాల రచనలలోని వాడుకభాషకు కూడా రాజకీయ కార్యాలయములలో వాడబడు తెలుగు మరీ దూరముగా నుంచుననీ ముందనుకొని యీ విషయం చర్చించుట యుక్తము.

నేటి వాడుక తెలుగు సర్వతోముఖము బహువిధ వ్యాపారపరతంత్రము. అయినా, పసా కల్యము కాదు. కాని, దీని దూరదృష్టియు దూరాలోచనమును దీకట్టి సంపూర్ణ స్థితిని లేకపోవు. ప్రపంచములోని యే భాషయు భాషాంతరముతో సహవాసము చేయకుండా అభివృద్ధికి రాలేదు. దేనిమాటో మనకెందుకు? హిందూదేశభాషలకెల్ల తల్లి యనదగు సంస్కృతమే అక్కడనుబట్టి భాషాంతరపదములు కొన్ని స్వీకరించుకొన్నది. అట్టియెడ మన తెలుగు తన యభివృద్ధికై యితర భాషలనుండి యావశ్యకములైన శబ్దములను గ్రహించినదన్న తప్పేమి? ఇంకా కావలసిన శబ్దజాలమునంతను స్వీకరింప దీని కవకాశము చిక్కలేదుగాని, అట్టిది లభించినచో మన భాష యింతకు రెట్టింపై యుండును. ఇక నట్టి స్థితి రాగలదు.

మొట్టమొదట మన శుద్ధదేశ్యమునకు సంస్కృత ప్రాకృతము లెట్టివో, తరువాత హిందూస్తానీ యాంగ్లము లట్టివి. తొలుత వాటినుండి గ్రహించినట్లే పిదప వీటినుండి పదములను గ్రహించినది. అటు కొన్ని ఒరియా పదములను, ఇటు కొన్ని తమిళకన్నడ పదములను గైకొన్నది. తప్పదు, అది భాషల స్వభావము. జాత్యభ్యుదయమునకు భాషాభివృద్ధి మూలము కదా! వాడుకలో నెక్కువగాను, పుస్తకాలలో మిక్కిలి తక్కువగాను హిందూస్తానీ పదాలెన్నో కలిసిపోయినవి. అందు కొన్ని "ఇవి యన్యదేశ్యములు కావు తెలుగులే," అని ప్రజలనుకొదిగినంతగా మన భాషలో నైక్య మందినవి. కాగితం-కలం-సిరా-దస్తూరీ-గుమాస్తా ఖరీదు-ఖర్చు-ఇత్యాదులు వందలు; తహసీల్దారు-సిరస్తాదారు--హుజూరు--హుకుం--మంజూరు-ఖైదు-ఖాళీ-కామందు-ఖులాసా- ఇత్యాదులు సుమారు వెయ్యిపదములు తెలుగులో మిళితమైనవి. ఇట్లే ఇంగ్లీషుమాటలు వందలుగా మన భాషలో చేరినవి. వీటి ప్రవేశము చిత్రమైనది. ఆ యర్థములందుపయోగింపదగిన తెలుగు పదాలు సిద్ధముగా నున్నా, వాటినికూడా గెంటివేసి ముందు సిద్ధమైనవనేకము లున్నవి. చదువుకొన్నవారేకాదు, చదువురాని స్త్రీపురుషులు కూడా నిత్యము వాడుచున్న యట్టి యాంగ్లపదము లెన్నో సర్వత్ర శ్రుతిగోచరమగును. ఈ యభ్యాస మిపుడు తప్పించుటకు గాని, నియమించుట గాని శక్యముకాని స్థితికి వచ్చినది. హిందూస్తానీ శబ్దములవలెనే యివియు కొన్ని కొన్ని రూపమున నించుక మార్పు చెందియు, చెందకయు కూడా దేశమంతట వాడుకలో స్థిరపడినవి. ఇందుకు కొన్నికొన్ని యుదాహరణములు:

ఆఫీసు-కోడు-రైలు-స్టేషను-టిక్కెట్టు-పోలీసు-స్కూలు-టైము-కోటు-కోర్టు-జడ్జీ-ఫీజు ఇత్యాదులు వందలవందలు. వీటికి సరియైన పదములున్నా, లేకపోయినా, వీటిని తెలుగునుండి తొలగించలేము. ఫర్లాంగు-మైలు-లాకు-డాము-కలెక్టరు-పెన్సిలు-బిల్లు-సర్వే-ఇంజనీరు ఇట్టి వెన్నో! వీటికి సమానార్థక పదములను మనము కల్పించినా, వాటిని వాడేవారుండరు. చాలా కాలము క్రిందట 'కలెక్టరు' అనుటకు, మండలకరగ్రాహి యని యొకరు ప్రయోగించిరి. దీనిని మరెవ్వరును వాడలేదు గాని, ఇది సమానార్థకమా? ఇంతకంటె, మండల కరగ్రాహి యనుట సముచిత మనిపించుకేమో! పెన్సిలు కొకరు సీసపుకణిక యన్నారు. ఇది యీ జన్మలో వాడుకలోనికి వచ్చునా? వాడుక యనగా ప్రజలనోళ్లలో బడి నలిగిపోవడం. అట్లు స్థిరపడినదానికి తిరుగుండదు. అయితే అట్లన్యదేశ్యమిశ్రమైనది తెలుగేనా యని యొకరును, అవి తీసివేస్తే వ్రాతలే సాగవని యొకరును, వాటి యర్థమున తెలుగుపదాలు కల్పిస్తే అర్థమే కాకుండా పోతుందని యొకరును సందేహింపక మానరు. కాని, ఆట్టిదంతా వాడుక తెలుగే యని యొకమాటలో బదులు చెప్పవచ్చును. ఏ భాషయైనా, తాను చేర్చుకొన్న యన్యదేశ్య శబ్దజాలమునంతను తనదిగానే భావించును. అది భాషల సహజధర్మమే. ఆంగ్లము మనదేశమునకు వచ్చిన పిదప హిందుస్తానీ పదముల కొన్నిటిని స్వీకరించినదో! అందాకా యెందుకు? కూలి-మడ్-సునాం-బెండె గుపదములను మన తెలుగునుండి తీసికొనలేదా? అంతమాత్రముచే దాని యాంగ్లత్వమునకు హానివచ్చినదా?

పై యుత్తరువు వచ్చిన పిదప కార్యాలయములలోని గుమస్తాలు కొంచెం తొట్రుపడుచున్నారని నే నెఱుగుదును. ఇది సంధికాలము గనుక, ఆ మాత్రము తడబాటు తప్పదు. ఆంగ్లములో ముందు వాక్యము వ్రాసుకొని దానిని తెలుగులోనికి దింప యత్నించుట యాతడబాటుకు గల కారణములలో మొదటిది. బంధుమిత్రులకు కూడ తెలుగులో నుత్తరం వ్రాయడ మలవాటు లేకపోవడం రెండవది. రెండుమూడు నెలలలో నొకవిధముగా వీరు సర్దుకొందురేమో గాని, యెట్లయినా, రాజకీయములయిన యన్ని కార్యాలయములలో నున్న వివిధ వ్యవహారమన్నివిధముల పారిభాషికమును స్వభాషా సంప్రదాయమునకతీతమునయి యుండును గావున ఆయా విషయములు నిస్సందేహముగా నందఱికొక్క రీతి నర్థమగునట్లు వ్రాయుటకొక ప్రమాణగ్రంథ మావశ్యకమని భావింపక తప్పదు. శంకరనారాయణ నిఘంటువు చూచుచు నొకరిద్దఱు తెలుగు పదముల నుపయోగించుట నేను చూచితిని. ఒక గుమాస్తా 'యువర్ కౌంటరు సిగ్నేచరు' అన్న దానికి "మీ రెండవ చేవ్రాలు" అని వ్రాసెను. ఈ విధముగ వివిధ కార్యాలయములలోని గుమాస్తాలను వ్రాయుచుందురని మనమనుకోక తప్పదు. అందుచే 'తెలుగులో వ్యవహారం' అని ప్రభుత్వమూరుకోక, ఆ వ్యవహారం సార్వత్రికముగా సమానముగా జరుగుట చూడవలసియున్నది. అందుకు కావ్యశబ్దార్థముజ్ఞానముతో సంబంధము లేకుండా, కేవలము వాడుకలో నున్నట్టి, యితర భాషలకును, ఏవిధము అయిన వృత్తులకును బహువిధములైన విదేశవస్తువులకును సంబంధించినట్టి శబ్దజాలమునకు సముచితార్థ వివరణముతో "వ్యావహారికాంధ్ర నిఘంటువు" తయారుచేయించి ప్రకటించుట యత్యంతావశ్యమని భావించవలసి యున్నది.

అట్టి నిఘంటువు ప్రకృతము దేశాభ్యుదయమునకు మూలములైన వివిధశాస్త్రములను తెలుగులో ననువదించుకొనుటకు కూడా ప్రమాణమైనది కావలెను. ఆ పని ముందు చేయించక యేయే విషయమందెట్టిగ్రంథము వ్రాయించినా అది తెలుగు దేశమంతటికిని సర్వసాధారణముగా నంగీకరించునది కాబోదు. ఇపుడు తెలుగులో ననువదింపబడుచున్న యాయా శాస్త్రరచనలు పరిశీలించినచో నది స్పష్టపడగలదు.

అందఱిదారి వేఱూ, ఆంధ్రులదారి వేఱూ, వీరిలో అందఱూ పెద్దలే. అందఱూ అన్నిటికీ అర్హులే. అందుచేతనే మనవారు గ్రంథకారులే కాక, క్రియాకారులు కారనిపించుకొనుచున్నారు. ఎక్కడలేనన్ని కులభేదాభిమానములకు స్వాభిమానములకు సార్థకరాయణత్వమునకు ఆంధ్రదేశ మాలవాలమై యున్నది. గజ్జలకు కొఱతపడియున్న యీ నేతి మితరవిషయములందే దారినిపోయి యేమగునో యిపుడు విచారించవలసినది లేదుగాని, ఆ బాలగోపాల మాంధ్రజాతియంతయు బహువిధముల నభివృద్ధి గాంచుటకు వివిధవిషయక విజ్ఞాన మావశ్యకము గావున నందుకు తగిన సాధనము లాలోచించుట ప్రభుత్వము విధి. వాటి కన్నిటికి మూలము వివిధ శాస్త్రములకు సంబంధించిన శీర్షికలతోని వ్యావహారికాంధ్ర నిఘంటువు.

పొన్నేరి తాలూకాలో ఆంధ్రులు

శ్రీ చల్లా కృష్ణ

స్వరాష్ట్ర సంపాదనకై మనము తహతహలాడుచున్నామేకాని, యితరరాష్ట్రములందు పెక్కుయిక్కట్టులకు లోనై నివసించు మన సోదరులను గూర్చి విచారించుట మానితిమి. కాని నేటి పరిస్థితులను బట్టి యావదాంధ్రజాతి, అణిగి మణిగియున్న సోదరాంధ్రుల యాభ్యుదయమునకు పాటుపడి వారి ఆదరాభిమానములను పొందుటకు ప్రయత్నింపవలయును. లేనిచో ఆంధ్రజాతికే కళంక మేర్పడును.

నేడు మన సోదరులు చాలమంది ఒరిస్సా, బొంబాయి, మైసూరు, మదరాసు మున్నగు ప్రాంతములందున్నారు. వారి స్థితిగతులను గూర్చి తెలిసికొనుట మన విధ్యుక్తధర్మము. ఇప్పుడు చెంగల్పట్టు జిల్లాలోని (పొన్నేరితాలూకా) ఆంధ్రసోదరులను గురించి కొంత వ్రాయబూనుకొంటిని.

పొన్నేరితాలూకా ఆంధ్రరాష్ట్రములోనిదే యని మన నాయకులు నొక్కివక్కాణిస్తున్నారు. ఇది సంతసింపదగిన విషయమే. కాని ఒక్కరు కూడ యీ ప్రాంతమునకు వచ్చి యిచ్చట నివసించు తెలుగువారి యిక్కట్టులను పరిశీలించువారే లేరు. ఇది మాత్రము చాలా శోచనీయము. ఇప్పటికైనను సరే మన నాయకులు ఒక్కసారి యీ ప్రాంతములోని ప్రతి పల్లెయందును పర్యటించినచో మనకు లాభము తప్పక చేకూరును. అశ్రద్ధాభావము వహించినచో పొన్నేరితాలూకాకూడ తమిళుల హస్తగత మగునేమో! ఇప్పటికి మన ఆంధ్రులను గూర్చి దుష్ప్రచారములు చేయబడినవి. కనుక ప్రతి ఆంధ్రసోదరుడును యీ విషయమునందు శ్రద్ధవహించి, మన సోదరులను మనలో చేర్చుకొనుటకు ప్రయత్నములు సలుపవలయును.

స్థిరనివాస మేర్పరచుకొని యున్న ఆంధ్ర కుటుంబము లనేకములు యీ ప్రాంతమునందు కలవు. వీరిలో చాలామంది రెడ్లు, కమ్మవారున్నారు. దేవాంగులు తదితరులు కొన్ని గ్రామములందుమాత్ర మధికముగా నున్నారు. సత్యవేడు, ఆరణి, మదనంబేడు, సుబ్బారెడ్డిపాలెం—యీ మొదలైన గ్రామములందు మన తెలుగువారే ఎక్కుడుగ నున్నారు. ఏవో కొన్ని గ్రామములలో తమిళు లధికసంఖ్యాకులు. కొన్ని పల్లెలలో తమిళులు, తెలుగువారు సరిసమానముగా నున్నారు. మొత్తముమీద పొన్నేరి తాలూకాలో ఆంధ్రులే అధికసంఖ్యాకులని తప్పక చెప్పవచ్చును. కాని యీ ప్రాంతము తమిళదేశమునకు సమీపమునందుండుటవలన, చాలమంది దీనిని తమిళనాడు క్రింద భావించుచున్నారు. ఇది కేవలము భ్రాంతి. ఇక్కడకు వచ్చి చూచినచో సంశయము లన్నియు పటాపంచలై పోవును.

ఇక్కడ నివసించు ఆంధ్రులలో అనేకులు కర్షకులు. వీరిలో ధనికులుకూడ కలరు. ఆరణి మున్నగు గ్రామములలో దేవాంగులే అధిక సంఖ్యాకులు. వీరు చక్కని వస్త్రములను తయారుచేయుటలో సిద్ధహస్తులు. వీరందరు నిరాడంబర జీవులు. సోదరాభిమానము కలవారు. సాధ్యమైనంతవరకు కలహములను నివారించుటకు ప్రయత్నింతురు. తమిళ సోదరులు అప్పుడప్పుడు వీరిని 'గోంగూర' యని హాస్యము చేయుచు తమాషాగా మాటలాడుతారు. అయినప్పటికీ వీరిమధ్య (తమిళులు, తెలుగువారి మధ్య) భేదాభిప్రాయములు కనబడవు. సన్నిహిత సంబంధముతో యీ యిరుజాతులు వ్యవహరించుచున్నారు. ఇది చాలా మెచ్చుకోదగినది. గర్వింపదగిన విషయము.

వీరిని 'గోంగూర' యని గేలిచేయుదురని వ్రాసితిని దీనికి కొంత ప్రత్యేకకారణముకూడ కలదు. ఇక్కడి తెలుగువారికి గోంగూర యనిన ప్రీతి. గ్రామములలో గోంగూర తోటలు తెలుగువారు పెంచుచున్నది విశేషముగ నున్నవి. కొందరు సంవత్సరము వరకును పరిపోవునటుల గోంగూర, చింతకాయ మున్నగువానిని పెట్టుకొనెదరు. ఇంతకూ వ్రాయవచ్చిన దేమనగా: వీరు సాంబారు దానులు కానేకారు. అచ్చతెలుగు వారే అని చెప్పుటకు సందియము రవంతకూడ లేదు. అరవవారివలె వీరు గూడకట్టు కట్టుకొనెదరనియు, వీరికి ఆచారవ్యవహారములు మిశ్రములని పలువు రాక్షేపింతురు. గూడకట్టు కట్టుకొన్నమాత్రమున వీరు తెలుగువారు కారు, తమిళులని చెప్పుట పొరపాటు. తమిళులలో కొందరు మనవలె దోవతి కట్టెదరు కదా! కనుక వీరి వేషమును చూచి మనము అపోహపడుట మానవలయును. ఇది అచ్చటచ్చట సహవాస ఫలితము తప్ప మరేమియు కాదు. పండుగ పబ్బము-మున్నగు విశేష సందర్భములందు వీరు పదహారణాల తెలుగు వారివలె వుండుదురు. ఆచార వ్యవహారములలో వీరికి మనకు రవంతకూడ భేదము లేనేలేదు. మన తెలుగు సంవత్సరాదియే వీరికిగూడ సంవత్సరాది. ఇక్కడ నివసించుచున్న మహారాష్ట్రులు, కన్నడులు మన ఉగాదినే తమ ఉగాదిగా భావించుకొని విశేష వైభవముగా పండుగ చేసుకొనెదరు!

ఇంక వీరి భాషనుగూర్చి విచారింతము. వీరుపయోగించు భాషలో తమిళ పదములుండునని సర్కారుజిల్లాల ఆంధ్రులు పరిహసింతురు. ఇది సత్యదూరము కాదు. మనము విమర్శనాదృష్టితో విచారించినచో యీ మిశ్రభాషకు కారణము వీరికి విద్యాసౌకర్యములు లేకుండుటవలనను, సహవాస దోషము వలనను. అయినప్పటికిని, వీరుపయోగించు మాటలనేకములు అచ్చతెనుగు భాషలోనివే అని చెప్పుటకు వెనదీయ నవసరము లేదు. వీరిలో తెలుగు దనము పూర్తిగా నున్నదనియే నా అభిప్రాయము. ఈనాటికిని వీరు అండవాళ్ళు, అంటికాయలు, పొడగట్ట—

(20 వ పేజీ చూడుడు)

భారత రాజకీయాలు :

భాషాప్రయుక్తరాష్ట్ర నిర్మాణం

భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణ పరిశీలనా సంఘ మొకటి రాజ్యాంగపరిషత్ అధ్యక్షుడు డా. రాజేంద్రప్రసాద్ గారిచే నియమింపబడెను. స్వతంత్ర భారత ప్రభుత్వ మేర్పడినప్పటినుండియు భాషాప్రయుక్త రాష్ట్రముల కొరకు ఆందోళన తీవ్రముగ జరుగుచున్నది. కాంగ్రెస్ ఈ సూత్రములను 28 ఏండ్ల క్రితమే ఆమోదించియున్నది. ఆ సూత్రములను ఆచరణలో పెట్టుటకు ఇప్పుడిదను దొరికినది. కాని స్వతంత్ర మైనప్పటినుండియు భారత దేశము అనేక క్లిష్ట సమస్యల నెదుర్కొనవలసివచ్చుటచే భాషాప్రయుక్త రాష్ట్ర పునర్విభజనకు వెంటనే పూనుకొనుటకు వీలులేకపోయినది. నూతన రాజ్యాంగము అమలులోనికి వచ్చు పరికైనను నూతనరాష్ట్రములు ఏర్పడవలెనని భాషా రాష్ట్రవాదులు కోరుచుండిరి. ఇందుకు కాంగ్రెస్ అగ్రనాయకులు ఆమోదించిరి. రాజ్యాంగ పరిషత్తు తిరిగి సమావేశ మగునప్పటికి, ఏయే క్రొత్తి రాష్ట్రములు ఏర్పడవలెనో విచారించి, నిర్ణయించినచో నూతనరాజ్యాంగము ఆమోదించునప్పుడు క్రొత్తి రాష్ట్రముల పేర్లను కూడ దానిలో చేర్చియే వుంచవచ్చును. ఏయే క్రొత్తరాష్ట్రము లవసరమో, సాధ్యమో విచారించి త్వరలో నివేదికను సమర్పించుటకు ఇప్పుడీ సంఘము నియమింపబడినది. ఆంధ్ర, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రముల స్థాపన విషయమై ఈ సంఘము ఆలోచించును. ఈ క్రొత్తరాష్ట్రముల ఏర్పాటుచ వలసిన అవసర మున్నదా? ఏర్పడినచో ఆర్థికముగా అవి తమ కాళ్లపై తాము నిలబడగలవా? మూలముగా, వాని సరిహద్దు లెట్లుండవలెను? అను ఈ విషయములనే ఈసంఘము పరిశీలించును. ఈ సంఘకార్యక్రమము బహుశః ఒక టిన్నర, రెండు నెలలలో పూర్తికావచ్చును. అట్లుపైన, ఈ సంఘము అవసరము, సాధ్యము అని సిఫార్సుచేసిన రాష్ట్రముల సరిహద్దులను నిర్ణయించుటకు వేరొక సరిహద్దు సంఘము ఏర్పరుచబడును.

అలహాబాద్ న్యాయస్థానములో మాజీ న్యాయమూర్తి యస్. కె. ధార్ ఈ సంఘమునకు అధ్యక్షుడు. ఇండియన్ సివిల్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు డా. పన్నాలాల్, రాజ్యాంగపరిషత్తు సభ్యుడు శ్రీ జగత్ నారాయణ్ లాల్ గారలు ఇతరసభ్యులు. బీహార్ అకౌంటెంట్ జనరల్ బెనర్జీ గారు ఈ సంఘమునకు కార్యదర్శి. వీరు నలుగురు ఏకభాషా రాష్ట్రములకు చెందినవారే కాబట్టి భాషాప్రయుక్తరాష్ట్ర నిర్మాణ ఉద్యమమును, వివిధభాషా ప్రాంతీయుల కోర్కెలను నిష్పక్షపాతదృష్టితో పరిశీలించి, అందరికి న్యాయము చేయగలరు. ఏరుగాక ఆయా రాష్ట్రములనుగురించి పరిశీలించునప్పుడు ఆయారాష్ట్రములకు చెందినవారుకూడ ఒక్కొక్కరు ఈ సంఘములో సహాయసభ్యులుగా నుందురు. ఆంధ్రరాష్ట్రము విషయము చర్చకు వచ్చినప్పుడు శ్రీ రామ ఎన్నరాజు గారు, కేరళరాష్ట్ర ప్రసక్తి వచ్చినప్పుడు శ్రీ రామలింగశెట్టి గారు సహాయసభ్యులుగా నుందురు.

ఆంధ్రరాష్ట్రముకొరకు మనము దాదాపు మూడు దశాబ్దములనుండి ఆందోళన జరుపుచుంటిమి. కాని భాషారాష్ట్రనిర్మాణ పరిశీలన సంఘము ఎదుటగాని, తరువాత రానున్న సరిహద్దు నిర్ణాయక సంఘము ఎదుటగాని మన సరిహద్దులనుగురించి వాదించుటకు అవుసరము సాక్ష్యము, వివరములు, చారిత్రకాధారములు, ప్రజాభిప్రాయము ఆందోళన, ప్రచారము మనము జరుపలేదు. ఇన్నాళ్లనుండి లేక పోయిననూ, ఇప్పుడైనను మనము చేయవలసిన కృషి ఎంతో అవసరము. బళ్ళారిలో కన్నడులు, చిత్తూరు, చెంగల్పట్ లలో తమిళులు, గంజాం, కోరాపుట్ లలో ఓఢ్రులు జరుపుచున్న కాని మాచరియైనను మనము మేల్కొనలేకపోయితిమి. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ గాని, ఆంధ్రమహాసభ గాని, ఏ యితరసంస్థ గాని ఆంధ్ర రాష్ట్రము ఎప్పుడు వచ్చునాయని ఎదురుచూచుచున్నవే గాని, లభించునది సమగ్రరాష్ట్రముగా నుండవలెనని కించిత్తైనను కృషి చేయుట లేదు. మనము వద్దన్నను ఆంధ్రరాష్ట్రము ఏర్పడితీరును. కాని, అది మనకు గాని, ముందు తరములవారికి గాని సంతృప్తికరము గునది మాత్రము కాకపోవచ్చును.

ప్రాంతీయభాష - విద్యాబోధన

మదరాసు ప్రభుత్వ సెకండరీ విద్యావిధానమును ఈ పుటలలో ఇదివరకే గమనించియుంటిమి. ప్రాథమిక పాఠశాలలోను, సెకండరీ పాఠశాలలోను ప్రాంతీయభాషకే ప్రాధాన్యమివ్వవలెనను వాదమును ఎవ్వరూ కాదనరు. కాని ప్రాంతీయభాషకు ప్రాధాన్యమిచ్చుట యన్న ఇతరభాషలను, ముఖ్యముగా ఆ ప్రాంతములోని అల్పసంఖ్యాకుల మాతృభాషను, నిర్మూలన మొనరించుట మాత్రము కాదు. తమిళనాడులోని 35 లక్షలమంది తెలుగువారికి తెలుగుభాషాబోధన ఎట్లు కరువై పోవుచున్నదీ, స్వతంత్ర భారతదేశములో ప్రజా ప్రతినిధులు ఇతర భాషలను నిర్మూలించుటకు ఎట్లు పాటుబడుచున్నదీ పైసందర్భమునందే గమనించియుంటిమి. ఇప్పుడా ప్రమాదము ద్విభాషా ప్రాంతమగు మద్రాసునగరమునకు కూడ వ్యాపించినది. మదరాసునగరము తెలుగు, తమిళభాషల కూడలిస్థానమున నున్నది. ఈ నగరము ఇరుభాషలవారు తమ దన్న తమ దని చెప్పుకొనుచున్నారు. భాషారాష్ట్రముల విషయము విచారింపబోవు సంఘములు చెన్ననగర ప్రత్యేకపరిస్థితిని పరిశీలించి, సమంజసమగు నిర్ణయమును చేయగలరని అందరు ఆశించుచున్నారు. ఆ సంఘనిర్ణయము లెట్లుండునో ఇప్పుడు జోస్యము చెప్పుటకు ఎవ్వరును పూనుకొనవక్కరలేదు. ఇప్పుడు తమ చేతులలో నున్న అధికారమును ఉపయోగించి, కొన్ని అక్రమ చర్యలను జరిపి ఆ సంఘమునకు అసమంజసపథోదనికి మార్గమేర్పరచవలెనని చూచుట ప్రజాస్వామ్యవిరుద్ధము. చెన్నపట్నములో తమిళమే ప్రాంతీయభాష యని మన విద్యాశాఖమంత్రి శ్రీ అవినాశిలింగం చెట్టిగారు నిర్ణయించజూచుట ఏవిధముగ పరికించినను అన్యాయము. అసమంజసము, అభూయిష్టమనని చెప్పవలెను. చెన్నపట్నములో నూటికి 51 వంతులు తమిళు లున్నారట! ఇది ఎవరెప్పుడు నిర్ధారణ చేసిరో! అందువలన చెన్నపట్నం తమిళప్రాంతమే నట! చెన్నపట్నంలో నూటికి 51 వంతులు తమిళు లున్నారు అనుటయే సందేహాస్పదము. ఒకవేళ వున్నను, వీరి ఆధిక్యత కేవలము నూటికి 2 వంతులే కదా! నూటికి 49 వంతులు వున్న ఇతరులను అల్పసంఖ్యాకులుగా గణించి వేసి, తమ భాషను వారి నెత్తిపై రుద్ది, వారి మాతృభాషను ధ్వంస మొనరించుటకు ఇట్టి సంఖ్యాబలముతో పూనుకొనవచ్చునా? చెన్నపట్నములో నూటికి 51 వంతులు తమిళు లున్నచో, అది చెన్నపట్నములో ఇతర భాషలను నిర్మూలించవలెననిగాక, చెన్నపట్టణములోని ప్రభుత్వ కార్యాలయములలో నూటికి 51 వంతుల స్థానములు మాత్రమే తమిళులకు చెందవలెనని సూచించును. అయితే ప్రభుత్వ కార్యాలయము లన్నిటిలోను నూటికి 90 వంతులు తమిళులే! వీరిని తగ్గించి, ఇతర అల్పసంఖ్యాక వర్గములకు న్యాయము చేయవలెనని ఈ మంత్రిగారికి తట్టలేదే! అధికారము బహుప్రయోజనకారి యగు ఆయుధము. కాని అది ఏమి పాపమో, అది ఎప్పుడు దుర్వినియోగపర చెడివారి చేతులలో నుండుటకే ఇష్టపడును!

బొంబాయి రాష్ట్రములోకూడ విద్యాబోధన ప్రాంతీయభాషలలో జరుగవలెనని యే నిర్ణయించినారు. కాని అచ్చటి నిబంధన లిట్లు అన్యాయముగా లేవు. ఏ ప్రాంతములోనైనను ఇతర భాషలలో బోధన జరుగవచ్చును. అట్టి పాఠశాలలకు ప్రభుత్వము ఇచ్చును. గ్రాంట్లు కాని ఆ పాఠశాలలలో ప్రాంతీయభాషకూడ బోధించవలెను. ఉదాహరణకు: కన్నడ ప్రాంతములో మహారాష్ట్ర పాఠశాల లుండవచ్చును. అచ్చట బోధన మరాఠీ భాషలో జరుపవచ్చును. కాని కన్నడ భాషనుకూడ బోధింపవలెను. ఇది సమంజసమైన నిబంధన. బొంబాయిలో అంగీకరించిన నిబంధనే ఇక్కడకూడ అంగీకరించిన, తమిళ ప్రాంతములో తెలుగు పాఠశాల స్థాపించవచ్చును. దానికి ప్రభుత్వపు గ్రాంటు లభించును. కాని అచ్చట తమిళముకూడ బోధింపవలెను. అది సమంజసమే. తమిళప్రాంతములో నున్న తెలుగువారు తమిళము నేర్చుకొనవలసినదే. కాని తెలుగు నేర్చుకొనకూడదని నిర్బంధించుట ఎందుకు?

బొంబాయి పట్టణములో ఏ భాషకూడ ప్రాంతీయభాష కాదు. అన్ని భాషలు అచ్చట నేర్చుకొనవచ్చును. మద్రాసు పట్టణమునకు కూడ ఇట్టి నిబంధనే వుండవలెను. విద్యాశాఖ మంత్రి ప్రకటనను ఆంధ్రులందరు, ముఖ్యముగా ఆంధ్రమంత్రులు తీవ్రముగ నిరసించిరి. చెన్నపట్నములో అన్నిభాషలును ప్రాంతీయభాషలుగ నుండవలెను. ఏ ఒక్కభాషకు ఏప్రాధాన్యత వుండకూడదు. విద్యాశాఖామంత్రి తన నిర్ణయమును త్వరలోనే సరిదిద్దుకొనును. కాని ఇట్టి ప్రమాదము విద్యాశాఖకే గాక, రిజిస్ట్రేషన్, కోర్టువ్యవహారములు మొదలగు ఇతర విషయములకు కూడ ప్రాకకుండగ జేయుట అత్యవసరము.

పాకిస్థాన్‌లో నిరంకుశత్వము

పాకిస్థాన్ లో ప్రజాస్వామ్యము ప్రచారముగుటకుగాని, పరిపాలన ప్రజాస్వామ్య పద్ధతులపై జరుపుటకుగాని ముస్లింలీగ్ ఎన్నడు అంగీకరించలేదు. ముస్లింలకందరకు ప్రాతినిధ్యము వహింపగల ఏకైకసంస్థ ముస్లింలీగేనని, ముస్లింల నాయకుడు జిన్నా ఒక్కడే నని లీగ్ మొదటినుండియు స్పష్టపరచుచునే యుండెను. ఈ విషయమును కాంగ్రెస్ చేతను, బ్రిటిష్‌వారి చేతను ఒప్పించవలెనని లీగ్ నాయకులు అప్పట్లో తంటాలు పడుచుండెడివారు. దైవకృపవలన ముస్లింలకు పాకిస్థాన్ లభించినది. పాకిస్థాన్‌లో తాము పూర్వమునుండి ప్రచారముచేస్తున్న ఆ సిద్ధాంతములనే ఆచరణలో పెట్టవలెనని వారిప్పుడు ప్రయత్నించుచున్నారు. పాకిస్థాను పరిపూర్ణ సిద్ధాంతముల ప్రకారము పరిపాలింతుమని లీగ్ నాయకులు ఇదివరలో అనేకపర్యాయములు చెప్పియుండిరి. ఆ సూత్రములనే త్వరలో అమలు జరిపెదరనుటలో సందేహము లేదు. అందుకొరకే వారు ప్రజాస్వామ్యపద్ధతి! పాకిస్థాన్‌లో తావు లేకుండా చేయవలెనని ప్రయత్నించుచున్నారు. ప్రజాస్వామ్య సిద్ధాంత ప్రచారముకొరకు పరిహద్దు గాంధి కొన్ని నెలల క్రితమే పాకిస్థాన్‌లో రెండవ రాజకీయపక్షమును స్థాపించెను. ఈ పక్షము స్థాపింపబడుట లీగ్ నాయకులకు ఇష్టము లేదు. పాకిస్థానీలు లీగ్‌లోతప్ప ఏ ఇతర రాజకీయపక్షములోను చేరకూడదని, పాకిస్థాన్ ప్రమాదావస్థలోనున్న ఈ తరుణమున ప్రజల సామర్థ్యము, శక్తి ఈవిధముగా దురుపయోగము చేయకూడదని వారు బహిరంగముగానే చెప్పుచుండిరి. వారి చర్యలుకూడ ఇందుకు అనుగుణముగానే యున్నవి తూర్పుబెంగాల్‌లో ఉర్దూభాషాస్థాపనను గురించి, సింధురాష్ట్ర మంత్రివర్గ వివాదములనుగురించి, పశ్చిమపంజాబ్ మంత్రివర్గ వివాదమునుగురించి పాకిస్థాన్ గవర్నర్ జనరల్ జిన్నా వైఖరిని గమనించినవారు, తూర్పుబెంగాల్ నుండి సుహ్రావర్దీని వెళ్ళగొట్టినందుకుగాని, ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్‌ను అనవసరముగా మూడేండ్లశిక్ష విధించినందుకు గాని, పాకిస్థాన్ ప్రజాపక్ష కార్యదర్శి జి. యం. సయ్యద్‌ను తన గ్రామమునుండి బయటకు రావద్దని శాసించినందుకుగాని ఏమాత్రము ఆశ్చర్యపడరు.

ముస్లింలీగ్ అధికారవర్గమునకు రెండు రకముల వ్యతిరేకు లున్నారు ఒకటి—లీగ్‌లోపల వున్నవారు, రెండు—లీగ్ వెలుపల నున్నవారు. లీగ్ వెలుపలనున్న వ్యతిరేకులను ఎట్టి తీవ్రచర్యల ద్వారా అణచివేసినను ఫరవాలేదని జిన్నా అభిప్రాయము. ముస్లింలీగ్‌కు—పాకిస్థాన్‌కు కాదునుమా—ప్రజలవ్యతిరేకులు పరిహద్దురాష్ట్రంలో ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్, సింధులో జి. యం. సయ్యద్ గారలు. బెంగాల్ మాజీప్రధాని సుహ్రావర్దీ ఈవర్గములో కలసిపోవుచున్నాడని జిన్నాభయము. ఇప్పుడు ఈ ముగ్గురూ బలవంతముగా కొంతకాలము వరకు అణచివేయబడిరి.

లీగ్ లోపల నున్నవారిలో జిన్నాకు వ్యతిరేకులు లేక పోలేదు. సింధులో మాజీప్రధాని ఖుహ్రో, ఈ వర్గమునకు చెందినవాడే. అతడు బర్తరఫ్ చేయబడి ఇప్పుడు విచారణ చేయబడుచున్నాడు. ఇతరరాష్ట్రములలో కూడ చాలమంది లీగర్లకు జిన్నాపట్ల విముఖత ఏర్పడినను, తమ రాజకీయ జీవిత సౌధములు కూలిపోవునను భయముతో వారాయన చెప్పినట్లు నడచుకొనుచున్నారు. ఏదో ఒక కారణమువలన పశ్చిమ పంజాబ్ ప్రధాని మాందోత్ నవాబుకు త్వరలోనే పదవీభ్రష్టత కల్గినను మనము ఆశ్చర్యపడ నక్కరలేదు.

హైదరాబాద్ సమస్య భవిష్యత్తు

నిజాం భారత ప్రభుత్వాల సంప్రదింపులు భగ్నమైనవి. ఇందుకు ఇరుపక్షములలోను అధిక సంఖ్యాకులు సంతసించుచున్నట్లే వున్నారు. అయితే ఇక ఏమి జరుగనున్నదను ప్రశ్న వారిని బాధించుచునే యున్నది

సంస్థాన సర్వస్వతంత్రతకు కాపాడుటకు ప్రాణములైనా ధారవోసెదమని ఇప్పటివరకు కాశింరజ్వీ ఒక్కడే ప్రేలుచుండెడివాడు. ప్రధాని లాయక్ అలీకూడ ఇప్పుడు అది ప్రారంభించినాడు. సంప్రదింపులు భగ్నమై పోవుటకు భారతప్రభుత్వమును నిందించుచు ఆయన చేసిన ప్రసంగము రజ్వీప్రసంగములను పోలియే యున్నది. సంస్థానములో ఒక్క భారతసైనికుడు ప్రవేశించినా, 5 లక్షలమంది రజాకార్లు భారతయూనియన్‌పై బడగలరనీ మచిలీపట్టణం ముందుగానే ఆక్రమించుకోగలరనీ రజ్వీ చెప్పుచున్నాడు. భారతభూభాగముపైకి వచ్చిన దుండగులను సంస్థానములో ప్రవేశించియైనను పట్టుకొనవలసిందని భారత ప్రభుత్వం తన అధికారులకు ఉత్తరువు లిచ్చెను. కాబట్టి భారత పోలీసులు ఎప్పుడైనను, దుండగులను తరుముచు, సంస్థానములో ప్రవేశింపవచ్చును. అంతట రజాకార్లకు, మన పోలీసులకు సంఘర్షణ తప్పకపోవచ్చును. ఇట్టి చిన్నచిన్న సంఘర్షణలతో ప్రారంభమైచివరకి యుద్ధము తప్పకపోవచ్చును. ఇట్టి సంఘటనయే అనివార్యమైన దానివలన నష్టపడునది సంస్థానములోను, సంస్థాన సంశ్లిష్ట ప్రాంతములలోను అధిక సంఖ్యాకులుగా నున్న హిందువులే. సంస్థానములోని హిందువుల పరిస్థితి ఇప్పటికే ఘోరముగా నున్నది. ఒకవేళ సంఘర్షణయే జరిగినచో, వీరు కొన్నిలక్షలమంది ముస్లిం మతోన్మత్తతకు బలి కావలసివచ్చును. సంఖ్యాబల మెంతి యున్నను, ఆయుధబలము లేకపోయినప్పుడు ఇది తప్పదు.

సంస్థానముగుండా భారతప్రభుత్వపు రైళ్ళు నడచుచునేయున్నవి వీనిపై దాడులు ఇప్పుడు జరుగుచున్నను త్వరలోనే ప్రారంభము కావచ్చును. నిజాం రైళ్ళపై దాడులు, హిందు ప్రయాణీకులను బాధపెట్టుట మామూలుగా, నిత్యకృత్యముగా జరుగుచునేయున్నది తన రైళ్ళకు కాపుదలగా భారత ప్రభుత్వము సైనికులను పంపుచున్నది. కాని ఈ రక్షణ చాలదు. ప్రతి రైలుస్టేషన్‌లోను భారత సైనికులను కాపుంచి, రైలుమార్గము ఎట్టి పరిస్థితులలోను నిరపాయకరముగ నుండునట్లు కాపుదల పెట్టవలెను.

• నిజాంతో సంఘర్షణ ప్రారంభమువాగానే రక్షణ పాంత దేశములో, ముఖ్యముగా ఆంధ్రదేశములో, మత కలహములు ప్రజ్వరిల్లవచ్చును. ఈమధ్యనే గుంటూరులో జరిగిన సంఘటనను

(21 వ పేజీ చూడుడు)

ఒకరా! యిద్దరా?

బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

తరంగాలు రచించిన నారాయణతీర్థులున్నూ, భామకలాపం రచించిన సిద్ధేంద్రులున్నూ వేరు వేరు వ్యక్తులు గాని ఏకవ్యక్తి కాదని వారి కవితారచనే చెప్పుచున్ననూ యీమధ్య తరంగాలు ముద్రించినవారు పీఠిక వ్రాస్తూ భామకలాపకర్తకు సంబంధించిన సిద్ధేంద్రుల (కృష్ణలో యీదుతూ ఆతురసన్న్యాసం పుచ్చుకోవడమూ, తరువాత ఆయన తన భార్యకు యతిగా గోచరించడం వగైరా) బలవన్న్యాసం వగైరా తీర్థులవారికి సమన్వయించినారు. యిది ప్రమాదం కనుక దీన్నిగూర్చి కొంచెం వ్రాస్తాను.

తీర్థులు తెలుగులో కూడా కవిత్వం చెప్పగలరేమో కాని రచించిన దేదీ కనుపడకపోవు. చే సంస్కృతకవిగానే సంభావించాలి. జయదేవుని అష్టపదుల తర్వాత సంస్కృతకవుల గేయకవిత్వ రచన కున్న గౌరవం దీనికి తప్ప మరి దేనికీ లేదు. తీర్థులవారు తెలుగు దేశనివాసి కావడం చేతనే అనుకుంటాను రచన యావత్తూ గీర్వాణమే యైనను సర్వత్రా యతులూ ప్రాసలూ గోచరిస్తాయి. వీట్లని తెలుగుకవులు అవశ్యకాలుగా స్వీకరించారు. గీర్వాణకవులో? శబ్దాలంకారాలుగా స్వీకరించారు. శ్రీమద్భాగవతములో గోపికాగీతలలో శ్లోకాలు యావత్తూ ఆ యతిప్రాసల మయంగానే వున్నాయి. వొకటి రుచిచూపుతాను. తక్కినవి ఆ గ్రంథములో ఆ ఘట్టంలో చదువరులు తిలకింతురుగాక.

"నఖలు గోపికానందనో భవా,
నఖిలదేహినా మంతరాత్మదృక్
విఖనసార్థితో విశ్వగుప్తయే
సఖ! ఉదేయివాన్ సాత్వతాం కులే".

ఆయీ భాగవత శ్లోకానికీ తీర్థులవారి రచనకీ గల పోలిక పరిశీలించండి:

(ముఖారి—అట)

"అచ్యుత అనంత గోవింద
అత్యంతనిర్మలానంద
విచ్యుత సంసారకంద
విశ్వమంగళ ముకుంద! రక్ష రక్ష".

అంత్యప్రాసలూ, అనుప్రాసలూ గేయ కవిత్వానికి సంస్కృతరచనలో కూడా తెలుగులో మాదిరిగా దొర్లుతూనే వుంటాయి. "ధీరసమీరే యమునాతీరే"—అష్టపదులున్నూ తరంగాలున్నూ సంస్కృతరచనే కాని తరంగాలకవిత్వం నూటికి 99 వంతులు తెలుగు సంప్రదాయాలతో నిండివుంటుంది.

దీన్నిబట్టి తీర్థులు తెలుగువాడే అని ఆంధ్రులు గర్వించవచ్చు. కొందరు భామకలాపాన్ని తీర్థులవారి రచనగా భ్రమించడం కూడా వుందేమో? అది చాలా ప్రమాదం. 'సిద్ధేంద్రుల వారి సన్న్యాసం తుదకు బలవత్సన్న్యాసంగా పరిణమించి యౌవనదశకు అనుగుణమైన శ్రీకృష్ణునియొక్కయు సత్యభామయొక్కయు శృంగారమును వర్ణించి, తద్ద్వారా తాను తరించడమే కాక మరికొందరిని (వేశ్యలను) తరింపచేసినట్లు (దేహళీదీపన్యాయం) వ్యాఖ్యానించవం కలదు.

వీరిద్దరూ సన్న్యాసులేకాని యిందులో తీర్థులవారి సన్న్యాసం క్రమప్రాప్తం. స్వతః తీర్థులవారు కవనమందూ గానమందూ ప్రజ్ఞకలవారగుటచే సన్న్యసించినప్పటికీ కేవల నారాయణస్మరణను ఓంకారమంత్రంతో కాక స్వరతాళయుక్తంగా కీర్తనలద్వారా చేసేవారనిన్నీ ఆ కీర్తనలే తరంగము లనిన్నీ తెలివిడి. వీట్లని రచియించిన తీర్థులవారికిన్నీ, కలాపాన్ని రచియించిన సిద్ధేంద్రులకున్నూ యేవిధమైన సంబంధమూ లేదు. 'యెవరికి వారే యమునాతీరే'.

బలవంతంగా సన్న్యసించి సత్యభామా శ్రీకృష్ణుల విప్రలంభశృంగారాన్ని వర్ణించిన సిద్ధేంద్రులు కృ. డి. కూచిపూడివారే. ఆయన ద్వారా గానే "భామనే సత్యభామనే వయ్యారి" వగయిరా దరువులతో నిండివున్న 'పారిజాతం' అనే నామాంతరం గల భామాకలాపం తెలుగు దేశంలో సర్వత్రా వ్యాపించింది. అయితే ఆయీ భామకలాపం యేలా పుట్టిందో అలా మాత్రం ప్రస్తుతం లేదు.

కాలానుగుణంగా కవిత్వంలో యితరుల పైత్యం కొంత చేరింది. చేరనివ్వండి. అవికూడా రసవంతములే.

(1) భామనే, (2) అడగో చంద్రుడు, (3) పదపద్మములు, (4) ఏ అచిపోయి రాక—యిత్యాదులు మాత్రం కవిత్వంలోవే కాని పైత్యంలోవి కావు. గ్రామం యావత్తూ వొక మాటేనా ముక్కు కుట్టించుకొని దేవాలయంలో వేషం వేసికొని ఆయీ కలాపాన్ని వినిపించడానికి ప్రతిజ్ఞ పట్టడం సిద్ధేంద్రుల కలాపానికే కాని తీర్థుల తరంగాలకు కాదు—యిది బాగా గమనించాలి.

"యేసాలకొరకై మీసాలు గొరిగించి
దేశాలపాలైతి దేవు డప్పన్నా!"

అనే ఆక్షేపణ కలాపం వినికి చేసేవారికే కాని తరంగాలు పాడేవారికి వున్నట్లు కనపడదు. అయితే తరంగాలలో కొన్ని కీర్తనలు నాట్యం చేసేవికూడా వున్నాయి సుమారు పాతిక మూపై సంవత్సరాలనుంచి కృష్ణా, గుంటూరు జిల్లాలలో భక్తసమాజాలు తరంగాలను పాడుతూ నాట్యం చేయడం యక్కువలో నేను కొంచెం చూచాను. గజ్జెలు కట్టుకోవడమూ, చిటితలు ధరించడంతో పాటు తంబురా కూడా ధరించడం; యింతే. యిది భక్తిని ప్రకటిస్తుంది. భామవేషం మగవాడు ధరించి కలాపం వినికి చేయడానికీ దానికీ చాలా భేదం వుంటుందని వ్రాయనక్కరలేదు. అందులోనూ యిప్పటికీ సుమారు నూరేళ్ళనాటి గాథగదా యిది? ఆ కాలంలో మగవాడు స్త్రీవేషం వేయడం అంటే చాలా హేయం అయినప్పటికీ ఆ గ్రంథకర్త సిద్ధేంద్రులవారియందలి గౌరవం ఆ విధంగా ప్రకటించినారు కూచిపూడి బ్రాహ్మలు. యిప్పటి కింకా ఆ గౌరవం ఆ కూచిపూడి వాస్తవ్యులు ద్విజోత్తములు ప్రచురిస్తూనే వున్నారు. ఆ గ్రామస్థులను శుశ్రూషించి గో॥ జి॥ ప్రాంతవాస్తవ్యులు బ్రాహ్మలు కూడ ఆయీ విద్యను అభ్యసించి రాజులచే ఆందోళికాది సన్మానాలు పొందినవారున్నారు.

కొలదికాలం నాడు కీ॥ శే॥ లు కొల్లూరి నారాయణంగారిని గో॥ జి॥ లో పలువురు పెద్దలు యెరిగే వుంటారు. వీరి విద్యను నేను చూడలేదు గాని 80 యేళ్ళ వృద్ధులుగా వున్న వీరిని సందర్శించి వున్నాను. పార్థివలింగపూజా దురంధరులు బ్రహ్మచెవులులో వున్నా రప్పుడు వీరు. కీ॥ శే॥ లు జాలూరు కృష్ణారావు పంతులు గారికి యీయన పుత్రప్రాయులగు శిష్యులు. శిష్యులేమిటి పుత్రులే. ఆ పుణ్యదంపతులకు సంతానం లేదు. ఆయీ కృ॥ రావుగారు డి. పి. డబ్లుయు. యిలాకా పెద్ద ఉద్యోగిట. యీ నారాయణంగారిని సవారీ బోయీ మర్యాదలతో యెవరేనా పిలిపిస్తే శ్రీ పంతులవారు స్వంతసవారీతో ఆ సభకు హాజరవడం మాత్రమే కాదు, సభ్యులలో కూర్చుని తాళం చేత పట్టుకొని హంగు చేసేవారని వినికి. ఆ పంతులవారు వారి యావదాస్తినీ యీ శిష్యునికే సంక్రమింప చేశారని వినికి. సరే ప్రసక్తానుప్రసక్తంగా కూచిపూడి దాటి, ధవళేశ్వరం గోదావరి ఆనకట్ట దాటి, పిఠాపురం సంస్థానం దాకా నడిచింది కథ.

బలవంతపు సన్న్యాసపు గాథ సిద్ధేంద్రుల వారిది. వారి రచన భామకలాపం గాని, శ్రీకృష్ణలీలాతరంగిణి అనే నామాంతరం గల తరంగాల రచన కాదు. యీ గ్రంథకర్తకూడా కృష్ణాతీరవాసి అయితే కావచ్చునేమో గాని, కృష్ణలో యీదుతూ ప్రాణావసానం సూచితమై ఆతురసన్న్యాసం పుచ్చుకోవడం వగయిరా గాథకూ యీయనకూ సంబంధం లేదు. యీయన సన్న్యాసి; విద్వత్కవి, యింతే.

యీయన, జయదేవుడు, లీలాశుకుడు యీ ముగ్గురును మహానుభావులైన భక్తకవులుగా కొన్ని గాథలు భక్తులైన కవులు చెప్పుకోవడం వుంది. అందులో—(1) లీలాశుకుడు. (2) జయదేవుడు, (3) నారాయణ తీర్థులు. యీ ముగ్గురూ శ్రీకృష్ణపరమాత్మను తమ కవిత్వంచేత వుపాసించి ముక్తిని పొందడానికి అభిలషిస్తే,—మొదటి అవతారం లీలాశుకుడు వేశ్యాలోలుడు కావడం అడ్డు తగిలిందనిన్నీ, రెండవ అవతారం జయదేవునికి సన్న్యాసిగా వుండి మహావాక్యోపదేశం (తత్త్వమసీత్యాదికం) పొందక పోవడం (సన్న్యాస్య శ్రవణం కుర్యాత్) అడ్డు తగిలిందనిన్నీ, మూడవ అవతారం తీర్థులకు యే కళంకమూ లేదు గనుక ముక్తి లభించిందనిన్నీ చెప్పుకోగా బాల్యంలో విన్నాను. కాని యీ వినికిని సమర్థించడం చాలా కష్టం. యేమంటే;—

"మా మాలింగ న్మఙ్గితముని
సంభ్రమం గాఢ బాహుః
స్వప్నే దృష్ట స్తరుణతులసీ
భూషణో నీలమేఘః"

దీన్నిబట్టి లీలాశుకునకు స్వప్నదర్శనం మాత్రమే వుండేదనిన్నీ ఆ దర్శనంలోనే శ్రీకృష్ణుడు "నీకు యీ జన్మలో ముక్తి లేదు. భవిష్యజ్జన్మలో కలుగుతుంది" అని చెప్పినట్టు కొందరివల్ల విన్నాను. దానికి తథ్యంగా జయదేవుడున్నూ ముక్తి పొందలేదనిన్నీ, తీర్థులు సన్యాసి కనక ముక్తుడయినా రనిన్నీ వినడం కలదు. యీ ముగ్గురూ వొక్క ఆత్మయొక్క రూపాంతరాలే అని తెల్పడి.

మొత్తం మీద సంస్కృతకవులలో యీ ముగ్గురూ శ్రీకృష్ణభక్తులైన వృద్ధోలపు మహాకవులు. అందులోనూ నెంబరు వన్ కవి నోట మ్మాట వచ్చిన ప్రతిమాటకూ అక్షరలక్షలు యివ్వ తీరాలి

"కరారవిందేన పదారవిందం
ముఖారవిందే వినివేశయంతమ్
వటస్య పత్రస్య పుటే శయానం
బాలం ముకుందం మనసా స్మరామి".

కవిత్వమంతా యిదే శైలిలో వుంటుంది లీలాశుకునిది. యీయనకి శుకుడనేది బిరుదనామం గాని (అసలు పేరు బిల్వమంగళుడు) పితృదత్తం కాదు. యించుమించు జయదేవుని రచన కూడా యిదేమాదిరిగా వుంటుంది.

"నఖలు నితంబిని, గమనవిలంబన
మనుసర తం హృదయేశమ్;
ధీరసమీరే, యమునాతీరే
వసతి వనే వనమాలీ"

లీలాశుకుని రచనలో వున్నంత భక్తిరసం జయదేవుని రచనలో వుండకపోయినా తరిచి పరిశీలిస్తే వ్యంగ్యంద్వారా జయదేవుడు శృంగార భక్తుడుగా పరిణమిస్తాడు. చెలికత్తె వచ్చి రాధతో "కృష్ణుడు యమునవొడ్డున గోపికలతో శుద్ధ పచ్చి శృంగారరసమయుడుగా విహరిస్తున్నాడు; నీ కిప్పుడు తప్పక చిక్కుతాడు. అయితే నీవు నితంబినివి (గురుతరజఘనభారవు), త్వరలో నతనిని కలిసికోజాలవు. గమనవిలంబనం కూడా చేస్తే యేలాగు? అని ధ్వని. యిక్కడ రాధ రాధా కాదు, చెలి చెలీ కాదు, అంతరార్థం వేరు. జయదేవుడు గేయాలుగానే శ్రీకృష్ణునియొక్కయు రాధికయొక్కయు శృంగారాన్ని రచించి వున్నాడు. లీలాశుకుడో? శ్లోకాలుగా రచించి వున్నాడు. ఆయీ శ్లోకాలలో నూటికి నూరూ కాకపోయినా చెరిసగమేనా వాల్మీకిశ్లోకాలు కుశలవులు (కుశిలవౌ కుశలవనామధేయౌ) పాడినట్లు జాగా చేసి పాడేవా రున్నారు.

(భైరవి-రూపకం)

"సజల జలదనీలం వల్లవీకేళిలోలమ్. సజల॥
"చింతయ, మాకందమూలకందం"

అన్న దీక్షితులవారి కీర్తన మాదిరిగా పై శ్లోకాన్ని కొలదివత్సరాలనాడు పాడిన కీ॥ శే॥ లు అల్లంరాజు పేరరాజుగారు, పైవారిలో అగ్రగణ్యులు. లీలాశుకుని శ్లోకాలను పేరరాజుగారివలె జాగా చేసి పాడేవారు ప్రస్తుతం యెక్కడా లేనే లేరని చెప్పవలసివచ్చినందుకు విచారిస్తూన్నాను.

(1) కృష్ణకర్ణామృతం, (2) అష్టపదులు, (3) తరంగాలు—యీ మూడూ మూడే. పూర్వ మర్యాదలతో పెండ్లిసదస్యపు సంతర్పణలలో పై గ్రంథాలకు ప్రచారం నిన్నమొన్నటివఱకూ వుండేది. యేలూరు మంత్రిప్రగడ జమీందారు గారి పుత్రికలవివాహాలలో వీట్లప్రచారంతో భోజనకాలే గోవిందనామ జరిగింది. తరవాత మరి ఆట్టియోగం లేదు. అందులోనూ తరంగాలకు ప్రచారం అధికం.

"శరణం భవ, కరుణాం మయి
కురు దీనదయాళో,
కరుణారసవరుణాలయ
కరిరాజకృపాళో!"
"గోవింద మిహ గోపికానందకందం
సానంద మవలోకయామో ముకుందం"
"ఏహి; ముదం దేహి; శ్రీకృష్ణ! కృష్ణ! మాం
పాహి గోపాలబాల కృష్ణ! కృష్ణ!"

ఇత్యాదులు ప్రాముఖ్యాన్ని వహిస్తాయి. ఉపనిషదర్థాన్ని క్రోడీకరించిన తరంగం వొకటి వుంది. దానికి పాఠకలోకంలో ప్రచారం తక్కువ. కొంచెం వుదహరిస్తాను.

(భైరవి-ఆట)

పరమిహ పశ్యత పూరుషం
స్వీకృతమాయికమానుషం
ఉపనిషదేకసమధిగత
మద్వయబోధసుఖైకరసం విభుం"

అయిదారు చరణాలున్నాయి. "తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్" వగయిరా శ్రుతుల తాత్పర్యం యీ తరంగంలో యిమిడి వుంది. ప్రాధాన్యేనా రాసక్రీడ యీ తరంగంలో వర్ణించబడింది.

"స్వజనదయాధృతదేహతయా
విహరంత మమర మిహ భూతలే
వ్రజభువి, రాసమయరసపండిత
గోపవధూ వృతమండలే పరమిహ॥
"సకృదవలోకనిరాకృతగోపవధూ
భవతాప మరిందమం
నవజలదాభతనుం
తటిదాభపటం
నటవేషధరం సమం పర॥"

రాసక్రీడను వేదాంతముతో సమన్వయించి అంత్యనియమాది శబ్దాలంకారాలతో ఆయీ తరంగాన్ని తీర్థులు రచిస్తే లీలాశుకుడు—

"అంగనా మంగనా, మంతరే మాధవం
మాధవం మాధవం, చాంతరేణాఙ్గనా,
ఇత్థ మాకల్పితే మండలే మధ్యగ
స్సంజగౌ వేణునా దేవకీనందనః"

యిక్కడ వొక విశేషం లీలాశుకుని శ్లోకమేమో గేయంగానూ నడుస్తుంది; శ్లోకంగానూ నడుస్తుందని చెప్పనక్కరలేదు. తీర్థులవారి తరంగం శ్లోకంగామాత్రం నడవదు. వీరికందరికీ మార్గప్రదర్శకం శ్రీమద్భాగవతమే. ఆయనకు మార్గదర్శి వాల్మీకి—"మధుమయఫణితీనాం మార్గదర్శీ మహర్షిః". వాల్మీకి మార్గదర్శకం వేదశ్రుతి, మొత్తం 'యెవరేజీని' పరిశీలిస్తే వేదం సర్వాధారంగా కనపడుతుంది. ఆ వేదాన్ని నశించిపోకుండా యింతవఱకు కాపాడుతూ (ప్రతిఫలశూన్యంగా) వున్నవాళ్లు బ్రాహ్మలు కావడంచేత నేను వారిని విడిచి యెవరికి నమస్కరించేది? అన్నాడు భోజరాజు. బాగా చూపు వెనక్కి మళ్ళించి పరిశీలిస్తే భోజరాజు నాటికే యీ తెగులు (నాక్ బ్రామిన్సుకూ నారింజపళ్లకూ చూ.) అంకురించిందనిన్నీ, దానికి యుక్తకాలం కూడా వచ్చి పూవులు పూచి కాయలుకాచి ఫలించిందనిన్నీ పరమార్థం. వ్యాసం మళ్లా మరివొక పుంతలోకి దూకింది. కనక ప్రధానాన్ని అనుసరిస్తాను.

(16 వ పేజీ చూడుడు)

కథానిక :

దాంపత్యం

శ్రీ జె. వి. సుబ్రహ్మణ్యం

భర్త ఎంత గౌరవ ప్రతిష్ఠలతో జీవించే వ్యక్తైనా కానీయండి; ఎంత సంపదయినా ఉండనీయండి; తా నెంత విద్యావంతురాలైనా కానీయండి; భర్తను మనసిచ్చి మాటాడుతూ ప్రేమతో లాలించకపోతే స్త్రీకి సంతోషమనేది కలకాలానికీ కానరాదు. ఆనందానికి అభావం; సంసార జీవనంలోని సహజత్వానికి అభావ తప్పదు. అలా కాకుండా ఐశ్వర్యాలు లేకున్నా భర్త వ్యక్తిత్వం యశోవంతం కాకున్నా, అత్తమామల ఆరళ్ళ లున్నా, తోడికోడళ్ళ తగవు లున్నా, ఆడుబిడ్డల అదలింపు లున్నా, భర్త యొక్క హృదయం ఉంటే వాళ్ళ సంసారంలో రసికత నవ్యత శోభ విలాసమూ ఉంటాయి. రెంటికీ వ్యతిరేకంగా — అత్తమామల రాపిడి ఉండీ; ఆడుబిడ్డల ఆంజడి ఉండీ, కలిగిన సంసారం కాకుండాపోయి మగడి మనస్సుకూడా తనకి దూర దూరంగా ఉంటే ఇక ఆమె జీవితమెలా ఉంటుంది? దుర్భరమైన జీవితం; నికృష్టమైన నీడజీవితం, శోభ వికాసమూ లేని జీవితం ప్రపంచములో ఎక్కడున్నా ఉందంటే అది ఆమెదే! లక్ష్మీదేవి పెండిటి జాతికి చెందినది. ఆమె భర్త రామశాస్త్రి విద్యా విహీనుడు కాదు; కీర్తి గౌరవాలు లేనివాడు కాదు; పైగా లక్ష్మీ పుత్రుడు కూడా. సంసారం చూస్తామా అంటే, మాటాడేందుకుగూడ మనుషులులేని ఒంటరి సంసారం గాగ; ఒక్కలార్చి సంపాదింపనిదే డొక్కలాడనే దుర్భర దారిద్ర్యపీడిత సంసారంగాదు; కడుపునిండా తిని కావలసినంతా అనుభవిస్తే అయిపోతుందని కడుపుకట్టి, వాయి కట్టి, మూటకట్టి మూలపెట్టే లోభిసంసారం కాదు. యథేచ్ఛాపారవారంగా తిని ఇంత ఇతరులకూ కడాపెట్టతూండే సంసారమే! కాని రామశాస్త్రిమటుకు భార్యను చూస్తే ఆనందముతో హృదయ పూర్వకంగా ఆదరించడు! కాని వాళ్ళూ సంసారం చేస్తున్నారు! దాంపత్య సుఖం అనుభవిస్తున్నారు! వారి సంసారంలో ఉండాల్సిన నవ్యశోభా విలాసమూ రసికత్వం ఏమీ లేవు; అవన్నీ వాళ్ళకి మరు మరీచికలు; గగనకుసుమాలు; స్వప్నసదృశాలు!

కారణం? లక్ష్మీదేవి అందంగా లేదా? విద్యావతి కాదా? యౌవనం లేదా? అనుకూలవతి కాదా? రామశాస్త్రి సాంప్రదాయకుతుడు కాదా? అతనికి భార్య నాదరించి లాలించి ఉపాసించే హృదయం లేదా? అన్నీ ఉన్నాయి. కాని వాళ్ల కనుభవమే శూన్యము. ఇవన్నీ విశేషంగా అవుపడవచ్చు; కాని సత్య దూరంకావు. అయితే మరో విశేషం! అది విశేషాల్లో కెల్లా విశేషమైన రామశాస్త్రి యొక్క విశేషమైన బుద్ధియొక్క విశేషం! విచిత్రమైన వికాసం!

దాంపత్య జీవితవనంలో మృగ్యమవ్వాల్సిన 'హేలాభావము' సహజహేలా సౌందర్య శోభితులైన హేలలచేతనే విస్మరింపబడిన యీ నవశకంలో రామశాస్త్రి సుందర శరీరాన్ని మోహించి ఆవిర్భవించింది! 'ఎవరేమనుకొంటారో! అమ్మ, నాయనా నిరసిస్తారేమో! చెల్లాయి ఎగతాళిచేస్తుందేమో...' అనే పిచ్చి తలంపుల్లో పెళ్లాం వచ్చి వసంతంపై వసంతం గడచినా ఒక ఆడపిల్ల పుట్టినాకూడా ఆ అదురు బెదురుతోనే పెళ్లాన్ని పలకరించటానికి వెనుదీస్తాడు! ఇంతయెందుకు, సరసను కూచోని స్వరసల్లాపాల్లో విందులారగించటం పోనీ, అలివరుసను దంహాసంతో పరిహాసమాట్టం, పోనీ పెళ్లాంచేతి అన్నమైనా యింత తిని ఎరగడు! ఏవేళకూ ఆ అమ్మ రావాలి; ఆ అమ్మ పెట్టాలి; ఆ బొజ్జనిండాలి; అంతే!

భార్యభర్తల మధ్య దాంపత్య విశేషమూ; అనురాగ విరాగాలు ఏలా ఉన్నా అత్తమామల అనురాగమూ ఆదరణా సానుభూతి ఐనా ఉన్నాయా? పైగా మగడే నిరాగుడైతే స్త్రీ యాతన చెప్పట మెందుకు?

తన్నీలా అత్తమామలు నిరసన దృష్టితో చూట్టానికీ, ఆడబిడ్డలు అపహాస్యం చేయటానికీ, మగడు పట్టించుకోకుండా తిరగటానికీ కారణము తను పైనూరుపిల్ల కావటమేననుకొనేది అయిన ఇక్కడ పిల్లలకుండే లక్షణాల్లో తనకి ఏవి లేవు? వాళ్ళకంటే సౌందర్య వివేకాలు కూడా ఉన్నాయే! మరి, తన తండ్రి బీదవాడనా? పేదయైనా కూటికోసం అమ్ముకోలేదే! సలక్షణంగా వేదోక్తంగా కన్యాదానం చేశాడుగాని. తనకి పుట్టింటివారు నగలూ నాణ్యాలూ పెట్టి పంపలేదనేనా? ప్రపంచంలో తెలుగందరూ ఆదరిస్తారా? బీదా బిక్కీ అనే వివక్షత లేదా? అయినా తన్నే సంవత్సరం ఇంటికి తీసికెళ్ళ లేదు. ఏయేడు తను తల్లిగారిచీర కట్టుకోలేదు! ఇక అల్లుణ్ణి చీనిచీనాంబరా లిచ్చి ఆదరించ లేదనా! ఉన్నంతలో లోపంచెయలేదు. వాళ్ళు పస్తున్నా అల్లుడు వచ్చాడంటే పంచభక్ష్య పరమాన్నాలతో అల్లెంగుడుపుతున్నారే! ఎందుకు వీళ్ళు తన్నీలా అనాదరించటం? అగౌరవించటం? అవమానించుటలో ..... తన భర్త విషయం తనకు తెలుసు ప్రెుక్కే వాడికి వరమీయలేక, పూజారి చేతి కీలుబొమ్మైన రాతివిగ్రహంలాంటి వాడని. అయినా తల్లినీ తండ్రినీ దండించమన్నదా? ఇంతకూ తనుకోరింది అరమర లేకుండా, భేదం లేకుండా మనసిచ్చి మాటాడమనేకదా! నగలూ నాణ్యాలూ తెమ్మన్నదా? పట్టువసనాలు కట్టబెట్టమన్నదా? ఏమీ లేదే! ఎందుకీ మూక భావం? రెండేళ్లునిండినా యింకా పాతకాలపు గర్భాదానపు పెళ్లికూతుర్లా ఎందుకీ సిగ్గు? ప్రపంచంలో భార్యాభర్తలు మాటాడుకోరు? మాటాడుకోటం విచిత్రమా, లోకతీతమా? ఇంతకూ తన దౌర్భాగ్యం" అని ఆవేదన పడుతుండి లక్ష్మీ అప్పుడప్పుడు. ప్రపంచజీవితానికి అలవాటుపడ్డ సాధారణవ్యక్తులజాతికి చెందినంత కాలమూ ఆమె కించపడవలసిందే! వ్యక్తినే అసహ్యించుకొనేప్పుడు అత నేపనిచేసినా అనిష్టమే. చేస్తే తప్పు పైగా చేయకున్నా తప్పే లక్ష్మీదేవి స్థితికూడా అంతే. వాళ్లు తిట్టినతిట్టకు ఊరకుండా, ఎన్నితిట్టినా సిగ్గులేనిదంటారు. ప్రత్యుత్తరం చెప్పిందా, పెద్దవాళ్ళంటే భక్తి లేదు; భయమూలేదు. ఇంతకూ దీన్ని అన పనిలేదు. ఈలా తెగిన గాలిపటం చేసి విడిచిన మొగుణ్ణి అనాలి అనే వారు. ఇంటిపని చేయకుంటే ఎంత చదువుకున్నదైతేమటుకు మొగుడితో కాపురం చేయదా? కోడంటే ఇం చేయకుండా ఆడదానికి తప్పుతుందా? ఏం రాణివాసమమ్మ!' అనేవాళ్లు. ఏదైనా పనిచేసిందా, చేతకాదని ఊరకోరు; అన్నట్లో వేలుపెట్టి అలా చెడగొట్టడందేనికి? అనేవాళ్లు. ఈలా చెప్పితే ఎన్నో.....కాని మరో చిన్నవిషయం చెప్పితే చాలు. మొగుడి పడక, తనపడక ప్రత్యేకంగా వస్తే, 'వేరే పండ బెట్టి ఏమేమి నూరిపోసిందో ఆ వెర్రి వెంగళాయికి' అనేవారు; వేరే వెయ్యకుండా అందరి ప్రక్కన వేస్తే 'ఇది మొగుడితో కాపురంచేస్తుందా?' అంటారు! శ్రీ చిలకమర్తివారి గణపతి నెరిగినవారు మా లక్ష్మీదేవిని సులభంగా తెలుసుకోవచ్చు.

లక్ష్మీదేవి నీలా దెప్పిపొడుపుల్తో నానా బాధలు పెట్టూంటే రామశాస్త్రి పట్టించుకొనే వాడుకాదు. ఆయనమనస్సు ఏలాంటిదో కాని యీ విషయం తల కెక్కిందోలేదో? ఊరిలో అందరికీ తెలిసింతర్వాత కూడా తనకు ఏలా తెలికపోతుంది? తెలిసీ పట్టించుకోలేదా? దైవానికే ఎఱుక. అదే నిజమైతే ఇక చెప్ప వలసింది లేదు. ఈలాంటి సుపుత్రు లుంటారనే, నోరులేని అమాయికల నానాహింసలు పెట్టారనే విడాకుల చట్టం కావాలంటం. కాని విడాకుల చట్టం కొన్నిచోట్ల సత్ఫలాన్నిచ్చినా, మొత్తంమీద మంచికంటే చెడుగే ఎక్కువ. వృథాగా మాంపత్యంపులకు సంసిలాడకిలు వేస్తారు. లక్ష్మీదేవి కూడా విడాకు లిస్తే........?

2

కక్కు వచ్చినా, కల్యాణ మొచ్చినా ఆగదంటారు; కడుపు వచ్చినా అంతే అక్కపోకట మాలా ఉంచి దాగదుకూడా! లక్ష్మీదేవి ఎట్ట గర్భం దాల్చింది! ఒకటి...రెండు...మూడు... తొమ్మిదినెలలు నిండాయి. లక్ష్మీదేవితల్లి సీతాబాయి, వచ్చింది...మగశిశువు జన్మించి యీ పృథ్వీభారం కొంత పంచుకొన్నాడు!

మనదేశంలో జన్మించటం అధికమే. అంటే నూటికి 85 మంది సంవత్సరానికి పుట్టారు. కాని వీళ్ళంతా బతికేపనైతే బర్త్‌కంట్రోలు తప్పదు ఇంతిమటుకూ చావులు కూడా అధికమే. ఈ చావటాలుకూడ పుట్టిన పురిటిపిల్లలకే ఎక్కువ. అంచేతనే మనదేశస్థుని సగటుజీవితం 23 సం.లు!

రెండునెలలు నిండీనిండక పూర్వమే వాడికి గుణం పుట్టింది. పుట్టిననాటినుంచీ అదోమాదిరిగా ఉన్నాడు దానికితోడు ఇది ఇంకొకటి. 'మందో మాకో పోయించండి' అని సీతాబాయమ్మగారన్నారు. 'మందులూ మాకులూ ఎందుకూ? అదో దండుగ వాడు బ్రతికివీడి స్తేగదా' అన్నారు శేషమ్మగారు—రామశాస్త్రితల్లి. 'మందివ్వయ్యమంటే ఏమిటీ అవాంఛం మాటలు?' అని కొంచెం వాయిచేసుక మాటాడింది సీతాబాయమ్మ. దానిమీదట వియ్యపురాలు బ్రతికితే బ్రతుకుతాడు, చస్తే చస్తాడు. మేం ఇప్పించేది లేదండి...ఆనాడు వాళ్ళయింట్లో ఘర్షణ భయంకరంగా జరిగింది. సీతాబాయిని నానా మాటలు అడిగారు. గతిలేక మా యింటిలోనే పురుడుపోయిస్తామని వచ్చావు అన్నారు. ముందు వాళ్లేవడని తీరాయిప్పుడు సొడ్డువేయటం ఏమి? మేం బీదవాళ్ళం కావచ్చుకాని మాట ఓర్చుకోలేం. కూటికి పేదైతే గౌరవాని కూడానా? ఆ సీతాబాయమ్మ తీసిపోకుండా జగడమాడింది...కావాలంటే తనూ తనకూతురూ వెళ్ళవచ్చునట! అంత పని జరిగేదే, కాని ఆ వలుసు అడ్డువచ్చాడు!

అసలు విశేష మేమిటంటే, ఇంతగోల జరుగుతున్నా రామశాస్త్రి మాటాడలేదు. తన్ను కాదులే అన్నట్టు తిరుగుతున్నాడు. తన కేమీ సంబంధం లేనట్టే నటిస్తున్నాడు. తల్లితండ్రుల వైపుగాని, అత్తగారివైపుగాని పల్లెత్తి మాటడలేదు. మందు ఇప్పిస్తామనిగాని, వద్దనిగాని అనలేదా మానవుడు! చివరకు ఎల్లా ఉంది అనికూడా విచారించలేదు.

ఆ యింట్లో అందరికీ ఆనాడు ఏకాదశి. పచ్చినోట నీళ్ళు పోసుకోలేదు. 'ఏం గ్రహచారమని నిండు ఇంట్లో ఉపోష్యమటం? ఆ శని తగులక వదుల్తుందా?' అంది సీతాబాయమ్మ. అన్నట్టే ఆ రాత్రికి ఆ పిల్లవాడు కళ్ళు మూసుకొన్నాడు! రెండుమూడు రోజులు గడిచాయి. పైకి శాంతంగా ఉన్నట్లుండేకాని లోపల అగ్ని పర్వతం. ఎప్పుడు పేలుతుందో లావా? సీతాబాయమ్మ లక్ష్మీదేవితో 'అమ్మా మనం ఇంటికి వెళ్దాం పద పదిరోజు లుండి వస్తువుగాని' అంది. 'నా క్షేమన్నా అనుకోరా ఇప్పుడే వెళ్లితే అసలు పంపుతారా?' 'మనమ్మాయికూ అనుకోమా యేమిటి? .....పంపటం పంపక పోవటం వాళ్ల యిష్టమా?'

'నీవు ఊరుకోవే అమ్మా. శాంతంగా చక్కబెట్టుకోవచ్చు. 10 రోజులు ఆగితే అన్నీ అణిగిపోతాయి.'

'ఏమిటే అణిగేది? నా పొగరు. నీ కెందుకూ, నీవు సిద్ధంగా ఉండు'.

ఆనాడు లక్ష్మీదేవి మగడిపక్క వేరేవేసింది. తల్లి చెప్పినమాట ప్రస్తావించింది భర్తకి కక్కుమనలేదు 'మీకంత యిష్టం లేకుంటే బలవంతమేమీ లేదు. మానుకుంటాలెండి' అంది. వంచిన తల పైకెత్తి లక్ష్మీదేవిముఖంలోకి ఒక్కసారి చూచి మళ్లీ మౌనముద్రాంకితుడైనాడు. 'ఇంతకూ ఎవర్నీ అన నక్కరలేదు. నా తలరాత యీలా ఉంది. అసలు వాడికా జబ్బెందుకు చేయాలి? జబ్బే లేకుంటే ఇంత మనోభేదాలు రాకుండాపోయేవి. అన్నీ నామూలానే వచ్చాయి' అని కంట తడిపెట్టుకుంది. 'ఏడవకు లక్ష్మీ ఏడవకు' అన్నాడు. రామశాస్త్రి అంతే మళ్లీ నోటికి బంద్.

మళ్లీ ప్రస్తావించింది ప్రయాణపు సంగతి. 'పరేవవర్లు' అన్నాడు. బ్రహ్మ సృష్టించినందుకు పునీతుడైనాడు!

ముందునాడే లక్ష్మీదేవి మెళ్లోవన్నీ తీసికొంది అత్తగారు. లక్ష్మీదేవి మగడిపెట్టె సర్దింది. తనూ, తన కూతురూ కలిసి తీయించుకొన్న ఫొటో ఒకటి, తనూ తన భర్తా కలిసి తీయించుకొన్న దొకటీ భర్తపెట్టెలో ఉంచింది. భర్త ఫొటో ఒకటి తనతో ఉంచుకుంది. పెద్ద పెద్ద చీరలు, వెండి సామానూ అన్నీ వేరే పెట్టెలో పెట్టి అక్కడే ఉంచింది. వెళ్లేప్పుడు పేరుపేరున వరుసవరుసలతో అందరితో చెప్పింది లక్ష్మీదేవి. ఎవ్వరూ ఏమీ అనలేదు. అత్తగారుమటుకు 'ఒళ్ళు జాగ్రత్తమ్మా...... త్వరగా మటుకు రా' అంది. రామశాస్త్రి శూన్య దృక్కులతో భార్యవైపే చూస్తునంచున్నాడు!

3

నీకోసమూ, నాకోసమూ కాలమాగదు. చైత్రం తరువాత వైశాఖం, వైశాఖం తర్వాత జ్యేష్ఠం రానేవస్తాయి. అందుకే అయ్య వచ్చిందాకా అమావాస్య ఆగదన్నారు. మైసూరు నుంచి జాబు రాకుంటే కాలం పురోగమించకుండా మానుందా?......చివరకి రామశాస్త్రి మైసూరికి వ్రాశాడు 'తనకు తీరిక లేదనీ, లక్ష్మీదేవిని వచ్చి దించిపోవలసినదనీ! అసలు తీసికొని వెళ్లి ఆరునెల్లయినా జాబు వ్రాయలేదు సరిగదా దీనికి జవాబూలేదు! మళ్లీ ఓ పదిహేనురోజులకింకొకటి...ఊహూ...మళ్లీ వ్రాశాడు. హరి, శివా! ప్రత్యుత్తరమే లేదు.

రామశాస్త్రినాన్న, శివయ్యపంతులు బయలుదేరిపోయాడు మైసూరికి. ప్రయాణపు బడలిక తీర్చుకొని రెండురోజులతర్వాత తాను వచ్చిన పనిని ప్రస్తావించాడు. జవాబే వ్రాయలే దేమని ప్రశ్నించాడు. 'ఆ, వ్రాయలేదు!' అని తప్పుకున్నారు. 'అమ్మాయిని పంపండి, పిలుచుకు వెళ్తాను' అన్నాడు పంతులు. 'అమ్మాయి నేలా తీసికెళ్తారు?...ఆమె మందు తీసుకుంటోంది'

'ఏం?...ఎందుకు మందు?'

'బలహీనంగా ఉందని' అని ప్రత్యుత్తరం వచ్చింది.

'పోనీ,అక్కడే పుచ్చుకోవచ్చు ఆ మందులూ మాకులూ'

'ఎందుకులెండి, ఆరోగ్యం వచ్చింతర్వాతే వస్తుంది' అన్నారు.

వచ్చినదారినే శివయ్యపంతులు చెవులు ఝాడించుకొంటూ ఇల్లుచేరాడు. ఓ పదిరోజుల


(20 వ పేజీ చూడుడు)




సుప్రసిద్ధమైన అలోహాగోపురం—సముద్రంలో, చాలా మైళ్ళదూరంలో

ప్రపంచ రహస్యస్థలా

హవాయి హోనోలూలు



హోనోలోలూ పట్టణంలో వ్యాపారసమృద్ధమైన దిగువ పేటలు.




హవాయిదీవుల ముఖ్యఆదాయం చెరకుపంటమీదే ఎక్కువగా ఉంటుంది. చెరకుతోటల నీటిపంపకం విధానాలకోసం మిలియన్లకొద్దీ డాలర్లు ఖర్చు పెడుతారు. భూమికి తగ్గపంటలను పెంచటంలో ఈదీవులవారు అఖండులు.




చెరకుపొలాలు అంతర్ప్రసిద్ధికెక్కినవి. చెరకు, కోతలు, కాటర్ పిల్లర్ యంత్రాలతో జరుపుతున్నారు.



హోనోలూలూ పురమందిరం. పట్టణంలో



ఉండగానే ఓడలో వారికికనబడే హానోలూలూ ప్రసముచిహ్నం.




వాయికికీబీచ్ (విమానంమీది నుంచి దృశ్యం) ప్రపంచ ప్రసిద్ధస్థలాలలో ఒకటిగా పేరుపొందింది. కుడినైపున డైమండ్ హెడ్ క్రేటరు అనే అగ్ని పర్వతం - ముందున్నవి పెద్ద పెద్ద హోటళ్లు - హానోలోలూ, విశ్రాంతికొరకు వచ్చే విలాసపురుషుల కొటపట్టు.


లలో ప్రసిద్ధమైన

దీవులు;

గా పట్టణాము ట



హవాయ్‌దీవి కేవలం ప్రపంచప్రజలవిశ్రాంతిస్థానమే కాదు. సర్వవిధాలా విద్యకు, కృషికీ, ప్రకృతీ సౌభాగ్యానికి సంపదకూ కూడా పేరుపడ్డది. జనుల్లో విద్యావ్యాప్తి విశిష్టప్రమాణంలో ఉంది. మా ఊయీ దీవిభాగంలోని పక్కాపల్లెటిబడి.



ందమైన భవనాల్లో ఒకటి.



అనాసపళ్లకు ఈ దీవులు ప్రసిద్ధి. అనాస తోటలలో చిన్ని మొక్కలను ఊడుపుఊడుస్తున్నారు.



అల్లీబిల్లీ లోకంలో అమ్మాయి కథ

'ఆలిస్ ఇన్ ది వండర్లాండు'
రచన:
లూయీ కెరోల్

౧౦

అనుకరణం :
"ఆప్లవాన్"

రెండు మూడు నిమిషాలదాకా, ఆ యింటివంక పరకాయించి చూస్తూ ఇకముందు ఏం చెయ్యాలో తెలియక ఆలోచిస్తూ పాప, ఆ యింటికగ్గిర ఉన్న పొదల దగ్గిర అల్లాగే నుల్చుంది. ఇంతలో వెనుక అడివిలోనుంచి ఒక బంట్రోతు పరుగెత్తుకు టూ వచ్చాడు. ఆ తలపాగా, ఆ డవాలాబిళ్ళ, ఇత్తడి బొత్తాముల కోటూ, అవీ చూసి బంట్రోతు అనుకోవలసిందే కాని, వాడి మొహం చూస్తే, చేపలాగే ఉన్నాడు. ఆ చేప బంట్రోతు, అల్లా పరుగెత్తు కుంటూ వచ్చి, ఇంటి తలుపు దబదబా బాదటం మొదలుపెట్టాడు.

తలుపు తెరుచుకుంటూ లోపల్నుంచి ఇంకో బంట్రోతు వచ్చాడు. ఈ బంట్రోతు మొగం, కళ్ళూ కప్పగాగా గుండ్రంగా పెద్దవిగా ఉన్నాయి. వేషంమాత్రం ఇందాకటి వాడికి లాగానే తలపాగా, ఇత్తడిబొత్తాముల కోటు, డవాలా బిళ్ళ అన్నీ పెద్దఇంటి బంట్రోతువేషం అంతా ఉంది. ఇద్దరికీ తలపాగాలకు తోక లున్నాయి. అవి భుజంమీద వేలాడుతూ, మొగం తిప్పినప్పుడల్లా మెడచుట్టూ గిఱ్ఱున తిరుగుతూ, చుట్టుకొంటున్నాయి.

వాళ్ళ ఇద్దరినీ చూస్తుంటే పాపకు ఆశ్చర్యంగానే అనిపించింది. అయినా ఏం మాట్లాడుతారో విందామని కాస్త దగ్గిరగా పొదల మాటుకు చేరింది.

చేప బంట్రోతు తన చంకలోనుండి ఒక పెద్ద కవరు తీశాడు. ఆకవరు వాడంత ఎత్తూ ఉన్నది.

అత వాకవరు అతిశ్రద్ధంగా రెండు చేతులతోనూ పట్టుకొని, పూర్తిగా వంగి సలాం చేస్తున్నట్లు వంగి, కప్ప బంట్రోతు కందిస్తూ "జమీందారిణిగారికి, రాణీగారిదగ్గిర నుంచి - పచ్చీసు ఆటకు రావలసిందిగా ఆహ్వానము" అని అతిగౌరవంగా అంటూ, కప్ప బంట్రోతు కందిచ్చాడు.

కప్పబంట్రోతు ఆమాటలే, కాస్త తారుమారుగా అందిపుచ్చుకొని, "రాణీగారిదగ్గిరనుంచి - పచ్చీసుఆట ఆడేందుకు రమ్మని జమీందారిణీగారికి ఆహ్వానము" అని అచ్చు చేప బంట్రోతు అన్నట్టే అతిగౌరవంతో, ఏదో వేదం చదువుతూన్నంత గంభీరంగా అన్నాడు.

ఆ మాటలని ఇద్దరూ ఒకళ్ళకొకళ్ళ కెదురుగా నుల్చుని వంగి సలాము చేస్తూ తలాతలా ఢీకొట్టుకొన్నారు. ఇద్దరి తలపాగల తోకలు కలిసి మెలికి పడిపోయాయి.

పాపకు వాళ్ళను చూస్తుంటే అమితంగా నవ్వు వచ్చింది. తన నవ్వు వాళ్లు వింటారేమోనని, పొదల చాటుకు వెనక్కి నక్కింది.

కాసేపుండి పాప మళ్ళీ పొదల్లోంచి తొంగి చూచింది. చేపబంట్రోతు లేడు. కప్పబంట్రోతూ ఒక్కడూ, తలుపు బైట నేలమీద కూర్చుని, ఆకాశం వైపువెఱ్ఱిగా తేర గుడ్లె ట్టకు చూస్తూ కూర్చున్నాడు.

పాప భయం భయంగా తలుపు దగ్గిరకు నడిచి నెమ్మదిగా తలుపు కొట్టింది.

"తలుపు కొట్టి లాభంలేదు" అంటూ బంట్రోతు మొదలుపెట్టాడు—"ఎందుకంటావా, రెండు కారణా లున్నాయి. ఒకటేమో, తలుపు తియ్యవలసినవాడను నేనూ, నిలాగే తలుపుకు ఇవతల పక్కనే ఉన్నానాయను. మరింక రెండోది, లోపల అంత గల్లంతుగా ఉంటే నీ తలుపుకొట్టటం లోపలి వాళ్ళకు ఎవళ్ళకూ వినబడదు".

నిజంగా కూడా లోపల చాలాగల్లంతుగానే ఉంది. లోపల ఎవళ్ళెవళ్ళో కేకలూ, పెడబొబ్బలూ, పెట్టున్నారు. ఏడుపులూ, 'ఆచ్' ఆచ్' అని రావణాతుమ్ములూ తెరిపిలేకుండా వినబడుతున్నాయి. ఉండిఉండి పళ్ళెమో, కప్పో, సాసరో, ఏదో ముక్కలుముక్కలుగా పగిలిపోతూన్నట్లు చప్పుళ్ళు వినబడుతున్నాయి.

"మరి నేను లోపలి కెళ్ళటం ఎల్లా?" అని పాప అడిగింది. కప్పబంట్రోతు పాపమాటలు వినకుండానే తన ధోరణి సాగించాడు.

"తలుపు అవతల ఒకళ్ళం, ఇవతల ఒకళ్ళం ఉండిఉంటే నువ్వు తలుపు తట్టినా, ఏమన్నా అర్థం పర్థం ఉండేది. చూడు; నువ్వు లోపల ఉన్నావనుకో, నేనిక్కడున్నానో, లోపలినుంచి నువ్వు తలుపు తట్టితే నే నిక్కడనుంచి తలుపు తీసి నిన్ను బైటికి పోనిద్దును—"

మాట్లాడుతూన్నంత సేపూ కప్ప బంట్రోతుకళ్ళు పాపవంక లేకుండా ఆకాశంలోకే చూస్తుంటే, పాపకు చాలా అమర్యాదగా అనిపించింది. వెంటనే తనలో తనే సర్దుకొంటూ, "ఆ, అసలు పాపం వాడికళ్ళే అంతేనేమో? అంత నెత్తిమీద ఉంటే, ఆకాశం తప్ప మనవంక ఎల్లా చూస్తాడు? అయినా పోనీ, మాటకు జవాబు చెప్పొచ్చుగా, అదీ చేయడేం?—" అనుకొని, ఈమాటు గట్టిగా-"నేను లోపలికి వెళ్ళటం ఎల్లా?" అని అడిగింది.

"నే నిక్కడే కూర్చుంటాను — రేపటిదాక -" అంటూ కప్ప బం

బాల

కథా గేయం :



ఆణిముత్యం

'ప్రసాదరావు'

"మలయద్వీపపు పర్వతాల్లో
కలవు నవరత్నాలు నిధులూ
ఊరికే వెళ్లొస్తె చాలు కు
బేరు లౌతామూ— 1

మంచివాడ వటంచు, కాల్సెయి
కొంచె మేదో దెబ్బ తిన్నటు,
స్నేహపాత్రుడ వంచు నల్వురు
చెప్ప విన్నానూ. 2

నీవు పైపైనుండి నావకు
దోవ చెప్తాంటేను చాలును
నేనె తక్కిన భాగమంతా
నెఱపుకొంటానూ- 3

ఆటుపోటుల కడలిపాటుల
ఆనుపాను లెరింగి, కొండల
కోనల్లా తీరాల పడవను
గోముగా నడిపించగలిగీ— 4

సాహసించే మనిషి దొరకక
ఊహలనె ఇన్నాళ్ళు ఆగా -
నీవు 'సై' అను చాలు, పడవది
రేవులో ఉందీ. 5

ఇన్నూరు టంకాలు ఇదిగో
ఇల్లు గడపగ ఇచ్చి రావోయ్!
భాగస్వాములం మాతు ఇపుడే
బైలు దేర్దామూ - " 6

అనుచు ఒకనాడు నూతన
వణిజు డొక్కడు దరిని జేరీ
ఆణి కేవో కొత్తయాసల
ప్రాణ మిచ్చాడూ. 7

ఇన్నూరు టంకాల చూసీ
ఇల్లాలి కష్టాల తలచీ -
ఒప్పుకో ముత్యంతోకూడా
చెప్పవచ్చాడూ. 8

ట్రోతు ఇంకా ఏదో మాట్లాడుతుండగానే తలుపు బడాలున తెరుచుకొని, ఒక పెద్ద పళ్ళెం, గిరగిర తిరుగుతూ వచ్చి, విసురుగా బంట్రోతు తలమీదగా ముక్కును రాసుకొంటూ పోయి, దూరాన చెట్టుకు తగిలి, ముక్కలుముక్కలుగా పగిలిపోయింది.

కప్పబంట్రోతుమాత్రం ఏమీ జరగనట్లే అల్లాగే కూర్చుని, ధోరణిలో ఏమీ మార్పు లేకుండా—

"రేపటిదాకా ఇల్లాగే కూర్చుంటాను - బహుశా ఎల్లుండిదాకా కూడానేమో -" అంటూ సాగించాడు.

పాప ఇందాకటికన్నా ఇంకా పెద్దగొంతుకతో "నేను లోపలి కెళ్ళటం ఎల్లాగా?" అని అరుస్తూ అడిగింది.


"అసలు నువ్వు లోపలి కెందుకెళ్ళాలి! ముందదీ తేల్చాల్సిన ప్రశ్న; తెలిసిందా?" అన్నాడు బంట్రోతు.

నిజమే. అయినా పాపకు ఇంకోళ్ళల్లా అనటం ఇష్టంలేదు.

"పాడుగోల! ఇక్కడ ప్రతివాళ్ళు ప్రతిదానికీ వాదనలూ అడగటాలూనూ! పిచ్చెత్తి పోతుంది ఎవళ్ళకైనా" అంటూ తనలో తను గొణుక్కోటం మొదలుపెట్టింది.

ఈ కాస్త తీరుబడి దొరికేటప్పటికి, మళ్ళీ కప్పబంట్రోతు తన మాటలు పునశ్చరణం చెయ్యటం మొదలుపెట్టాడు.

"ఆ! నే నిక్కడే కూర్చుంటాను - అస్తమానం కూర్చుంటాను - రోజుల తరబడి కూర్చుంటాను."



"మరి నేనేం చెయ్యను?" అని అడిగింది పాప.

"నీయిష్టం - ఏమన్నా చెయ్యి" అని బంట్రోతు ఈల వేసుకోటం మొదలుపెట్టాడు.

"వీడితో మాట్లాడి లాభం లేదు. శుద్ధ మొద్దుస్వరూపంలా గున్నాడు" అనుకొంటూ పాప తలుపు తోసుకొని లోపలికి వెళ్ళింది.

తలుపు సరాసరి వంటయింట్లోకి తెరుచుకొంది.

గది అంతా ముంతపొగ పెట్టినట్లు పొగతో నిండిపోయి ఉంది. గది మధ్యన ఒక ముక్కాలి పీటమీద జమీందారిణి కూర్చుని ఒళ్ళోఉన్న చంటిపిల్లను సాకుతూంది. గాడిపొయ్యిమీద ఉన్న కళాయిమీదికి వంగి, వంటలక్క గరిటెతో కళాయిలో తిప్పుతూంది. కళాయిగిన్నెనిండా పులుసో, ఏదో కుతకుతలాడుతూంది. అందులోంచి వచ్చే మిరియాల పోపు ఘాటు, ముక్కులూ కళ్ళూ నిండి, ఉక్కిరి బిక్కిరి చేస్తూంది.

పాపకు ఆ ఘాటుకు తుమ్ములు వస్తున్నాయి. ఆ తుమ్ములతోనే, "పోపులో మిరియాల కోరు మరీ ఎక్కువైనట్లుంది" అనుకొంది.

నిజానికి 'కోరు' ఎక్కువగానే ఉంది జమీందారిణి కూడా మధ్య మధ్య తుమ్ముతూనే ఉంది. ఇక పసిపిల్ల, అస్తమానం తుమ్ముతూ, తుమ్ములు ఆగినప్పుడు పెడబొబ్బలు పెట్టూ, మళ్ళీ తుమ్ముతూ ఏడుస్తూ ఉంది. వంటింట్లో తుమ్ములు రాని వాళ్ళల్లా వంటలక్కా, ఒక బొచ్చు పిల్లినీ! పిల్లి పొయ్యిదగ్గిరే కూర్చుని, ఈ చెవినుంచి ఆ చెవిదాకా నోరు తెరుచుకొని ఇకిలిస్తూ కూర్చుంది

ముందు తను మాట్లాడటం మర్యాద ఔనో, కాదో అని పాప తటపటాయిస్తూనే —"మీపిల్లి అల్లా ఎందుకు ఇకిలిస్తూందో దయచేసి చెప్తారా?" అని నసుగుతూ అడిగింది. జమీందారిణి జవాబు చెప్పింది: "అది దేవరపిల్లి. అందుకని, ఓసి పంది కాదే!"

చివరి మాటలు హఠాత్తుగా కోపంగా అనేటప్పటికి, ముందు తన్నే అంటోందేమో, అని కంగారు పడి పాప ఒక్క ఎగు రెగిరింది. తీరా చూస్తే తనుకాక, పసిపిల్ల నంటోందని తెలుసుకొని, పాప ధైర్యం తెచ్చుకొని మాటలు మొదలుపెట్టింది.

"దేవరపిల్లులు అస్తమానం అల్లా ఇకిలిస్తాయని నాకు తెలియదే - అసలామాట కొస్తే, పిల్లులు ఇకిలించగలవనే నాకు తెలియదు."

"ఆ! యికిలిస్తాయి, అన్నిపిల్లులూ ఇకిలిస్తాయి."

కాస్త ఏదో మాటా మంతీ సాగుతుందికదా అని పాపకు సంతోషం వేసింది. అతిమర్యాదగా—

"అల్లాగా—అసలు ఇకిలించే పిలులను నేను చూడనేలేదు. నాకు తెలియనే తెలియదు సుమా" అంది.

"నీ కసలేమీ తెలియదు - తెలియదనేది అక్షరాలా నిజం" అంది జమీందారిణి కటువుగా.

ఆ మాట తీరు పాపకు నచ్చలేదు. అయినా మరే విషయమైనా కబుర్లాడుకోటం నయమని ఏ విషయం ఎత్తుదామా అని పాప ఆలోచిస్తుంది. ఎంతకీ ఆలోచన తెగటం లేదు.

ఇంకా అల్లా ఆలోచిస్తూ ఉండగానే, వంటలక్క కళాయి పొయ్యిమీద నుంచి దింపి, హడావిడిగా, గరిటెలూ, అట్లకాడలూ, చట్రాలూ, తప్పేలాలు, పళ్ళాలూ,— చేతి కందినవన్నీ జమీందారిణీమీదికి పసిపిల్లమీదికి దబా, దబా, విసరటం మొదలుపెట్టింది. పళ్ళాలు, గిన్నెలు, వడగళ్ళ వర్షంలాగా వాళ్ళిద్దరిమీదా కురుస్తున్నాయి. అవి తగిలినప్పుడుకూడా జమీందారిణి ఏమీ లెఖ్ఖచేస్తున్నట్టే లేదు. ఇక పసిపిల్ల, అంతకుముందే గగ్గోలుపెట్టి ఏడుస్తూండబట్టీ, ఈ దెబ్బలు బాధపెట్టున్నాయో లేదో తెలియటమే లేదు.

పాప పళ్ళాలు తప్పించుకుంటూ కంగారుగా ఎగిరిపడుతూ "అయ్యో అయ్యో! ఏం చేస్తున్నావో కాస్త చూడవమ్మా బాబూ" అంటోంది

ఒక పెద్ద పళ్ళెం పసిపిల్ల మొహాన్ని రాసుకుంటూ దాదాపు ముక్కు కోసిందేమో అన్నంత విసురుగ పోయింది—"అయ్యో! అయ్యో! పసిపిల్ల ముక్కు ఎగిరిపోయిందే" అంటూ పాప అరిచింది.

జమీందారిణి బొంగురు గొంతకతో గుఱ్ఱుగా, "ఎవళ్ళ పని వాళ్లు చూసుకుంటూ, ఇంకో జోలి పెట్టుకోకుండా ఉంటే, ప్రపంచం ఇంతకన్నా కాస్త తొందరగా అన్నా తిరుగుతుంది" అంది.

పాపకు తన జాగ్రఫీ తెలివితేటలు చూపించేందుకు అవకాశం వచ్చింది కదా అని సంతోషంవేసి వాగుడు మొదలుపెట్టింది : "ప్రపంచం ఇం

(20 వ పేజీ చూడుడు)

చవితికీ ఏకాదశికీ తారతమ్యం

పిల్లల కథలు

యనమండ్ర రూపలి

అనగా అనగా ఒక అల్లుడు అత్తవారింటికి వచ్చాడు. ఆరోజు నాగులచవితి. అత్తగారు అల్లుణ్ణి చాలా మర్యాద చేసింది. ఆమె ఆ వేళ ఉపవాసం వుంది. అందుచేత అల్లుడుకూడా వుంటాడేమో అని "నాయనా, యీవేళ చవితి వుపవాసం వుంటావా?" అని అడిగింది. అల్లుడు అలాగే అన్నాడు. ఇంకేం! కమ్మని చిమ్మిలి, చలిమిడి, పానకం, అరటిపళ్ళు, జామిపళ్ళు-అన్నీ పూజ చేసి దేవునికి నివేదన చేసినతర్వాత అల్లుడికి కడుపునిండా పెట్టింది. భోజనంకన్నా ఇదే చక్కగా వుం దనుకొన్నాడు అల్లుడు.

ఇలా కొన్నాళ్లు అయిన తర్వాత క్రమంగా ఏకాదశి వచ్చింది. ఆవేళకూడా వుపవాసం వుంటావా? అని అల్లుడిని అడిగింది. ఫలాహారాలు బాగా తినవచ్చుకదా అని అల్లుడు తప్పకుండా వుంటానన్నాడు. కాని మధ్యాహ్నం 2 గంటలయినా అత్తగారు ఏమీ పెట్టక పోవడం చూచి "యీవేళ ఫలహారం ఏమీ పెట్టలేదేం అత్తయ్యా?" అని అడిగేడు. దానికి ఆవిడ "యీవేళ ఏమీ తినకూడదు. నిరాహారం చేయాలి" అంది. దానితో ఆ అల్లునకు తల తిరిగింది. అన్నమేనా తిని ఉండవలసిం దని చాలా విచారించాడు. ఆనాటితో చవితికీ ఏకాశికీ తారతమ్యం తెలుసుకొన్నాడు.

ఒకరా! యిద్దరా?

(10వ పేజీ తరువాయి)

కృష్ణలో ఆతురసన్న్యాసం పుచ్చుకొని వానిమూలమున 'బలవత్సన్న్యాసం' స్వీకరించి కలియుగకాలంలో శ్రీ కృష్ణపరమాత్మను శృంగార భక్తిద్వారమున సేవించి (భామకలాపం చూ.) తాను తరించి యితరులను తరింపచేసినవారు సిద్ధేంద్రులు గాని నారాయణ (తరంగిణీకర్త) తీర్థులు కాదు. యిందులో కలాపం పండిత పామరరంజకం, తరంగాల రచన పండితమాత్ర రంజకం అని తెలివిడి. అయినా సిద్ధేంద్రులనుగాని నారాయణతీర్థులనుగాని పూర్వాశ్రమ నామ మేదో నాకు యింతవఱకు శ్రుతంగాని దృష్టంగాని కాలేదు. యెవరికేని తెలిసినచో తెలుపగోరినాను.

లీలాశుక, జయదేవ, నారాయణతీర్థత్రయానికి సంబంధం అంతో యింతో వున్నట్టు కొక్కొటిపురాణంగా చెప్పుకోవచ్చునేమో వుంది కాని భామాకలాప నేతుకర్తతో యీ ముగ్గురిలో యే వొక్కరికిన్నీ సంబంధం వున్నట్టు నే నిప్పటికి (నా వయస్సిప్పుడు 78 సం॥) విన లేదు. అయితే తరంగాలపీఠికలో సంబంధం వున్నట్టు వ్రాసినవారికి యెవరివల్లనో ఆవిధంగా వుపలబ్ధం కాకపోతే వారుమాత్రం నిరాధారపు వ్రాతను యెందుకు వ్రాస్తారు? అనే అంశం విచారణీయం కనక పీఠిక వ్రాసినవారు వారికి అయీ విషయం యెవరివలన వుపలబ్ధమైనదో తెలుపవలసిన భారం వున్నదని గ్రహించి యథార్థమును తెల్పుటకు ప్రయత్నింతురుగాక. సిద్ధేంద్రులకు సంబంధించిన యితిహాసం నేను యెఱిగినది సంగ్రహించి వ్రాయుచున్నాను.

కృష్ణానదీతీరమునందలి కూచిపూడి గ్రామము నివాసంగా గల వొకానొక వెలనాటి బ్రాహ్మణ యువకుడు విద్యాభ్యాసంకోసం కాశీ వెళ్లి అక్కడ వ్యాకరణమో, తర్కమో, అన్యమో, అభ్యసించి స్వదేశానికి ప్రయాణమై వెళ్లునప్పుడు ఫలానారోజుకు కొంత పూర్వమే స్వగ్రామం చేరుకోవాలనిన్నీ, అనుకొన్న రోజున వున్న సుముహూర్తానికి గర్భాధానం చేసికోవలెననిన్నీ సంకల్పించుకున్నట్టున్నూ అట్టి సంకల్పానికి కారణం ఆనాటి సుముహూర్తపు సుగుణాలే అనిన్నీ, పిమ్మట అనుకున్న ప్రకారం స్వగ్రామసామీప్యానికి చేరుకోగలిగినా కృష్ణకు అవలియొడ్డున వున్న స్వగ్రామం చేరుకోవడానికి వఱదలవల్ల సాధ్యం కాని ప్రతిబంధకం యేర్పడియున్నప్పటికీ మన కథానాయకుడు గడితగాడు గనక నడి యీదిచేరినే (నదీం బాహుభ్యాం నదీం తరేత్) ఆ మహానదిని తరించడానికి సాహసించి యేటి మధ్యభాగం దాకా యీదేటప్పటికి పూర్తిగా అలయిక యేర్పడి అవసానం దాపరించినట్లు గోచరింపగా ఆ మహావిద్వాంసుడు 'ఆతురసన్న్యాసం' స్వీకరించి (ఆతురసన్న్యాస మనగా, ఆసన్న మరణుడు సర్వాంగా మానసికంగా గాని అథవా మర్గాంతరంగా గాని తత్త్వమసీత్యాది మహావాక్యోపదేశాన్ని కైకొనుట) ఆ ప్రవాహం మీదనే ప్రాయోపవిష్టుడైనట్లు కొంతకాలం జపతత్పరుడై వుండగా భగవంతునికి ఆయన్ని పరీక్షించే తాత్పర్యం కలిగి [illegible] యే కా— ప్రాణాపాయకరమైన అప్పటి ఆ యాసం కొన్ని నిమిషాలలో తగ్గి, క్రమంగా కొంత సేపట్లో తన గ్రామ ప్రాంతం చేరుకోగలిగి, తాను కోఁగడ యేర్పఱచుకొన్న సుముహూర్తానికి సంపకులు పీటలమీద కూర్చోవడానికి పెళ్లి కూతురు యెంతగా బలవంత పెట్టినా రాకపోయేటప్పటికి బంధుజాలం పలువురు పలువిధాలుగా తలంచి ఆ పెను గోప్యంగా ప్రశ్నించేటప్పటికి ఆ పతీతిలకం "నన్నెందుకు బాధిస్తారు. అయినా నా పెనిమిటి కాడు. యెవరో సన్న్యాసి. కమండలాలు చూపెండి. ఆయనతో నేను పీటలమీద కూర్చోవడం అపచారం కాదా?" అంటూ యేమేమో సాహసించి పలికేటప్పటికి పెద్దలూ బంధువులూ 'పంచ షష్ఠం, పంచాష్టకం'గా గుసగుసలాడుకోవడానికి ప్రారంభించడం కనిపెట్టి గర్భాధానపు పెండ్లికొడుకు తన తప్పిదాన్ని (మహావిద్వాంసుడు గదా) తాను గుర్తించి (విమలయశోనిధీ పురమక్షత యెఱుంగుచునుండు నావె.........తారకం.) సభ్యులతో—"ఆర్యులారా! మీ రెవరును ఆపె శీలమును చెడగొట్టకుడు. మీకు నేను ఆపె భర్తగా గోచరించినా, అది నిజమేఅయినా, ఆపెకు సన్న్యాసిగాకూడ గోచరించుచున్నాను. ఇదిన్నీ నిజమే. నమ్మటకు శక్యంగాని యీ విషయం మిమ్మును నిమ్మించు రహస్యమును మనవి చేసెద" అని కృష్ణామహానదీ తీరమహా ప్రవాహమధ్యమున జరిగినట్టియు, 'ఆత్మైక వేద్యమైనట్టియు' ఆతురసన్న్యాసగాథను తేటతెల్లముగా నుపన్యసించి, చేతులు జోడించి "ఆర్యులారా! నేను యింతవఱకు చేసినదే పెద్ద తప్పిదం. యింకా అజ్ఞానాంధకారంలో బడి చెడిపోవుటకు మీవంటి ప్రాజ్ఞులు సమ్మతింపరు గనక ఆపెకు గోచరించిన విధంగా నేను సన్న్యాసినే; మున్ముందుకీ సన్న్యాసినే. భగవాను డనుగ్రహించిన నా ఆతురసన్న్యాసాన్ని మీరు ఖాయపఱచవలసిం దని ప్రార్థిస్తాను. "యదహరేవ విరజేత్" అనుశ్రుతి దీన్ని సమర్థిస్తుంది. మీరు నన్ను అనుగ్రహించి తరింపచేయాలి" యీవిధంగా వారిని ప్రార్థించేటప్పటికి సదస్యులుకూడా యిది భగవన్నిర్ణీతం కనక "అనివార్యం" అని అంగీకరించిరనిన్నీ అయీ మహావ్యక్తి సిద్ధేంద్రులు అనే నామంతో రాధాకృష్ణుల శృంగారాన్ని కాని సత్యభామాకృష్ణుల శృంగారాన్ని గాని ప్రతిపాదించే-కలాపాన్ని రచించి దాన్ని గ్రామస్థులలో అర్హులకు బోధించి తత్ప్రకటనద్వారా యావత్కాలాన్ని వెళ్ళించి క్రమంగా—

"సార్ధకే మునివృత్తీనాం
యోగే నాన్తే తనుత్యజామ్"

అనే కాళిదాసోక్తిని సార్థకపఱిచా రనిన్నీ తల్లిదండ్రులవల్ల వినడం.

యీ సిద్ధేంద్రుల గాథ నారాయణతీర్థులకు సంఘటించుటచే నా యెఱిగిన తత్త్వమును తెల్పితిని. యిం దేమేని ప్రమాద మున్నచో విజ్ఞులు సవరింపగలరు.

అయితే పద్యరూపకమైన యీ పీఠిక వ్రాసినవాడు చి॥ విశ్వనాథ సత్యనారాయణ అని యింతవఱకు వ్రాతాక గోచరించింది. దీన్ని గుఱించి వ్రాయడానికి ఉపక్రమించానో అది యెవరిదో గిలికించడానే వ్రాయడమంటూ వుంటుందా? అని చదువరులకు శంక కలుగుతుంది. కాని నా పూర్వపక్షసిద్ధాంతాలు మాత్రం వ్యక్తిని గమనించి ప్రవర్తించవు. కేవలం విషయాన్నిమాత్రం పురస్కరించుకొని వుంటా యనడానికి యిది గమకంగా గ్రహించగలరు.

చి॥ సత్యనారాయణ రచన తేలికశైలిలో వుండ దనిన్నీ చాలా ప్రౌఢంగా అనగా అన్వయకఠినంగా వుంటుందనిన్నీ చాలామంది అభిప్రాయం. నేనుకూడా వీరిలో వొకడను. కాని తీర్థులవారి జీవితచరిత్రను కూర్చి వ్రాసిన యీ కావ్యాన్ని (కదళీపాకం) చదివిన పిమ్మట నా అభిప్రాయం దానంతట అదే మాఱిపోయింది. భవతు.

సత్యనారాయణ తీర్థులవారు గోదావరి డి॥ కోనసీమవారుగా లిఖించి యున్నాడు. నాకు ఆయన యే సీమవారో తెలియదుగాని కోనసీమవా సన్న్యసులనిన్నీ తెలియదు. తెలిసియున్నచో యీ విషయంకూడా వివరించడం ఆవశ్యకమే. అన్నిటికన్నా తీర్థులవారూ సిద్ధేంద్రులూ వొకరు కారు. అని నా విన్కిడి.

కూచిపూడి బ్రాహ్మణు లందఱూ ఆయన రచనను శిరసావహించడాన్ని గొప్పచేసి చెప్పకోవడం, మొగవాళ్లు స్త్రీవేషం వేసుకుని నటించడం వున్నప్పుడే సంఘటిసుంది. యీ యోగం వొక్క—భామాకలాపానికే. తీర్థులవారి తరంగాలుకూడా నాటకరీతిగా రచించినవే అయినా ఆ రచన మృత్యుంజయవిలాస రచనవంటింది. కలాపాత్రల ప్రవేశంతో సంబంధించింది. కృష్ణాతీరం, కూచిపూడి బ్రాహ్మణులకూ కోనసీమకూడా సంబంధం సమన్వయించదు. ముఖ్యాంశం యిదే.

కృష్ణాతీర వాసియైన యొకానొక బ్రాహ్మణ యువకుడు దైవికంగా కృష్ణలో యీదుతూ ప్రాణాపాయానికి లోనై జ్ఞాని కనుక ఆతురసన్న్యాసాన్ని స్వీకరించి దైవాతూ ఆ గండం తప్పి వొడ్డుకు చేరి పిమ్మట అయీ విషయం (స్వాత్మైకవేద్యం) గణింపక సాంసారిక ప్రవర్తనకు లోనగుచునుండగా భగవంతుడు ఆయన భార్యద్వారా యీ రహస్యాన్ని బయలుపఱచడం తట్టిరా జరిగిం దనిన్నీ, ఆ కారణంచేత ఆయన యథోక్తసన్న్యాసాన్ని పుచ్చుకున్నప్పటికీ సంసారభ్రాంతి శాంతించని కారణంచేత తాను సత్యభామ పాత్రలో అంతర్ముఖుడై శ్రీ కృష్ణసమాగమాత్మకమైన తపస్సు—

"కృష్ణ వాసుదేవ కేశవ పరమాత్మ
అప్రమేయ! వరద! హరి! ముకుంద!
మిమ్ముఁ జూడఁగంటి మీకృపఁ గనుంగొంటి
నఖిలసౌఖ్యపదవు లందఁగంటి"

(భాగవతం)

ఈవిధంగా శృంగారభక్తురాలై సత్యభామ శ్రీ కృష్ణుణ్ణి సేవించినట్లు సిద్ధేంద్రులున్నూ తరణోపాయం కల్పించుకొని తరించడం గ్రామస్థులు ద్విజాలు (బంధుగులు) కనిపెట్టి గ్రామం యావత్తూ ఆయన్ని ఆయనరచనకు వ్యాప్తి కలిగించడం ద్వారా గౌరవించినట్టు యిప్పటికీ కర్ణాకర్ణికగా చెప్పుకోవడం వుంది.

భరతనాట్యం కూచిపూడి బ్రాహ్మణులవల్లనే కొనవూపిరితో నిల్చియుండగా అంతట్లో దేవేంద్ర నాటకాలంటూ మహారాష్ట్రులు వచ్చి, 50 యేళ్లకు పూర్వం కొంత అయీ నాట్యానికి ప్రాణం పోశారు. అయీ నాట్యకళని ఋషులు కూడా సన్మానించినట్లు కాళిదాసాదులు లిఖించినా వైదికులు దీన్ని అంతగా గౌరవించకపోవడంచేత నిన్న మొన్నటిదాకా దీనిగతి అంతంతగానే వుంది యిటీవల న్యాయవాదులలోనైనవారు దీనిని గౌరవించి అవలంబించడం నటించడం చేత దీనిరేఖ బయటపడింది.

భక్తికంటే తరణోపాయం మఱి వొకటిలేదు—లేనే లేదు. "యో మద్భక్తస్స మే ప్రియః"— (భగవద్గీత. ౧౨ చూ.) అందులోనూ శృంగారభక్తిద్వారా తరించడం ఎంతో గణనీయం. వేదంలోకూడా అయీ విషయం అందరూ యెఱిగిన శృంగారం ద్వారా నే ప్రకటితమైంది. ("యోషా జారమివ ప్రియం" చూ) జారమివ అనడంలో కొంత వివరించాలి. ప్రతి మిథునమున్నూ (యౌవనంలో) శృంగారసాధిష్ఠానమే అయినా అందులోనూ "తత్రాపి చ చతురోంశః" పరకీయయందు ప్రేమనోవంతుడున్నూ వర్తించువిధం.... గోపికలు పరకీయలు కనకనే వారి శృంగారభక్తి [illegible] వారిని తరింపజేసింది. కేవలం అమాయకులైన వెఱ్ఱిగొల్లలచరిత్రే వేదంకన్నా మిన్నగా మహావిద్వాంసులకు పారాయణగ్రంథమైనది. అయీ చరిత్ర సంస్కృతంలో గేయాలుగా రచించి భక్తలోకాన్ని వుద్ధరించినవారు శివనారాయణ తీర్థులు. తెలుగులో గేయప్రబంధంగా రచించి తద్వారా స్వగ్రామాన్నిమాత్రమే కాక చాలా భాగం తెలుగుదేశాన్ని తరింపజేసినవారు సిద్ధేంద్రులవారు. యీ యిద్దఱికీ యేవిధమైన సంబంధమూ లేదు. ఉభయులును రసవంతమైన కవులు. సిద్ధేంద్రులవారి సన్న్యాసం బలవంతంగా సంఘటించినది. నారాయణతీర్థులవారిది అట్టిది గాదు; సక్రమమైనదియే యని పాఠకలోకము తెలుసుగాక.

స్వకీయరచనలషష్టిపూర్తి ఉత్సవం

(7వ పేజీ తరువాయి)

త్తుగా ప్రశ్నలడగటం హార్టీకి సరదా. మాట్లాడుతూ మాట్లాడుతూ "మీకు దెయ్యాలంటే నమ్మకం ఉందా?" అని అకస్మాత్తుగా అడిగాడు. "ఇద మిత్థమని చెప్ప లేనన్నాను నవ్వుతూ—"అల్లాంటి అధిభౌతిక రూపా లేవన్నా ఉంటే అప్పుడుండా ఇక్కడ రాత్రిళ్లూ తిరుగుతూ ఉండిఉండాలి" అన్నాడు.

నిజమైన దయ్యాన్ని చూట్టానికి చిన్నప్పుడు తా నెంతో ఉబలాటపడేవాడనని, హార్టీ చెప్పాడు.

ఆ యన్న గుఱించి, వెస్సెక్సు గురించి నేను ఏమి వ్రాయాల్సివచ్చినా, నాకు ఆయన సహాయం పూర్తిగా లభించేది.

హార్టీ ఎంత గొప్ప వ్యక్తో, ఎంతటి రచయితో, ఎంత ఉదారుడో, ఉత్తముడో నాకిప్పుడు తెలిసివచ్చింది. నాకే కాదు ఇతరుల కెంత మందికో ఆయనపట్ల, ఆ అభిప్రాయం ఉంది. మదాం గార్‌గ్రాండ్, హార్టీని కలుసుకోవాలని నా ద్వారా అడిగింది. హార్టీని చూశాక, "ఇంత ఇల్లాంటివాడని నే నెప్పుడూ అనుకోలేదు. ఎంతటి సహజప్రకృతి—ఎప్పటికీ ఆయనను మరచిపోలేను" అంది.

ఇల్లాగే గొప్ప రచయితలను ఇంకా చాలా మందిని కలుసుకొనే భాగ్యంకూడా నాకు లభించింది. జోలా ఒకడు. ఆ రోజుల్లో డ్రేఫస్ తరఫున వాదిస్తూ "జా అక్యూజ్" అన్న గ్రంథం వ్రాసి ందుకు ఫరాసు ప్రభుత్వం అతన్ని స్వదేశం నుంచి వెళ్లగొట్టింది. ఇంగ్లండులో ఆయన పరిచయం నాకు కల్గింది. పొట్టిగా లావుగా ఉండేవాడు చచ్చారం—ఆ గడ్డం, ఆ మొహం, చూస్తూంటే, అనంతమైన శక్తికి నిలయంకూడా అనిపించేవాడు. కాని ఎక్కడా కవీ, రచయితా అన్నట్టే కనిపించేవాడు కాడు. ఆయన వాస్తవిక రచనలు ఆంగ్లేయులకు నచ్చలేదు. "ఆంగ్లేయ ప్రజలు బహువాస్తవిక జ్ఞానులనే నేను ఎప్పుడూ అనుకొనేవాడిని. నేను వాస్తవికవాదిని. మరి నా రచనలు మీ కెందుకు అవగాహన కావో! విచిత్రమే" అనేవాడు జోలా.

ఇంకో ఫ్రెంచి రచయిత పాల్ బ్లూరియెతో కూడా నాకు పరిచయం ఉంది. బ్లూరియె సునిశిత హాస్య రచయితమాత్రమే కాదు అంతకన్నా ఉపన్యాసాలివ్వటంలో ఆయన ప్రతిభ గొప్పది. అప్పటి రోజుల్లో ఒక లెక్చరు సంఘాని కగ్గుణ్ణిగా ఉంటూ, బోన్మత్‌లో ఉపన్యాసాల కాయన్ను ఆహ్వానించాను. సభలో, ఆద్యంతాలు, సభికులు ఆయన హాస్యధోరణికి తెరలు తెరలుగా నవ్వుకొంటూ కూర్చున్నారు.

అప్పట్లో నేను కొద్దిగా ఉపన్యాసాలియ్యటం అలవాటు చేసుకొంటూన్నాను. అందుకని ఆయన ఉపన్యాసానంతరం, నాకుకూడా ఏవన్నా కొన్ని చిట్కాలు చెప్తారా అన్నట్లు సలహా అడిగాను. ముందొక చిరునవ్వు నవ్వాడు. తర్వాత కొంచెంలో చెప్తాను అని—

"చెప్పేందు కేదో చూసుకోటం—నిలబడి చెప్పేయటం—"ఆ తర్వాత అంటూ కన్నులు అల్లరిగా చికిలిస్తూ, "ఘోరణి" కట్టిపెట్టడం" అన్నాడు — ఫరాసు భాషలో ఆయన చెప్తూంటే నోరుమూసుకోటం అన్న అర్థం ఇచ్చిన మాటలుకూడా, అతి సరళంగానే ఉన్నాయి.

రచయితకు, ఆ జీవితానికి అవసరమైన విస్తృత పర్యటనం, అనేకమంది వ్యక్తులను ప్రపంచాన్ని చూడగల అవకాశాలు కల్గించుకోటం వింతవింత స్థలాలూ, వింతవింత వ్యక్తులూ, వీరందరినీ అవగాహన చేసుకోటం,—ఇత్యాది విషయాలు ఆనందదాయకాలకటమే కాకుండా— అసలు రచనకు కావలసిన వస్తుసముదాయాన్నీ, అనుభవాన్నీ, గాఢపరిశీలనా బుద్ధిని, కూర్చిపెడతాయి అసలు ఉత్తమ రచయిత రచనలో, వివిధ ప్రకృతి స్వభావాల, సన్నిహితానుకరణమే విస్తృతంగా ఉంటుంది. "ఈ కథలో వ్యక్తులూ, ఏ సజీవ వ్యక్తులనూ, ఉద్దేశింపబడి వ్రాయబడినవారు గారని" ప్రతి పుస్తకముఖాన్న పెద్ద అక్షరాల్లో ప్రకటన ఉన్నా కూడా, యథార్థవ్యక్తులకూ, జీవితఘట్టాలకు సంబంధీకం గాని ఉత్తమ రచనలు లేవు.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు :

ఆసియా దూరప్రాచ్య ఆర్థిక సంఘ కార్యకలాపం

ఈ నెలారంభమునుండి ఉదకమండలంలో జరుగుచున్న ఆసియా, దూరప్రాచ్యరాజ్యాల ఆర్థికసంఘ సమావేశం జూన్ 12 వ తేదీన సమాప్తమైనది ఈ సంఘము పుట్టుపూర్వోత్తరములను, ఈ సమావేశప్రాముఖ్యతను, సమావేశము నకు ఉదకమండలంలో జరిపిన ఏర్పాట్లను గురించి ఇదివరకే ఈ పుటలలో చదివియుంటిమి. ఈ సమావేశములో నిర్వహింపబడిన కార్యక్రమమును గురించి ఇప్పుడు కొంతవరకు తెలిసికొందము.

ఆసియా, దూరప్రాచ్యరాజ్యాల ఆర్థికసంఘ సమావేశమును ఉపక్రమించుచు పండిట్ జవహార్‌లాల్ నెహ్రూ చేసిన ఉపన్యాసమును గురించి ఇదివరకే ప్రస్తావించితిమి. ఆసియారాజ్యముల సామాన్య పౌరుని అభిప్రాయములనే ఆయన పునరుద్ఘాటించెను. ఆసియారాజ్యములు ఆర్థికముగ అభివృద్ధిజెందవలెనని కోరుచున్న విశ్వాని ఇందుకొరకై, రాజకీయముగా ఏ దేశముయొక్క ప్రాబల్యమునకు లొంగిపోవు. ఆసియా రాజ్యముల ఆర్థికాభివృద్ధికి విదేశముల సహాయము అత్యవసరమే. అది లభించినచో సంతోషమే. ఆ సహాయము గౌరవప్రదమైన షరతులతో లభించవలెను. తమ రాజకీయప్రతిపత్తికి హాని వాటిల్లజేసెడి ఎట్టి షరతులపైనైనను, ఎట్టి సహాయము లభింపనున్నను ఆసియారాజ్యములు ఆ సహాయమును అపేక్షింపవు విదేశసహాయము లేకపోవుటవలన వాని ఆర్థికాభివృద్ధి నెమ్మదిగా జరుగవచ్చును. అందుకైనను అంగీకరింపవచ్చునుగాని, తిరిగి విదేశముల రాజకీయ ప్రాబల్యములో మాత్రము పడిపోరాదు. అను ధోరణిలో పండిట్ నెహ్రూ ఆసియారాజ్యముల దృక్పథమును వెల్లడించెను. భారతదేశ జనాభానుగురించి ప్రచారములో నున్న కొన్ని అపోహలను పండిట్ నెహ్రూ ఖండించెను. భారతదేశజనాభా దేశము పట్టలేనంత, పోషింపలేనంత ఎక్కువగా పెరిగిపోయినదనీ, అందువలననే ఆ దేశములో జనులు బీదవారు, రోగగ్రస్తులు అయినారనీ బ్రిటిష్‌ఆర్థికశాస్త్రవేత్తలు, వారి ననుసరించు భారతీయులు కొందరు చెప్పుచుందురు. ఈవాదము సరియైనది కాదని దాదాభాయ్ నౌరోజీ కాలమునుండి భారత ఆర్థికశాస్త్రవేత్తలు ఖండించుచునే యున్నారు. భారతదేశము ఆర్థికముగను, వ్యవసాయికముగను ఇంకను ఎంతో అభివృద్ధి చెందవలసియున్నది. ఆ అభివృద్ధి జరుగుచున్న కొలదీ జనాభాకు సరిపడు ఆహారపదార్థములు, ఇతర సౌకర్యములు తేలికగానే లభింపగలవు. మనము జాగ్రత్త వహింపవలసినది మన జనాభానుగురించి గాక ఆర్థిక, వ్యవసాయిక అభివృద్ధినిగురించియే నని వారి అభిప్రాయము. పండిట్ నెహ్రూ ఈ విషయమునే ఈ అంతర్జాతీయసభలో ఉద్ఘాటించి, ఇప్పటివరకు అంతర్జాతీయముగా ప్రచారములో నున్న అపవాదమును పూర్తిగా నిర్మూలన మొనరించినాడు.

ఉదకమండల సమావేశమునకు అధ్యక్షుడుగా భారతప్రతినిధి, భారతప్రభుత్వ రవాణాశాఖా మంత్రి డా. జాన్‌మత్తాయ్ ఏకగ్రీవముగా ఎన్నుకొనబడెను. సభాకార్యక్రమమును ఈయన అతి హుందాతో నిర్వహించి, అన్నిదేశముల ప్రతినిధుల మన్ననలను పొందగలిగెను.

ఆసియా దూరప్రాచ్యరాజ్యాల ఆర్థిక సంఘంలో మొట్టమొదట చర్చకు వచ్చినది ఇండొనీసియా సభ్యత్వపు దరఖాస్తు. ఆసియాదూరప్రాచ్య ప్రాంతములో వుండి, ఈ సంఘకార్యనిర్వహణకు తోడ్పడగల ఏ దేశమునైనను ఈ సంఘములో 'అసోసియేటెడ్' సభ్యరాలిగా జేర్చుకొనుటకు వీలున్నది. ఇందువలన ఇండొనీసియా రిపబ్లిక్‌కు సభ్యత్వమిచ్చుటకు ఎట్టి ఆక్షేపణ వుండకూడదు. కాని డచ్ సామ్రాజ్యవాదులు, ఇండొనీసియన్ రిపబ్లిక్‌కు అంతర్జాతీయ ప్రతిపత్తి లభింపనివ్వదలచలేదు. ఇండొనీసియన్ రిపబ్లిక్ స్వతంత్రరాజ్యముగా అంతర్జాతీయ సభలలో పాల్గొన్నచో అది అంతర్జాతీయముగా స్థిరపడిపోయిన రాజ్యముగా భావింపబడును. ఇది డచ్‌వారికి ఇష్టములేదు. ఇండొనీసియా రిపబ్లిక్‌ను నాశనముచేయుటయే వారి ఉద్దేశ్యము. అందువలన తాము తమ కీలుబొమ్మలుగా ఏర్పరచిన ఇతర ఇండొనీసియా ప్రభుత్వములతో ఇండొనీసియన్ రిపబ్లికును కూడ కలిపి, అన్నిటికి ఒక సభ్యత్వమును మంజూరు చేయవలసినదని దరఖాస్తు పెట్టిరి. 'ఈ సంయుక్త ఇండొనీసియా' ప్రతినిధివర్గములో ఇద్దరు రిపబ్లికన్లను జేర్చుకొందుమని డచ్‌వారు సూచించిరి. ఇందువలన రిపబ్లికన్లు అల్పసంఖ్యాకులుగా వుండిపోయి; 'సంయుక్త ఇండొనీసియా' ప్రతినిధివర్గము, డచ్ సామ్రాజ్యవాదులు చెప్పినట్లు నడచుకొనవలసివచ్చును. అంతేగాక, రాజకీయముగా ఇండొనీసియా రిపబ్లిక్ ప్రతిపత్తికి భంగము కూడ వాటిల్లును. ఇతర రాజ్యములు ఇండొనీసియన్ రిపబ్లిక్ ఒక స్వతంత్రరాజ్యము కాదని భావింపగలవు. ఇట్లు చేయుటకొరకే డచ్ సామ్రాజ్యవాదులు ఈ తంత్రమును పన్నిరి. ఇతర సామ్రాజ్యవాదులు వారికి పూర్తిగా సహాయపడిరి. ఇండొనీసియా రిపబ్లిక్‌కు ప్రత్యేక సభ్యత్వ మివ్వవలసిన దని భారత ప్రతినిధి డా. శ్యామాప్రసాద ముఖర్జీ గారు ప్రతిపాదించిరి. రష్యన్ ప్రతినిధి నొవికోవ్ ఈ ప్రతిపాదనను బలపరచెను. అయినను సమావేశములో సామ్రాజ్యవాదులకే ఎక్కువ బలము లభించెను. ఇండొనీసియా సభ్యత్వము విషయము మరుసటి సమావేశమువరకు వాయిదా వేయవలెనను తీర్మానము అంగీకరింపబడెను.

ఆసియా, దూరప్రాచ్యరాజ్యాల పారిశ్రామికాభివృద్ధికి దోహదము చేయుటయే ఈ సంఘము ముఖ్యోద్దేశము. ఈ ప్రాంతములోని పారిశ్రామికాభివృద్ధి వివరములను సేకరించి, అభివృద్ధిమార్గములను, అవసరములను సూచించుటకు రెండేండ్లక్రితమే ఒక 'పరిశోధక సంఘము' ఏర్పాటు చేయబడెను. వివిధ దేశముల పారిశ్రామికాభివృద్ధికి ఆయా దేశముల ప్రభుత్వములు యుద్ధకాలములోను, అటుతర్వాతను తయారుచేసిన అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి ఆసియా, దూరప్రాచ్యరాజ్యాల కన్నిటికి ఒక సంయుక్త ప్రణాళికను ఈ సంఘము రచించినది. ఈ పరిశోధక సంఘసభ్యులు ఆయా దేశములలో పర్యటించి, ప్రభుత్వోద్యోగులతోను, పారిశ్రామిక వేత్తలతోను సంప్రదింపులు జరిపి ప్రణాళికను రచియించినచో అది ఇంతకన్న బాగుండెడిది కాని అట్లు చేయుటకు కావలసిన ధనము, కాలముకూడ వీరికి లభింపలేదు.

ఆసియా, దూరప్రాచ్యరాజ్యాల పారిశ్రామికాభివృద్ధికి ముఖ్యముగా అవసరమైనది యంత్రసామగ్రి, సాంకేతికనిపుణులు, విదేశ ధనసహాయము. ఈ మూడు విషయములను 'పరిశోధక సంఘము' ఆలోచించినది కాని నిర్మాణాత్మకమగు సూచనలు చేయలేకపోయినది. అసలు ఈ సంఘమునకు పెద్ద అధికారము లేవి లేవు. ఈ సంఘము ఆయా ప్రభుత్వములకు కేవలము సూచనలు మాత్రమే చేయును. వాటి నంగీకరించి తీరవలెనను షరతు ఎక్కడా లేదు.

ఆసియా రాజ్యములు పరస్పరము సహాయమొనరించుకొనవలె నని అందరు అంగీకరింతురు. యంత్ర సామగ్రి విషయములో ఈ పరస్పర సహాయము ఎంతమాత్రము ఉపయోగకారి కాదు. ఆసియా రాజ్యములన్నియు పారిశ్రామికముగా వెనుకబడి వున్నవే. యంత్ర సామగ్రి తయారుచేయుగల దేశ మొక్కటీ లేదు. జపాన్ మిత్రరాజ్యాల ఆక్రమణలో వుండుటవలన దానిపై ఏ ఆశలు పెట్టుకొనుటకు అవకాశము లేదు. కాబట్టి ఆసియాదేశములకు కావలసిన యంత్రసామగ్రి పూర్తిగా పాశ్చాత్యరాజ్యాల నుండి, అందును ముఖ్యముగా బ్రిటన్ అమెరికాలనుండి రావలసియున్నది. ఈ సంగతిని అగ్రరాజ్యములన్నియు గుర్తించినవి కాని సహాయపడుటకు మాత్రము ముందుకు వచ్చుటలేదు. 'మీ మొప్పు డెవ్వరు సహాయ మడిగినారు? మీ మెప్పుడు కాదంటిమి?' అని రష్యన్ ప్రతినిధి ఎదురుప్రశ్న వేసెను. అంతేగాని ఈ సహాయము చేయగలమని చెప్పలేదు. తమదేశములో తయారైన యంత్రసామగ్రి ఎక్కువభాగము ఎగుమతి చేయబడుచునే యున్నదనీ, ఇతర దేశములకు ఎగుమతులు తగ్గించి, ఆసియా దేశములకు ఎక్కువ ఎగుమతులు చేయుట వీలుపడకపోవచ్చునని బ్రిటిష్ ప్రతినిధులు తెలియజేసిరి. అమెరికా ప్రతినిధి డా. గ్రేడీ యంత్రసామగ్రి విషయమును అంతగా పట్టించుకున్నట్లు లేదు. యంత్ర సామగ్రిని సరఫరాచేయుటకన్న, తమ యాజమాన్యమునసే పరిశ్రమలను నడపి, ఆయా దేశములపై ఆధిపత్యమును సంపాదించుట మంచిదని ఆయన భావించియుండవచ్చును. దీనినిగురించి ఆయన చేసిన ప్రసంగము ఈ క్రింద నుదహరింపబడినది. సంఘ సమావేశములో మాత్రము ఆసియా, దూరప్రాచ్య రాజ్యాలకు ఎక్కువ యంత్రసామగ్రిని త్వరలో సరఫరా చేయవలసిందని అగ్రరాజ్యములను కోరుతూ ఒక తీర్మానము చేయబడినది.

సాంకేతిక నిపుణులకు శిక్షణ యిచ్చుటను గూర్చికూడ ఈ సమావేశములో ఆలోచింపబడెను. పారిశ్రామికదేశములు ఆసియారాజ్యముల విద్యార్థులకు సాంకేతికశిక్షణ యివ్వవలెననిగాని, తమ సాంకేతిక నిపుణులను ఆసియారాజ్యములకు పంపి అచ్చటి విద్యార్థులకు శిక్షణ యిచ్చుటకు తోడ్పడవలెననిగాని ఈ సంఘము సూచింపలేకపోయినది. ఇతర దేశములలో లభించు శిక్షణ సౌకర్యములనుగురించి ఇంతవరకు సేకరించిన వివరములను ఆసియా రాజ్యములకు అందజేయుటకు, ఆసియా, దూరప్రాచ్యసంఘ సిబ్బందిలో కొంతమందిని ఈ విషయమై ఆలోచించుటకు నియమించుటకు తీర్మానించినది. ఈ తీర్మానము ఏమాత్రము, ఏ దేశమునకూ ఉపయోగకారి కాజాలదు.

విదేశ ధనసహాయమును గురించి 'పరిశోధక సంఘము' కొంతవరకు వివరించినది. డా. గ్రేడీ తన ఉపన్యాసమంతయు ఇందుకే వినియోగించినాడు. ఆసియా, దూరప్రాచ్య రాజ్యాలు పారిశ్రామికముగ అభివృద్ధి పొందదలచుకున్నచో, అందుకు సహాయపడ నున్న రాజ్యములు కోరిన షరతులకు అంగీకరించవలెను. విదేశస్థులు ఆసియారాజ్యాలలో పెట్టుబడి పెట్టిన సొమ్ముకు భద్రత, వాపసు, లాభములనుగురించి వారికి పూర్తి సంతృప్తి కలుగునట్లు ఆయా రాజ్యములు వ్యవహరింపవలెను. విదేశస్థులు తమ సొమ్ము పెట్టుబడి పెట్టుటకు అనువుగాని పరిస్థితులను సృష్టించుచు, పెట్టుబడి రావటములేదని ఇతరులను నిందించి ఏమి ప్రయోజనము? అను ధోరణిలో ఆయన ప్రసంగించెను. విదేశస్థుల సొమ్ము కొల్లగొట్టవలెనని ఏ ఆసియారాజ్యమూ భావించుటలేదు. విదేశస్థుల సొమ్ము భద్రత, వాపసు విషయమై ఏ అనుమానము వుండ నవసరము లేదు. విదేశస్థులు తాము కోరినంత లాభము యివ్వవలెనన్న ఎవ్వరు అంగీకరింపరు. పెట్టుబడి తమది కదా యని ఏవైన ఇతర రంగములలో ఒత్తిడి తెచ్చుటకుగాని, దేశప్రయోజనములకు విరుద్ధముగ గాని ప్రవర్తించినచో ఎవ్వరు సహింపరు. విదేశస్థులు చేయు సహాయము గౌరవప్రదమైన షరతులపైన లభించిననే ప్రయోజనకారిగా నుండును. ఈ విషయమునే భారతప్రధాని నెహ్రూ, భారతప్రతినిధులు, ఇతర రాజ్యముల ప్రతినిధులు కూడ స్పష్టపరచిరి. ఆసియా, దూరప్రాచ్య ఆర్థిక సంఘము ఈ విషయమై ఎట్టి నిర్దిష్ట ప్రతిపాదనను చేయలేకపోయినది.

(21 వ పేజీ చూడుడు)

మనోవ్యాపారముల ఐక్యత

శ్రీ పారనంది జగన్నాదస్వామి

ఐక్యత రెండు విధములు. రాళ్లకుప్పలోని విడి విడి రాళ్లకు ఒక విధమైన ఐక్యత ఉన్నది. రెండో విధమైన ఐక్యతకు చక్కని ఉదాహరణము ప్రాణిశరీరమందున్న అంగముల ఐక్యత. మొదటి దానిలోని సంబంధము కేవల సన్నిహిత సంబంధము. అనగా ఒకరాయిగద్ద తగిలి మరి ఒక రాయి ఉన్నాదన్న సంబంధము తప్ప మరే విధమైనదీ లేదు. ఆ రెండింటిలో ఒకదానిని రెండోదాని స్థితికి భంగము ఏమీ లేకుండా విడదీయవచ్చును. ఆ రాళ్ల కుప్ప మొత్తపు స్థితికి ఏమీ భేదముగాని లోపముగాని వాటిల్లదు. ఏ ఒకటి రెండు మూడు మొదలైన రాళ్లను తీసివేయడమువల్ల, రాళ్లసంఖ్య తగ్గును గాని స్థితి ఉపయోగము చేష్టలలో మొదలైన ప్రధాన గుణములలో భేదము సంక్రమించదు. తిరిగి ఆ సంఖ్య పూర్తి అయేటట్లు ఆ తీసివేసిన రాళ్లనే గాని అటువంటి ఇతరరాళ్లను గాని ఆ కుప్పకు చేర్చవచ్చును. రెండో విధమైన ఐక్యత అట్టిది గాదు. ప్రాణిశరీరము మొత్తము; దానిని అంగి అందుము. అనగా అంగములు కలది అని అర్థము. ఆ అంగములన్నీ ఉండవలసినట్లు ఉన్నప్పుడు సంఘటించే మొత్తపు అంగికి ఒక ప్రత్యేక పదార్థము, ఒక ప్రత్యేకవిశేషము, ఒక ప్రత్యేక వ్యాపారగుణము అత్తి ఉంటుంది. ఇట్టి మొత్తపు గుణవ్యాపార విశేషము రాళ్లకుప్పకు ఉండదు. ఏ ఒక అంగమును విడదీసినా, మొత్తపు శరీరమునకు అంగికి తీర్చలేని వ్యాఘాతము కలుగుతుంది. విడదీసిన దానిని తిరిగీ పూర్వమువలెనే ఉంచ అసాధ్యము. ప్రతీ అంగమునకు ఉన్న అంగములతోను మొత్తపు అంగితోను కూడా అవిచ్ఛేద్య సంబంధము ఉంటుంది. ఈ భేదమును చక్కగా చదువరుల విమర్శనకు నచ్చాలని ఇంత చర్చించడమైనది.

ఈ చర్చను జ్ఞప్తినుంచుకొని మనోవ్యాపారాల ఐక్యతను విమర్శించవలెను. మనస్సు అనేది అంగి, మనోవ్యాపారాలు అనే అంగములు ఉన్నవి. ఈ అంగముల సమూహము కాదు మనస్సు. మనోవ్యాపారాలు ఒక దానితో ఒకటి సంబంధము కలిగియున్నవి అన్నీ కలిసినన్నీ, ఒక్కొక్కటి వేరుగాను మనస్సు అనే అంగివంటి మొత్తముతో సంబంధము కలిగియున్నవి. ఈ మనోవృత్తుల సంబంధము రాళ్లకుప్పవంటిది కాదు; శరీరాంగముల సంబంధమువంటి అవిచ్ఛేద్య సంబంధము. ఈ సంబంధమును విశదపరుచుటకు ఒక చిన్న ఉపమానము. ఒక చిన్న కోనేరు; దాని ఈ ఒడ్డునుంచి ఆవడ్డుకు అడ్డంగా జల్లెడవంటి చిక్కమొకటి కోనేరంతటా పరచడమైనది. అట్టి చిక్కముతే మీద నుంచి అడుగు వరకు కొంత కొంత ఎత్తున పరచడమైనది. అప్పుడు కొన్ని అంతస్తులు తయారైనవి. ఇట్లే మనోనిర్మాణములో అంతస్తులు ఉన్నట్లు ఊహించి దాని స్వరూపాన్ని బోధపరచుకోవచ్చును. మీది అంతస్తువంటిది జాగ్రత్-చైతన్యము. మన అనుభవములో స్ఫుటముగా ఉన్నది ఈ అంతస్తుకు చెందినది. దీనిని చైతన్య కేంద్రము అని వర్ణించవచ్చును. దాని వెనకనే దానికి అంటీ అంటకుండా ఉన్నట్లు ఉన్న చైతన్యము మరియొక అంతస్తు. ఇది చైతన్యప్రాంతము. ఈ రెండు అంతస్తుల మధ్య ఒక జల్లెడవంటిది ఉన్నదని అనుకోవచ్చును.

ఈ రెండు అంతస్తుల చైతన్య వ్యాపారాలు వేరువేరుగా ఉంటవి. ఉదాహరణ: ఒకడు గదిలో కూర్చొని ఒక ఉపన్యాసము వింటున్నాడు. అతని మనస్సు అంతా ఆ ఉపన్యాసముపై సావధానమై ఉంటుంది. ఆ సమయమున వీధిలో పుట్టుతూ ఉండే ధ్వనులు అతని చెవులకు చేరినా స్ఫుటముగా అతని అనుభవములోనికి చేరవు. అతడు ప్రయత్నపూర్వకముగా ఉపన్యాసముతో సంబంధించిన వాటినే మనస్సుకు చేరనిస్తూ అట్టిస్ఫుటమైన సంబంధము లేని వాటిని చొరనీయకుండా తన మనోవ్యాపారాన్ని నడుపుతూ ఉంటాడు. ఈ ఉదాహరణలో మీద నిరూపించిన రెండు అంతస్తుల చైతన్యాలు ఉన్నవి. ఉపన్యాసానికి సంబంధించి స్ఫుటానుభవములో చేరినవన్నీ జాగ్రచ్చైతన్యము అనే అంతస్తు; అవి చైతన్యకేంద్రమునకు చేరి ఉంటవి. మిగిలినవి అన్నీ కుర్చీమీద కూర్చుండుటవల్ల కలిగే స్పర్శ, చుట్టుప్రక్కలనున్న శ్రోతలగురించి కలిగే అనుభవములు, ఉపన్యాసకుని రూపు చేష్టలు మొదలైన సంగతులు, వీధిలోని ధ్వనులు, ఈ యావత్తు అనుభవము కేవల జాగ్రచ్చైతన్యమునకు చేరినది కాదు. చైతన్య ప్రాంతమునకు చేరింది. ఇది జాగ్రచ్చైతన్యమునకు వెనకనున్న అంతస్తుకు చెందినట్లు మనము విశదపరచవచ్చును. ఈ రెండింటికి మధ్య నున్న జల్లెడవంటిదాని ఉపయోగము ఏమిటి అనగా ప్రాంతములో చేరుతూ ఉన్న అనుభవ సంగతులు కేంద్రములోనికి త్రోసుకొని రాకుండా ఆటంకపరస్తూ ఉపన్యాసమును సావధానతతో గ్రహించ వీలుకలుగజేయడమే అని చెప్పవచ్చును. ఉపన్యాస విషయముతో సంబంధము లేనివి ఏవన్నీ ఉపన్యాస విషయ గ్రహణమునకు లోపము కలుగజేయకుండా అందేటట్లు మనోవ్యాపారము ప్రవర్తిస్తుంది.

దీనికే ఏకాగ్రతాశక్తి అంటాము. మన కట్టి చక్కటి ఏకాగ్రతాశక్తి కలదో దానిని బట్టి మన ఉపన్యాస గ్రహణ నిశ్చలత్వము ఉంటుంది. ఆ ఏకాగ్రతకు అల్లరిచేసే అసందర్భ సంగతులు జారకుండా ఉండేటట్లు రెండు అంతస్తుల మధ్యనున్న జల్లెడతాలూకు కన్నములను మనము సరిపెట్టుకొంటూ ఉండవలెను. మన ఇచ్ఛాశక్తిని, మనోధారణాశక్తిని పట్టి ఆ కన్నములు పెద్ద వికాసము చిన్నవి కావడము జరుగుతూ ఉంటుంది. జల్లెడ చిక్కిపైతే, అనగా మనోధారణ దృఢము కాకపోతే నిరోధము చేసేశక్తి బలముగా లేకపోతే మనము దేనిగురించినన్నీ తదేకధ్యానముతో ప్రవర్తించలేకపోవుదుము. మన జాగ్రచ్చైతన్యములోనికి సందర్భము లేని పరకీయసంగతులు ప్రవేశించును. చైతన్యకేంద్రము చెదిరిపోవును. మనోవ్యాపారము చెడిపోవును.

2

ఈ రెండు అంతస్తులు కలది మనస్సు. కాని వాస్తవముగా ఈ రెండింటికంటె మిగిలిన చైతన్యము కొంత ఉన్నది. ఈ రెండు అంతస్తుల చైతన్యము సుమారు ఒకే రకమని చెప్పవచ్చును. అవి అంత సన్నిహితంగా ఉంటవి. ఒకదానికి ఒకటి అంటే అంటకుండా ఉంటవి. రెండో అంతస్తుఅయిన ప్రాంతచైతన్యానికి తగిలీ తగలకుండా కొంత చైతన్యభాగమును మనము గ్రహించవలెను. దానికి పూర్వచైతన్యము అని పేరుపెట్టవచ్చును. మన జ్ఞప్తిలో ఉన్నవన్నీ గాని వాటిగురించి ఆ సమయాన్న మనము ఆలోచించకుండా ఉన్నవన్నీ ఈ భాగానికి చెందినవి. ఈ పూర్వ చైతన్యానికిన్నీ ప్రాంత చైతన్యానికిన్నీ ఒక జల్లెడవంటిది ఉన్నట్లు మనము ఊహించవచ్చును. ఒక వ్యాపారము జరుగుతూ ఉన్నప్పుడు మన జ్ఞప్తినుండి బయటికి వచ్చినట్లు కొంత చైతన్యము ప్రవర్తిస్తుంది. దానినే స్మృతి అంటాము. అది పూర్వచైతన్యమునుండి అవధానానికి వస్తుంది. అప్పుడు అది కేంద్రచైతన్యానికి చేరింది. అది ఆ జల్లెడవంటి అడ్డు దాటి జాగ్రచ్చైతన్యానికి వస్తుంది. ఈ మనశ్శక్తి చాలా ముఖ్యమైనది. ఈ శక్తియొక్క రూపములుగా బుద్ధి మొదలైన మనోవృత్తులను వర్ణించడము కలదు. మనస్సు చేసే ఉత్కృష్ట వ్యాపారాలన్నిటికీ ఈ అవధానశక్తి ప్రధానము.

కేంద్ర ప్రాంత పూర్వ చైతన్యములనే పేర్లతో వ్యవహరించే చైతన్యమును మూడుఅంతస్తులుగాను మధ్య మధ్య జల్లెడవంటి అడ్డులు ఉన్నట్లుగాను చేసిన వర్ణన అంతా బోధనకొరకు చేసిన విభజనగాని వాస్తవముగా వేరు పదార్థములు గావు. అంతా చైతన్యమే. ఈ మూడు అంతస్తులకు ఒక దానినుండి మరొకదానికి ప్రసరించడము జరుగుతూ ఉంటుంది. ప్రాంతము నుండిగాని పూర్వము నుండి కేంద్రమునకు ఎట్లు ఏ సంగతైనా రాగలదో ఇదివరకే నిరూపించడమైనది. జ్ఞప్తినుండి జాగ్రదవస్థకు భావనలు రాగలవు. అలాగే ఇప్పుడు కేంద్రమును అధిష్ఠించియున్న భావన ఆపని కాగానే పూర్వమునకు పోతూంది. కావాలన్నప్పుడు దానిని జ్ఞప్తినుండి తెస్తుంది. అలాగే ప్రాంత కేంద్రములలో కూడా ఒకదానినుండి మరొకదానికి రాకపోకలు ఉంటవి. కాబట్టి ఈ మూడింటికి గల సన్నిహితసంబంధమువలన వీటి నన్నిటిని కలిపి జాగ్రచ్చైతన్యము అనే ఒక్క పేరుతో సమన్వయించడము కలదు.

అవధానములో ఉండని భావన అనగా కేంద్రమును అధిష్ఠించి ఉండనిది లీనముగా ఉంటుంది. కాని అవసరమైనప్పుడు ఉపయోగము ఉన్నప్పుడు ఆ లీన స్థితిలో ఉన్నది కేంద్ర స్థితికి వస్తుంది. లీనస్థితిలో ఉన్న భావన గురించి మనకు ఏమీ తెలియదు అని చెప్పవలెను. తెలుసుకోవలెననే ఇచ్ఛ కలిగినప్పుడు ఆ లీన స్థితినుండి దానిని కేంద్రస్థితికి తెచ్చుకోగలము. కేంద్రములో నున్నవి ప్రకృతోపయోగములో ఉండును. ప్రాంతమునందున్నవి కనబడుతూ ఉన్నట్లు అందుబడిలో ఉండును. అవధానశక్తిని తక్కువగా ఉపయోగించుకొని ప్రాంతమున ఉన్నదానిని కేంద్రమునకు తెచ్చుకోవచ్చును. పూర్వములో ఉన్న వేవో తెలిసినంతవరకు సులభముగా కేంద్రమునకు తెచ్చుకోవచ్చును; కొన్ని శ్రమపడితేగాని స్ఫురణకు రావు. ఇందుకు ఉదాహరణము ఉపన్యాసాన్ని తీసుకొందము. దేశసంపదగురించి ఉపన్యాసము అనుకొందము. ఉపన్యాసకుడు నిర్వచించే భావనలు కేంద్రమందు ఉండును. దేశమందు పెరిగే మహావృక్షముల గురించి వాటి ఉపయోగముల గురించి ఉపన్యసిస్తే. మనము కూర్చొనియున్న గృహనిర్మాణమునకు ఉపయోగించిన టేకు దూలాలు ప్రాంత చైతన్యములో అంతవరకు ఉన్నవి కేంద్రమునకు ఒక్కసారి రావచ్చును; మనము కూర్చొనియున్న కుర్చీలకు ఉపయోగించిన నల్లఇరిడి చేవకర్ర అదివరకు స్పర్శలో ప్రాంతచైతన్యములో ఉన్నది ఒక్కమారు కేంద్రమునకు రావచ్చును. పై దేశాలలో బాగా పెరిగి ఉపయోగములో ఉండే మెహోగని ఓకుచెట్లు జ్ఞప్తినుండి అనగా పూర్వచైతన్యము నుండి మన దేశములో పెరిగే టేకు మొదలైనవాటితో సరిపోల్చుకు కేంద్రమునకు ఒక్కమారు రావచ్చును. ఇట్లు ఒక అంతస్తునుండి మరియొక అంతస్తుకు చైతన్య ప్రవాహము ఉంటుంది

ఇది అంతా జాగ్రచ్చైతన్యము అని అన్నా అనవచ్చును. కాని ఇదే సంపూర్ణమైన చైతన్యము కాదు. ఈ మూడు అంతస్తుల చైతన్యమునకు వెనుకను చాలాచాలా విస్తృతిగల చైతన్యభాగము ఉన్నది. నదుల పుట్టుక ఎట్లు కనబడకుండా ఉన్న చిన్నచిన్న జలలో ప్రారంభమగునో అల్లే గోచరముకాకుండా ఉన్న చైతన్యపరంపర ఎంతో ఈ జాగ్రచ్చైతన్యమువెనక ఉన్నదని నవీనశోధకులు కనిపెట్టినారు. జలలో ప్రారంభమయే నదులవలెనే ఈ చైతన్యములోనే మన వ్యాపార వృత్తుల ప్రాదుర్భావము లున్నట్లు శాస్త్రజ్ఞులు నిశ్చయిస్తున్నారు. ఈ చైతన్య భాగానికి అపగతచైతన్యము (Unconsicous) అని పేరుపెట్టుదాము. దీని స్వరూపమును ముందు వివరించడమగును.

3

ఈఅపగతచైతన్యానికిన్నీ జాగ్రచ్చైతన్యానికిన్నీ మధ్య ఉన్న జల్లెడకున్నూ, జాగ్రచ్చైతన్యములోని అంతస్తుల మధ్యలనున్న జల్లెడకున్నూ చాలా భేదము ఉన్నది. ప్రాంతమునకూ కేంద్రమునకూ మధ్య నున్న దాని కన్నములు చాల పెద్ద పెద్దవిగాను జల్లెడలో అక్కడక్కడను ఉన్నవని వర్ణించవచ్చును. అనగా ఆ జల్లెడవలన కలిగే ఆటంకము అత్యల్పము; కాబట్టి సాధారణముగా ప్రాంతమందున్న సంస్కారములు సులువుగా కేంద్రమునకు వస్తూ పోతూ ఉంటవి. స్మృతినుండి కేంద్రమునకు వచ్చే దారిలో ఉన్న జల్లెడ కన్నాలు చిక్కగాను దగ్గర దగ్గరగాను చిన్న చిన్నవిగాను ఉంటవి; కాబట్టే ఒక్కొక్కప్పుడు సులువుగా జ్ఞాపకానికి సంస్కారాలు రాక అల్లరిచేస్తూ ఉంటవి; జ్ఞాపకానికి తెచ్చుకోవాలని కొట్టుకొన్న కొలదీ కన్నాలు ఎక్కువ మూసుకుపోతూ ఉంటవా అన్నట్లు అవుతుంది. ఈమూడు అంతస్తులు ఒక రకము. ఈ అపగతము ఒక రకము. జాగ్రచ్చైతన్యానికిన్నీ, అపగతచైతన్యానికిన్నీ మధ్యనున్న జల్లెడకన్నాలు చాలా చాలా చిన్నవిగాను చాలా చిక్కగాను ఉంటవి.

మరియొక భేదము ఉన్నది. జాగ్రచ్చైతన్యపు అంతస్తుల మధ్యలనున్న జల్లెళ్లు బుద్ధిస్వాధీనములో ఉన్నవని చెప్పవచ్చును. వ్యక్తియొక్క ఇచ్ఛానిచ్ఛలను పట్టిన్నీ, బుద్ధియొక్క బలాన్ని పట్టిన్నీ ఈ జల్లెళ్ల కన్నాలను పెద్దవిగాను చిన్నవిగాను చేయ కొంతవరకు సాధ్యము. అపగత జాగ్రతచ్చైతన్యాల మధ్యనున్న జల్లెడ అట్టి లొంగుబాటులో ఉండదు కొంతవరకు ఈ చైతన్యభాగము స్వతంత్రమైనది. అందుచేత స్మృతిసాహాయ్యము ఈ భాగానికి లేదు. జ్ఞాపకము తెచ్చుకోవాలని ప్రయత్నించినందువలన ఆ సంస్కారములు కేంద్రమునకు రావు. కాబట్టే దాని ననుసరించి జాగ్రచ్చైతన్య వ్యవహారము ఉంటుందని చెప్పవచ్చును. అంతే కాదు, మనస్సుయొక్క ఆరోగ్యానారోగ్యములు కూడ ఈ జల్లెడ చేసే పనిపై ఆధారపడి యుండును అని చెప్పినా చెప్పవచ్చు. ఈ భేదములవలన ఈ అపగత చైతన్యము జాగ్రచ్చైతన్యమునకు చాలా దూరమున ఉంటుంది.

ఈ అధ్యాయములో ఉపయోగించిన సామ్యములు బోధకొరకే మాత్రమే. అంతస్తులు, జల్లెడ కేవలము వర్ణన సౌకర్యముకొరకు ఉపయోగించి; పదములు అట్టి వస్తుసామగ్రి లేదు. మనస్సు చైతన్యము పూర్తిగా ఒక్క పదార్థమే. మంచి ఐక్యత గలది. కొన్నిచోట్ల అంగములు అంగి అనేదికూడా ఉపమానమునకు మాత్రమే. ప్రవర్తించేది మనస్సు ఒక్కటి. దాని వ్యాపారాలకు వృత్తులకు పెట్టిన పేర్లు, చేసిన వర్ణనలు దాని ప్రధానమై, ఐక్యతకు భంగము కలుగజేయకూడదు అలాగే వెనుక క్రింద మీద దగ్గర దూరము అన్న స్థలనిర్దేశక పదములను నిర్వచించుకోవలెను. మనస్సుకు చైతన్యానికి స్థల భేదములు లేవు అని చెప్పనక్కరలేదు.

యుగసంధి

(6 వ పేజీ తరువాయి)

"లేను. నేను ఈ చిన్న గడ్డివాము పక్కని పడుకున్నాను. నేను ఆక్రమించుకున్న ఈ చిన్న స్థలం తక్కిన విశాలావకాశంతో పోల్చి చూస్తే ఎంతో చిన్నది. ఆ తక్కిన స్థలంలో నేను లేను. దానికీ నాకూ ఏ సంబంధమూ లేదు. నేను జీవించి ఉన్న ఈ క్షణికమయిన కాలం, నేను లేని అనంతమయిన కాలంలో ఒక చిన్న బిందువు......... ఈ అణువులో, ఈ చిన్న బిందువులో రక్తం ప్రవహిస్తోంది, మెదడు పనిచేస్తోంది. ఏదో కావాలని కోరుతుంది......ఇది అసహ్యంగా లేదూ ? చిలిపితనం కాదూ ఇది ?"

"కాని నే నొకటి అంటాను. నువ్వన్నది మానవు లందరికీ వర్తిస్తుంది."

"నువ్వన్నది నిజం," బజరోవ్ అన్నాడు, "నేను చెప్పబోతున్నది ఏమంటే: వాళ్ళు— నా తలిదండ్రులు— వాళ్ళ కృషిలో మునిగిపోయి ఉంటారు. వాళ్ళ నిరర్థకతను గురించి వాళ్లు ఆలోచించుకుని బాధపడరు. ఇంక నాకో— నాకు అలసట, పట్టరాని కోపమూ తప్ప ఇంకేమీ మిగలేదు."

"కోపమా ? ఎందుకు కోపం ?"

"ఎందుకా ? ఎందుకని అడుగుతున్నావు, మరిచిపోయావా ?"

"అంతా నాకు జ్ఞాపకం ఉంది. కాని నీకు కోపం కలగడానికి సబబు ఏమీ లేదు. నీకు అదృష్టం లేదు. ఒప్పుకుంటాను, కాని......"

"ఉఫ్ ? నా కర్మమయింది. ఆర్కాడీ నికొలెచ్, నువ్వు ఈ నవయువకుల మాదిరిగానే ప్రేమను పరిగణిస్తావు. క్లక్, క్లక్ మంటూ మీరు కోడిపెట్టని పిలుస్తారు. కాని పెట్ట దగ్గరగా వస్తే మీరు పారిపోతారు. నేనలాంటివాణ్ణి కాను. ఇంక ఆ విషయం కట్టిపెడదాం. మన చేతుల్లో లేని విషయాన్ని గురించి విచారించడం సిగ్గుచేటు." అతను పక్కకి తిరిగి పడుకున్నాడు. "ఆహా! సగం చచ్చిన ఆ ఈగని పట్టుకుని ఆ చీమ ఎంత సాహసంగా లాక్కుపోతోందో. లాక్కుపో, తమ్ముడూ, లాక్కుపో. ఆ ఈగ గిజగిజ కొట్టుకుంటున్నందుకు లక్ష్యపెట్టకు. నువ్వు జంతువయిన కారణంచేత కరుణ అనే ఉద్వేగం నీ మనస్సుని బంధించదు. దాన్ని పూర్తిగా వినియోగించుకో. మాలాగ ఆత్మవిధ్వంసం చేసుకోవదు."

"యెవ్ గనీ, నువ్వు ఆ మాట అనకూడదు. నువ్వు ఆత్మవిధ్వంసం ఎప్పుడు చేసుకున్నావు ?"

బజరోవ్ తలయెత్తాడు. "అదొక్కటే నాకు గర్వకారణం. నన్ను నేను నలిపివేసుకోలేదు. కాని ఒక స్త్రీ నన్ను నలిపివేసింది. అయిపోయింది. శాంతిశ్శాంతిః. ఈ విషయము ఇంక నా నోటివెంట ఒక్కమాటఅయినా నువ్వు వినవు."

స్నేహితు లిద్దరూ కొంతసేపు మౌనంగా పడుకున్నారు.

"నిజమే", అన్నాడు బజరోవ్, "మనిషి ఒక వింతజంతువు. మన 'తల్లిదండ్రులు' గడుపుతున్న చప్పు బ్రతుకుని దూరాన్నుంచి పక్కవాలుగా చూస్తే ఇంతకంటే మంచేమిటనిపిస్తుంది. శుభ్రంగా తింటారు, తాగుతారు, న్యాయంగా, ధర్మంగా, తెలివిగా నడుచుకొంటున్నామని వారు ఎరుగుదురు. అది లేనిచోట అసహనానికి మనిషి ఆహుతి అయిపోతాడు. ఏమయినా సరే లోకంతో అనుబంధం పెట్టుకోవాలని మనిషి కోరిక, లోకాన్ని దూషించడానికయినా సరే."

"ప్రతిక్షణమూ అర్థవంతంగా ఉండేటట్టు మానవుడు తన జీవితాన్ని దిద్దుకోవాలి," ఆర్కాడీ ఆలోచిస్తూ అన్నాడు.

"ఒప్పుకుంటాను. అర్థవంతంగా కనిపించే దాంట్లో ఆనందం ఉంది, అది పొరపాటయినా సరే. ఏది అర్థరహితమో కూడా ఎవరిమట్టుకు వారు నిర్ణయించుకోవచ్చును. అది కాదు. నైచ్యం, అదీ భరించరానిది."

"నైచ్యమనేది ఉందని గుర్తించకపోతేసరి, ఇంక నైచ్యమనేది ఉండదు."

"అహ్ ! అది పట్టి నీతివాక్యం, ఊరికే తలక్రిందు చేసి చెప్పావంతే."

"అంటే నీ అభిప్రాయం ?"

"చెపుతా. విద్య జ్ఞానాన్ని ఇస్తుందన్నావనుకో, అది నీతివాక్యం. విద్య అప్పుడప్పుడు అజ్ఞానానికి దారితీస్తుందన్నావనుకో. అది నీతివాక్యాన్ని తలక్రిందు చెయ్యడమన్నమాట. ఇందులో కాస్త శైలి ఉంది. కాని రెండూ ఒకటే."

"అయితే ఏది నిజమంటావు ?"

"ఏది నిజం ? నా ప్రశ్నే నీ ప్రశ్నకి సమాధానం."

"యెవ్ గనీ, ఈ వేళ నువ్వు చాలా విషాదంగా ఉన్నావు"

"నిజంగా? ఎండమూలాన్ని నా మెదడు మెత్తబడిందేమో. తరవాత అన్ని పూతిక పళ్లు తిని నేను తట్టుకోలేను."

"అల్లాగయితే ఒక్క నిద్ర మంచి పని చేస్తుంది," అన్నాడు ఆర్కాడీ.

"తప్పకుండా, నావేపుమాత్రం చూడకు. నిద్రపోతున్న ముఖం మూర్ఖంగా ఉంటుంది."

"ప్రజలు నిన్ను గురించి ఏమనుకున్నా నీకు లెక్క లేదుగా?"

"నీ కేం చెప్పాలో నాకు తోచడంలేదు. అసలయిన మగవాడు లక్ష్యపెట్టకూడదు. అసలయిన మగవాడిని గురించి ఆలోచించి లాభం లేదు. అతన్ని అనుసరించాలి; లేకపోతే అసహ్యించుకోవాలి"

"చిత్రమే! నేను ఎవరినీ అసహ్యించుకోను" అన్నాడు ఆర్కాడీ ఒకక్షణం ఆగి.

"నాకు చాలా మందిని చూస్తే అసహ్యం, నీ గుండె మెత్తనిది. జాలితో జారిపోయే తత్వం నీది, నువ్వు ఎవరినన్నా ఎల్లా అసహ్యించుకోగలవు?......నీకు పిరికితనం ఉంది. నీమీద నువ్వు ఆధారపడలేవు."

"నువ్వో?" ఆర్కాడీ అడిగాడు, "నువ్వు ఏది సాధించగలవని నీ ఆశ? నువ్వంటే నీకో గొప్ప అభిప్రాయం ఉందా?"

బజరోవ్ ఒకక్షణం ఆగాడు. "నా ఎదురుగా తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోగల మగవాడిని ఇంకొకడిని చూసిన తరవాత నన్ను గురించిన నా అభిప్రాయం మార్చుకుంటాను." ప్రతి అక్షరమూ ఒత్తి చెపుతూ అన్నాడు," అసహ్యమా? అవును. మా ఫిలిప్ కుటీరం పక్కనించి వస్తూన్నప్పుడు నువ్వు ఓ ముక్క అన్నావు— ఉన్నవాటిలోకి ఆ కుటీరం కాస్త శుభ్రంగా ఉంది — ప్రతి పేదరైతుకీ అల్లాటి ఇల్లు ఉన్నట్టయితే ఇంక రష్యా ఆదర్శంగా అయిపోతుందనీ, అందుకోసం మనమంతా శ్రమించాలనీ అన్నావు ఈ పేదరైతు ఫిలిప్ ని చూస్తే నాకు చెడ్డ అసహ్యం. వీళ్లకోసం నేను ప్రాణత్యాగానికి సిద్ధపడాలి. వాళ్లు ధన్యవాదాలన్నా అర్పించరు.. నాకసలు ఎందుకు అర్పించాలి? సరే పోనీ ఆ పేదరైతు పరిశుభ్రమయిన కుటీరంలోనే నివసిస్తున్నాడనుకో. ఆ శ్రమవల్ల నా శరీరం కాయలు కాసి పోయిందనుకో. నా కేమిటి అందువల్ల లాభం?"

"యెవ్ గనీ ఇంకచాలు ...... ఈ వేళ నీ ధోరణి ఎవరన్నా విన్నట్టయితే మనకి నీతినియమాలు లేవని దూషించేవారి మాటలు నిజమనుకుంటారు"

"మీ పెదనాన్నలాగే నువ్వూ మాట్లాడతావు. నీతినియమాలను నిర్ణయించే సామాన్య సూత్రాలు అసలు లేవు. ఆ మాత్రమన్నా నీ కర్థం కాలేదన్నమాట, కొన్ని అనుభవాలున్నాయి. అంతా వాటిమీదే ఆధారపడి ఉంటుంది."

"ఎల్లాగ?"

"ఎంచేతంటే, ఉదాహరణకి, నే ప్రతీదాన్నీ కాదంటాను, నా ఇంద్రియ సంచలనం అల్లా అనిపిస్తుంది, అన్నీ కాదనాలి— నా మెదడు ఆరకంగా పనిచేస్తుంది, అంతే. నాకు రసాయన శాస్త్రం అంటే ఎందుకు అభిమానం? నీకు రేగుపళ్లంటే ఎందుకు ఇష్టం?— మన ఇంద్రియ సంచలనాలను బట్టి. అందరు మానవులూ అంతే. అంతకంటే లోతుకి మనిషి వెళ్లలేడు. అందరూ ఒకరకంగా ఎప్పుడూ చెప్పరు, నిజానికి నేను ఇప్పుడన్నట్టు ఇంకోకప్పుడు అనను."

"అంతేనా? నిజాయితీకూడా ఇంద్రియ సంచలనమేనా?"

"అంతేనని నా అభిప్రాయం."

"యెవ్ గనీ!" ఆర్కాడీ నీరసమయిన గొంతుకతో ఏదో చెప్పబోయాడు.

"ఏం? ఎందుకూ? నే నన్నది నీకు రుచించలేదా?" బజరోవ్ అడ్డువచ్చి అన్నాడు. "లేదోయి తమ్ముడూ, అన్నిటినీ నరికి పారెయ్యాలని నిశ్చయించుకున్నప్పుడు, ఇంక నీ కాళ్లయినా అనుమానించకూడదు. వేదాంతం చాలా మాట్లాడాం. 'ప్రకృతి నిద్రలో మునిగి నిశ్శబ్దాన్ని ఊపిరిగా పీల్చుకుంటోం' దన్నాడు పుష్కిన్."

"పుష్కిన్ ఎప్పుడూ అల్లాంటిది అనలేదు," ఆర్కాడీ మందలిస్తూ అన్నాడు.

"సరేపోనీ, కవి గనక అల్లా అని ఉండవచ్చు — అసలు అని ఉండాలి. బహుశా అతను సైన్యంలో పని చేశాడేమో."

"పుష్కిన్ ఎన్నడూ సైన్యంలో పని చెయ్యలేదు."

"ఏమీ? ప్రతి పుటలోనూ 'రష్యా గౌరవం నిలపండి, కత్తులు చేత పట్టండి! అని రాశాడుగా."

"లేనిపోనివన్నీ ఎందుకల్లా కల్పిస్తావు? అది దౌర్జన్యం."

"దౌర్జన్యమా? ఎంతగొప్పసంగతి! నన్ను భయపెట్టడానికి ఎల్లాంటి మాట ఏరాడో? ఏ మనిషయినా సరే నవ్వు దూషించగలిగిన దానికంటే ఇరవయిరెట్లు దూషణకి అతను అర్హుడన్న సంగతి జ్ఞాపక ముంచుకో."

"మనమింక నిద్రపోతే మంచిది," ఆర్కాడీ గొంతుకలో చిరాకు ధ్వనించింది.

"చాలా సంతోషంగా" అన్నాడు బజరోవ్. కాని ఎవరికీ నిద్రపట్టలేదు. ఇద్దరు యువకులమధ్య ఏదో వ్యతిరేకభావం అంకురించింది. అయిదు నిమిషాలు గడిచిన తర్వాత కళ్లు విప్పి మౌనంగా ఒకరివేపు ఒకరు చూసుకున్నారు.

"చూడు!" అన్నాడు ఆర్కాడీ చటుకుని, "ఎండు మర్రిఆకు చెట్టునించి కిందికి రాలిపోతోంది. సరిగ్గా ఎగురుతున్న సీతాకోకచిలుక లాగ రాలుతోంది. చిత్రంగా లేదూ? జీర్ణత శైథిల్యం —జీవవిన్యాసాన్ని పోలిఉండడం"

"అబ్బ ! మిత్రమా ! ఆర్కాడీ నికొలెచ్ !" బజరోవ్ గట్టిగా అన్నాడు, "నిన్ను బతిమాలుకుంటాను, ఆ కవిత్వం మాట్లాడ్డం మానేద్దూ."

"నాకు చేతనయినట్టు నేను మాట్లాడుతాను ...ఈ నిర్బంధాన్ని నేను సహించను. ఏదో ఒక భావన నా మనస్సులోకి వచ్చింది. అది పైకి నేనెందుకు చెప్పకూడదు?"

"అవును. నా ఊహాలు నేనుమాత్రం ఎందుకు పైకి చెప్పకూడదు? కవిత్వం మాట్లాడ్డం చాలా అసభ్యమని నా అభిప్రాయం "

"అయితే సభ్యమయినది ఏ-? దూషణమా?"

"ఆహా! అర్థమవుతోంది. నీ పెదతండ్రి అడుగుజాడల్లో నడుచుకోవాలనుంది నీకు నిజంగా. ఈ నీమాటలు వింటే ఆ మహా అశక్తుడు ఎంత సంతోషిస్తాడో!"

"ఏమన్నావు పావెల్ పెట్రోవిచ్ ని?"

"సరిగా అనవలసినదే అన్నాను, అశక్తుడని."

"కాని ఇది అసహ్యంగా ఉంది," ఆర్కాడీ కోపంగా అన్నాడు.

"ఆహా రక్తసంబంధం," బజరోవ్ చల్లగా విమర్శించాడు, "మనుష్యుల్ని అది ఎంత గట్టిగా పట్టుకుంటుందో నేను గ్రహించాను. మనిషి అన్నిటినీ వదుల్చుకోగలడు, ఎన్ని తప్పు అభిప్రాయాలినయినా దిద్దుకోగినదు. కాని తన సోదరుడు ఒక రుమాలు కొంగలిస్తే వాడు దొంగ అనిమాత్రం ఒప్పుకోడు అదిమాత్రం చేతకాదు. ఆలోచించిచూస్తే మాతమ్ముడు, మావాడు — ప్రతిభావంతుడు కాడు......అల్లాంటి నిజాలు ఎవరికీ ఘటకపడవు."

"నన్ను మాట్లాడించింది మామూలుగా ఉండవలసిన న్యాయబుద్ధి వంశాభిమానం ఎంతమాత్రం కాదు," ఆర్కాడీ తీవ్రంగా ఎదురుకున్నాడు. "ఆ న్యాయబుద్ధి నీ కర్థం కాదు గనక, నీకు లేదు గనక, దాని విలువ నువ్వు ఎంచలేవు."

"ఇంకోలాగ చెప్పాలంటే ఆర్కాడీ కిర్సనోవ్ నా గ్రహణశక్తి కందని ఉదాత్తవ్యక్తి. అతని ముందు శిరస్సు వంచి ఇంక మౌనముద్ర వహిస్తాను."

"అబ్బ! చాల్లేవోయి యవ్ గనీ. చివరికి నిజంగా దెబ్బలాటలోకి దిగుతుంది."

"ఆర్కాడీ నామీద దయదలిచి, ఒక్కసారి నిజంగా దెబ్బలాడుకుందాం, రా!"

"కాని దాని పర్యవసానం......"

"కొట్టుకోడమా?" బజరోవ్ అన్నాడు. "అయితేకే? ఇక్కడ ఈ గడ్డిమీద, ఈ నిరుపహతి స్థలంలో, లోకాన్నించి, మానవ దృక్కుల నించీ దూరంగా ఉన్న ఇక్కడయితే ఏమీ పరవాలేదు. కాని నాకు ఉజ్జీ కావు నువ్వు. నిమిషంలో నీపీక నాచేతుల్లోకి దొరికిపోతుంది."

బజరోవ్ తన పొడుగుపాటి ఏతివేళ్ళు విప్పాడు, ఆ వేళ్లలో ఏదో క్రౌర్యం ఉంది.... ఆర్కాడీ వెనక్కితిరిగి వేళాకోళపు దెబ్బలాటకు సిద్ధపడుతున్నట్టు కానుకున్నాడు. కాని అతని స్నేహితుడి ముఖంలో తీవ్రమయిన కక్ష అతనికి కనిపించింది. అతని పెదవులమీద వంకరగా నిలిచిన చిరునవ్వులో ఏదో మెల్లని అపాయం గోచరించింది. చటుకుని అతనికి భయం వేసింది.

"ఆహా! ఇక్కడికా మీరు చేరుకున్నారు!" ఆ క్షణంలో వాసిలీఇవానోవిచ్ గొంతుక వినపడింది. ఆ ముసలి సైనిక వైద్యుడు యువకు లిద్దరి ముందూ ప్రత్యక్షమయాడు. చేత్తో కుట్టిన పొట్టికోటు తొడుక్కున్నాడు, గడ్డిటోపీ పెట్టుకున్నాడు— అదీ చేత్తో చేసినదే. "మీకోసం చాలాచోట్లు వెతికాను ... మంచిచోటే ఏరుకున్నారు. చాలా చక్కగా కాలం గడుపుతున్నారుకూడా. 'భూమిమీద పడుకుని స్వర్గంవేపు చూస్తూ' అందులో విశేషం ఉంది తెలుసా?"

"నే నెప్పుడూ స్వర్గంవేపు చూడను, తుమ్ము వచ్చినప్పుడు తప్ప," బజరోవ్ కోపంగా అన్నాడు. "అనవసరంగా అడ్డు వచ్చాడు."

"మీలాంటి యువకులను చూసినప్పుడు" వాసిలీ ఇవానోవిచ్ ఇలాగా అంటున్నాడు, "నాకు మనస్సులో ఎంతో నిండుగా ఉంటుంది. మీకు శక్తిసామర్థ్యాలున్నాయి, యౌవనము లావణ్యం ఉంది, తెలివితేటలున్నాయి, రకరకాల ప్రజ్ఞలున్నాయి. మీ ఇద్దరూ సాక్షాత్తు కాస్టర్, పోలక్స్లాగ ఉన్నారు."

"చాల్లే నడద్దూ — నీ పురాణగాథలూ నువ్వూ!" అన్నాడు బజరోవ్. "అతని రోజుల్లో మా నాన్న ఒక పెద్ద లాటిన్ పండితుడు. ఎందుకూ! లాటిన్ గద్యరచనలో ఏదో బహుమతికూడా సంపాదించాడు, వెండి పతకం."

"దాని పేరు డయస్కూరీ" వాసిలీఇవానోవిచ్ అన్నాడు.

"చాల్లే ఊరుకో, ప్రదర్శనం కూడదు."

"అప్పుడప్పుడయినా చెప్పకో కూడదా?" ముసలివాసిలీ ఇవానోవిచ్ మెల్లగా అన్నాడు. "అయినా మిమ్మల్ని అభినందించడానికి కాదు నేను మిమ్మల్ని వెతుకుతున్నది. త్వరలోనే భోజనాలకు తయారుకావచ్చునని చెప్పడంకోసం వెతుకుతున్నాను. తరువాత యెవ్ గనీ, ఒక సంగతి నీతో ముందే చెపుదామని అనుకున్నాను. ...నువ్వు కాస్త సబబయిన మనిషివే. నువ్వు లోకాన్ని చూశావు, ఆడవాళ్ళు ఎల్లాంటి వాళ్లో నీకు తెలుసును. అంచేత నువ్వు కాస్త మన్నించాలి...మీ అమ్మ నువ్వు ఇంటికి తిరిగివచ్చిన సందర్భంలో కాస్త మంగళాశీర్వచనాలు పాడించాలని అనుకొంటోంది. అది జరుగుతున్నంతసేపు నువ్విక్కడ ఉండాలని నేను అనడంలేదు. కాని ఫాదర్ అలెక్సీ..."

"ఈ ఊరి మత ప్రవక్తా?"

"అవునవును; అతనే... అతను... మనతో ఈవేళ భోజనంచేస్తాడు. ఇదంతా నేను అనుకోలేదు. నాకసలు ఇష్టంలేదుకూడా. కాని అంతా నిశ్చయమయిపోయింది ... నా అభిప్రాయం ఇంకోలాగ అర్థం చేసుకున్నాడతను...తరువాత ఎరుగుదువుగా ... ఆరినా వాసీవ్నా ... అదీగాక అతను చాలా సభ్యమయిన మనిషి, మంచివాడు."

"నా భాగం కూడా అతను తినివెయ్యడనుకుంటాను?" బజరోవ్ అడిగాడు.

వాసిలీఇవానోవిచ్ నవ్వాడు. "ఏంమాటలవి"

"సరి. అదే నేను కోరేది. ఏమనిషితోనయినా సరే, పక్కని కూర్చుని భోజనం చెయ్యడానికి నాకు అభ్యంతరం లేదు."

వాసిలీ ఇవానోవిచ్ తన టోపీ సరిగా సద్దుకున్నాడు. "నీతో చెప్పకముందే నాకు తెలుసును, నీకు ఇల్లాంటి చిన్నచిన్న అభ్యం

(22 వ పేజీ చూడుడు)

బాలానందం

(15వ పేజీ తరువాయి)

కన్నా తొందరగా తిరిగితే ఏం లాభం ఉంటుంది? ఏం లాభం ఉండదు— రాత్రిళ్ళు పగళ్ళూ ఎల్లా మారి పోతాయో కాస్త ఆలోచించాము—ఎందుకూ, భూమి తన అక్షంచుట్టూ తానొకసారి తిరిగేందుకు ఇరవై నాలుగుగంటలు పడుతుంది—

"శిక్ష లంటుం దేమిటి? తల కొట్టేయ్ ముందు" అంది జమీందారిణి.

వంటలక్క అంతపనీ చేస్తుందేమో నని పాప ముందు బెదురుగా చూసింది. కాని వంటలక్క మళ్ళీ పులుసు కలియ పెడుతూ తన పనిలో తాను మునిగి పోయి, విననట్టే ఉంది. పాపకు 'ఉత్తుత్తదే'—అని ధైర్యం వచ్చి మళ్ళీ మాటలు సాగిస్తూంది.

"ఇరవైనాలుగు గంటలే అనుకొంటాను—ఇరవైనాలుగా— లేక ఓ వేళ పన్నెండా—నా ఊహ—"

"వెధవ అంకెలు—అంకెలు చెప్పి విసిగించకు నాకు తలనొప్పి—అంటూ జమీందారిణి పిల్లను జోలపాడటం మొదలు పెట్టింది.

"ఉళుదుళుదుళు హాయీ
అబ్బి వీపూ పగలవేయీ
తుమ్మితే ముక్కూడదీయీ
ఉళుదుళుదుళు హాయీ
ఏడ్పుకే పుట్టాడు వేడుప్రల వెధవ
కావాల్సెవిసిగించ'కయ్యో'మంటాడు
ఉళుదుళుదుళు హాయీ
అబ్బాయి వీపు పగలవేయీ—

అంటూ జోలపాడింది. ప్రతిచరణం చివరా, పసిపిల్లా, వంటలక్కాకూడా, "ఈ, ఈ!" అని గట్టిగా అనుపల్లవి అందుకొనేవాళ్ళు. ప్రతిచరణం అయి పోగానే, పిల్లడిని గట్టిగా కుదుపుతూ, ఒక ఎగురు ఎగ రేసేది—పిల్ల ఏడుపులో, చరణాలమాటలుకూడా పాపకు సరిగ్గా వినబడేవికావు—

"తుమ్మినప్డూ ముక్కుతుంచేసి వేస్తే
కోరు కలవాటాతు కోలుకొంటాడు
ఏడ్చినప్డూ వెధవ వీపు పగలేస్తే
ఏడ్పుగొట్టూ వెధవ విరగడౌతాడూ
ఉళుదుళుదుళూ ఆయీ
యీ ! యీ ! యీ !"

జమీందారిణి పాట చటుక్కున ఆపి, పసిపిల్లను హఠాత్తుగా పాపమీదకు విసిరేస్తూ "కాసేపు నువ్వాడించు పిల్లడిని" అంటూ హడావిడిగా గదిబైటికి నడిచింది. వంటలక్క ఒక అట్లపెనం జమీందారిణి మీదకు విసిరేసిందిగాని! తలుపుదగ్గిర కాస్తలో తప్పించుకొని జమీందారిణి బైటికి పోయింది.

పాప కంగారుగా చేతులు చాచి అందుకొంటూ పిల్లడిని పట్టుకో బోయింది.

—

దాంపత్యం

(11-వ పేజీ తరువాయి)

తర్వాత త్వరలో పంపవలసిందనీ, ఇక్కడ కూడా కావాలి అంటే మంచి వైద్యు లున్నారనీ వ్రాశాడు. ఇంకా నెమ్మదించలేదనీ, తగ్గిం తర్వాత అలానే పంపుతామనీ ప్రత్యుత్తర మొచ్చింది.

కాలం మటుకు అట్లాగే గడిచిపోతూంది; కాని లక్ష్మీదేవి కారోగ్యం చక్కబడలేదు; అదేంజబ్బో, అదేం వైద్యమో!

ఊళ్లో అంతా పుకారు బయలుదేరింది. 'మరే ఇంకేం వస్తుంది అంతగా ఏడిపిస్తే ఎవరుంటారు? ఎంత కోడంటికమైతే మటుకు ఒక హద్దుండాలి! ఓర్చుకున్నన్నాళ్లు ఓర్చుకొని, శేషమ్మగారి తిక్క తిమ్మిరీ కుదిరేటట్టు వాతపెట్టింది!' అని అనుకొంటున్నారు—ఊరబావుల దగ్గిరా, మంచినీళ్ల చెరువుగట్టునా, ఊళ్లోని అమ్మలక్కలు. అన్నగా ఆ రెండుమాటలు శేషమ్మ చెవుల్లోకి దూరాయి. రౌద్రాకారంతో అపర కాళికావతార మెత్తినట్టు ఇల్లంతా ఎత్తిపోయేటట్టు ఆనాడు మొగుణ్ణి, కొడుకునూ, చీవాట్లు వేసింది. 'అంత చేతకానివాడివి, పెళ్లాన్ని అదుపులో పెట్టుకోలేని వాడివి, పెళ్లెందుకు చేసికొన్నావురా, అడంగివాడా' అంది రామశాస్త్రిని. 'జుట్టుపట్టి లాక్కురాక, రింగు రింగున అంతదూరం పోయి చేతులు పిసుక్కుంటూ వచ్చాడు పెద్దమనిషి! సింగన్న అద్దంకి పోనూ పోయినాడు, రానూ వచ్చాడట!' అని మొగణ్ణి మందలించింది. 'పాడ్యేది పోతూ ఏ పాప మెఱుగని తనమీద ఎందుకూ నింద మోపటం? కోడలిలా ఒక్క దినమైనా చూచిందా' అంటూ తన్ను నిందించికొంటూ కంట తడిపెట్టుకుంది. ఎన్నెన్నో......ఏమే మిటో......!

ఎలాగైనా పెళ్లాన్ని పిల్చుకు రమ్మని తతిమింది రామశాస్త్రిని నెత్తిని చెంగు వేసికొని 'పోలో' అని పోయినాడు మైసూరుకు......

అల్లుడు వచ్చాడని ఆదరించి గౌరవించారు. కుశల ప్రశ్నల్తో అభ్యంజనాలతో, పిండివంటలతో అల్లెం పెట్టారు. మూడురోజులు ముచ్చటదీఱ అత్తింట ఆనందసౌఖ్యాలు అనుభవించిన తర్వాత పెళ్లాన్ని పంపమన్నాడు అల్లుడు. 'ఏం, అప్పుడే వెళ్లాలా? ఒక పదిరోజులైనా మా యింట్లో ఉండగూడదా?' అంది అత్తగారు ఉండేందుకేం గాని, ఇంటిదగ్గఱ పను లున్నాయనీ, తల్లికి తోడుగా ప్రస్తుత మెవరూ లేరనీ, అంచేత పంపాలనీ చెప్పాడు అల్లుడు రామశాస్త్రి. 'మరో పదిరోజులైనా మీ పెళ్లాం సుఖంగా ఉంటం మీ కిష్టం లేదా?' అంది సీతాబాయమ్మ హాస్యధోరణిలో పరిహాసం చేస్తూ 'లక్ష్మి నెందు కనుకున్నావ్ మా బావ కిచ్చింది? వాళ్లింట్లో పనిచేసేందుకు కాదా యేమిటి?' అంది వదిన వ్యంగ్యంగా.

'ప్రతివాడు కష్టపడాలి ... కష్టపడంది జీవనమే లేదు అది ప్రకృతిధర్మం' తన్ను తాను తమాయించుకొంటూ వేదాంతం ఒప్ప చెప్పాడు.

'అధర్మం మా లక్ష్మికేనా, మీయింట్లో అందటికీ నా?' కొంచెం కోపంగాడ అప్రశ్నతో సూచితమైంది. వెంటనే మామగారు అందుకుంటూ 'అమాత్రం కోడంటికం చేయించుకోకుంటే ఎట్లా, కోడలంటే బానిస అనే కదా అర్థం?' అన్నాడు.

మొత్తంమీద ఆ నాటి ప్రసంగమే మంత ప్రసన్నంగా లేదు. అలుడనే గౌరవాన్ని కూడా విస్మరించినట్లున్నారు. రామశాస్త్రికి తలకాయ బరువెక్కింది. మెదడ్లో తుఫాను రేగింది. మాటాట్టమే క్రొత్తగా తోచింది. 'ఇంతకూ మీయిష్టమేమిటి?' అన్నాడు విసుగుతో.

'అక్కా బావా వేరేగా ఉంటారు లేవే అమ్మా' అంది లక్ష్మీదేవిచెల్లెలు.

'బాబోయ్ వేరేనా? ఆ మాటంటే మా అత్తయ్య పీకి పాకాన పెట్టుంది!... మా బావ వేదకాలంనాటి కొడుకు!' అంది రామశాస్త్రి పెళ్లాం అక్కగారు. హాస్యాని కాలా అనిన మాటలే అత్తమామలు ధృవపరిచారు. తాను వేఱే కాపురం పెట్టకుంటే కూతుర్ని పంపేది లే దన్నట్లే తేల్చారు!

౪

మైసూరికి పోయిన రామశాస్త్రి తిరిగి వచ్చాడు. తల్లీ దండ్రీ రోజుల పర్యంతం దీర్ఘంగా ఆలోచించారు. కాని సమస్య పరిష్కరింప బడలేదు. చివరికి రామశాస్త్రికి పునర్వివాహం చేస్తామని నిశ్చయించారు! ఆ విషయమై, 'పంపదలచితే ఓ పక్షం రోజుల్లో కోడల్ని పంపాలనీ, లేకుంటే మళ్లీ పెళ్లి చేసేది ఖాయమనీ' మైసూరు వ్రాశారు. కాని మైసూరునుంచి జాబూ లేదు; జవాబూ లేదు. రామశాస్త్రికి మళ్లీ పెళ్లిమీద మనసు పోవటంలేదు. ఎలా పోతుంది? ఎంత అవివేకంగా, చాకలివాడికి తెలివిని చలువకు వేసి ప్రవర్తించినా పెళ్లాము పెళ్లామే! అనుభవము అనుభవమే, దాంపత్యం, దాంపత్యమే! మాట పట్టింపుల వల్ల, అభిప్రాయభేదాలవల్ల ప్రస్తుతానికి తాత్కాలికంగా ఓ రెండు వసంతాల పాటు ఎడబాటు సంభవిస్తే సంభవించవచ్చు. కాని ఇంతకాలమూ ఏకంగా జీవించిన భార్యను విడచి తిరిగి ఇంకొకర్తెతో తనేలా కులకటం?...... ఒక వేళ ......తను చేసికొన్నాటే లక్ష్మీకూడా మళ్లీ పెళ్లిచేసికుంటుం దేమో! ఛా! ఎంత చిన్నతనం! ఫలాని రామశాస్త్రి పెళ్లాం మొగుడు బ్రతికుండగానే రెండో పెళ్లి చేసుకుందంటే! వదలిపెట్టినందుకే తనకు తలగొట్టినట్లుంది. ఇంక ఆ కొలవ కూడానా, భగవానుడా!

అయితే రామశాస్త్రి అమ్మా నాయనచేతి ఆటబొమ్మ అతను ఒక్కడేనా యేం? ఈ విశాలప్రపంచంలో సగబ్బద్ధి కల్గి వినయ సంపదలు కల్గి మంచివాడు అనిపించుకో గోరే వాళ్లంతా పెద్దవాళ్ల చేతి కీలుబొమ్మలే. వాళ్లకి వ్యక్తిత్వ ముండకూడదు; వాళ్లు పెద్దల భావాల కనుగుణంగా నడిచే యంత్రాలు కావాలి! లేకుంటే లోకం దృష్టిలో చెడ్డవాళ్లు.

రామశాస్త్రి మంచివాడనిపించుకున్నాడు. ఆ గౌరవాన్ని ఎలా వదులుకోగలడు? పైగా పిత్రాజ్ఞ దాటటమంటే సామాన్యమా? భయానకం! ...... పెళ్లి నిశ్చయమైంది. ఇదుగో రేపు శ్రావణ శు. 10 లక్ష్మీవారం నాడే సుముహూర్తం. అన్నీ సిద్ధమౌతున్నాయ్, పెళ్లి కావటమే ఆలస్యం!

బాజాబజంత్రీలు 'జై' మని మ్రోగుతున్నాయ్, పచ్చని మామిడాకు తోరణాలు కళ్లపండుగ చేస్తున్నాయ్. సర్వాలంకారాల్తో పడుచు ముత్తైదులు కందు 'జిల్ జిల్' మనేటట్లు సింగారించుక తిరుగుతున్నారు. పురోహితుడు వసిష్ఠస్థానంలో పెద్ద పీఠం మీద కూర్చొని వేదమంత్రాలు పఠిస్తున్నాడు. వరుడు అగ్ని కార్యాదికృత్యాలు నెఱవేర్చుకున్నాడు. వధువును తీసుకురమ్మని వసిష్ఠుల వారి ఆజ్ఞ అయింది. గంపలో పెట్టుకొని వధువును తెస్తారు! అందఱూ ఆ వేపే చూస్తున్నారు. ఇంతలో 'లక్ష్మీదేవి నాన్న సుబ్బరావు' వచ్చాడు' అంటూ కోలాహలం బయలుదేఱింది! మిన్ను విఱిగి మీద పడింది. అంతే ఇంక పెండ్లికి 'ఫుల్‌స్టాప్'!

ఇప్పుడు లక్ష్మీదేవికి మఱి యిద్దరు ఆడపిల్లలు, ఇద్దఱు మగపిల్లలు. లక్ష్మీదేవంటే రామశాస్త్రికి తగని ప్రేమ. ఆమె మాటంటే వేదవాక్యం!

విప్పన్న చెప్పినది వేదం! లక్ష్మీదేవికూడా భర్తంటే భక్తి. గౌరవమూ. అందఱూ వాళ్లది అనుకూలదాంపత్యమని చెప్పుకొని ఆనందిస్తారు. పాపం, వాళ్లకి లక్ష్మీదేవి రెండేళ్లపైగా అత్తింటి క్కెళ్లలేదనిగాని, రామశాస్త్రితో కాపురము చేయటానికి నిరాకరించిందనిగాని తెలీదేమో! తెలిసినా ఆమెది తప్పుగాదని ఒప్పుకో గల్గిన విశాలహృదయులేమో!

పాన్నేరిలో ఆంధ్రులు

(౮-వ పేజీ తరువాయి)

మున్నగు మాటల నుపయోగింతురు. ఈమాటలు ఈ తర జిల్లాల తెలుగువారికి అసహ్యకరములుగా తోచునేమో! కాని యివి మన ప్రాచీన తెనుగుభాషలోని మాటలు. కనుక వీరిలో ప్రాచీనాంధ్రత్వం యింకను వున్నది. కనుక భాషను బట్టి కూడ వీరు తెలుగువారే. ఈనాడు 'మేమే ఆంధ్రుల మని' సంతసించి గర్వించుచుండెడి వారిలోనే భాషాదోషము లున్నప్పుడు యిక వీరిలో నుండుట ఆశ్చర్యము కాదు. వీరిది అపభ్రంశపు భాషయని పరిహసించుటకంటె యీ ప్రాంతమునందు విద్యాప్రచారము చేయుట శ్రేయస్కరము.

పాన్నేరి తాలూకా కంతటికి ఒకే ఒక హైస్కూలు కలదు. ఇకమీదట సత్యవేడు, ఆరణి మున్నగు గ్రామము లందున్నత పాఠశాలలు స్థాపించుటకు చెంగల్పట్టుజిల్లా బోర్డువారు ప్రయత్నించుచున్నారు. వారికి ధన్యవాదములు. మొత్తముమీద యీ తాలూకాలో విద్యాసౌకర్యములు తక్కువ. ఇక్కడ తెలుగునకు ప్రోత్సాహము లేని కారణము వల్లనో లేక మరి యే యితర కారణము వల్లనో కాని కొంతమంది తెనగువారు తెలుగును విడిచి తమిళము నభ్యసించుచున్నారు. తెలుగును మరచిపోవుచున్నారు. ఇది మన గ్రహచారము. మన దురదృష్టము. ఇంకొక విచిత్రము కూడ కలదు. తమిళులకు గృహనామము లుండవు. తండ్రిపేరునో లేక వారు పుట్టిన గ్రామము పేరునో తమ నామధేయముల ముందర జేర్చుకుందురు. ఈ ఆచారమునే మన తెలుగువారిలో కొందరుగూడ్ర మవలంబించుచున్నారు. ఇది విచారింపదగిన సంగతి.

ఇంక రెండు మూడు మాటలతో యీ వ్యాసమును ముగించెదను. వేష భాషల పురస్కరించుకొని చెంగల్పట్టుజిల్లా ఆంధ్రులను హేళన చేయుట మనము మానుకోవాలి. విశాల హృదయముతో వారి అభ్యుదయముకొరకు పాటుపడవలసిన బాధ్యత మనపైన వున్నది. మన నాయకులు యీ ప్రాంతమునందు పర్యటన చేసి వీరిని గూర్చి తెలిసికొనుటకు ప్రయత్నింపవలయును. చెంగల్పట్టు జిల్లాబోర్డువారు తెలుగు గ్రామములందు పాఠశాలలు స్థాపించి వీరి అభివృద్ధికి కృషి చేసెద రని ఆశించుచున్నాను ముఖ్యముగా, మనపెద్దలు, దక్షిణ భారతహిందీ ప్రచార సభవలె, ఒక సంస్థను స్థాపించి యీ ప్రాంతము నందు తెలుగు భాషా వ్యాప్తికై పాటుబడవలయును. ఇది చాలా ముఖ్యమయిన విషయము. ఇటువంటిసంస్థ యొకటి యేర్పడి భాషాసేవ చేసినచో, తప్పక యీ ప్రాంతము అభ్యుదయము చెందును.

ఆసియా దూరప్రాచ్య ఆర్థిక సంఘం

(17 వ పేజీ తరువాయి)

ఆసియా, దూరప్రాచ్యరాజ్యము లన్నింటి లోను వరదల బాధ మెండు. వరదలవలన ప్రతి సంవత్సరము ప్రతిదేశములోను అధిక పంట నష్టమేగాక జననష్టము, ఆస్తినష్టము కూడ సంభవించుచున్నది. వరదల నరికట్టు విషయము ఈ సమావేశములో చర్చకు వచ్చినది. వరదల నివారణాపద్ధతులను వివిధదేశములలోను గమనించి, ఆలోచించి, సూచనలు చేయుటకు ఒక సంఘమును నియమింపవలెనను తీర్మానముపై చర్చలు జరిగెను. ఇందుకొరకు క్రొత్తగా ఒక సంఘము నియమింపబడ నక్కరలేదనియు, ఇప్పుడాయా దేశములలో నున్న నిపుణులు అప్పుడప్పుడు కలసికొనుచు, తమ తమ భావముల నెరుగజెప్పుకొన్న చాలుననీ కొందరు అభిప్రాయపడిరి. ఈ రెండువిధములుగాక, ఆసియా దూరప్రాచ్య రాజ్యాల ఆర్థిక సంఘము వరదల నివారణవిషయమై వివిధదేశములనుండి వివరములు సేకరించి, అన్నిరాజ్యములకు తెలుపుచుండిన చాలునని కొందరు అభిప్రాయపడిరి. వరదబాధ నివారణసంఘము నొకదానిని ఏర్పరచుటకే చివరకు తీర్మానింపబడినది

ఆసియారాజ్యము లన్నింటిలోను ఆహార సమస్య ఏదో ఒక విధముగ తల సూపుచునే యున్నది. ఈ రాజ్యములలో వ్యవసాయము పూర్వకాలపు పద్ధతులపైననే జరుగుచున్నది. వ్యవసాయపద్ధతులను పూర్తిగా సంస్కరించినచో, ఈ ప్రాంతములకు కావలసిన ఆహార పదార్థమేగాక ఇతర ముడివస్తువులు కూడ చాల ఎక్కువగా ఉత్పత్తియగును. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయసంఘము ఈ విషయమున కొంతవరకు తోడ్పడగలదు. కావున ఆసియా, దూరప్రాచ్య ఆర్థికసంఘ ప్రతినిధులు, ఆహార వ్యవసాయసంఘ ప్రతినిధులు ఒక సంయుక్త సంఘముగా నేర్పడి, ఆసియారాజ్యాల అవసరములు, ఉత్పత్తి అవకాశములు పరిశీలించి, వివిధరాజ్యములకు సిఫార్సులు చేయవలెనని భారతప్రతినిధివర్గ మొక తీర్మానమును ప్రవేశ పెట్టెను. రెండు అంతర్జాతీయ సంస్థలు కలిసి ఒక సంయుక్తసంఘము నేర్పరచుట అశాస్త్రీయమని రష్యన్ ప్రతినిధి ప్రతిఘటించెను. కాని భారతప్రతినిధి తీర్మానము అనేక సవరణలతో అంగీకరింపబడెను.

వ్యావసాయిక వస్తువుల ధరలనుగూర్చి కూడ ఈ సమావేశములో ప్రస్తావింపబడెను. కేవలము ఆహారపదార్థముల ధరలనే నిర్ణయింపరాదనీ, వ్యావసాయికవస్తువులన్నిటి ధరలు నిర్ణయింపబడవలెననీ బర్మా, సయాం మొదలగు ఆహార పదార్థములను ఎగుమతిచేయు దేశములు పట్టు బట్టినవి. వాటి ఇష్టప్రకారము అట్టి తీర్మానమే అంగీకరింపబడినది

ఆసియా, దూరప్రాచ్యరాజ్యముల పరస్పర వాణిజ్యాభివృద్ధికి గల అవకాశములు ఈ సమావేశములో చర్చింపబడెను. ఈ దేశములు ఇప్పుడు కూడ ఒక దానితో నొకటి వాణిజ్యసంబంధములు కలిగియున్నవి. కాని ఇప్పటికన్న ఎక్కువ వాణిజ్యము ఈ దేశములు తమలో తాము జరుపుకున్నచో, పాశ్చాత్యరాజ్యములపై ఆధారపడ నవసరములేకుండ పోయి, అనేక యిబ్బందులు తగ్గును. వీనిలో ఏ యే దేశములలో ఏ యే వస్తువులు, ఎట్టి ధరలకు దొరకునో వివరములు సేకరించి, ఇతరదేశములకు అందజేసినచో ఇప్పటికన్న ఎక్కువ వర్తకము జరుగగల అవకాశము కలదు. ఆసియా దూరప్రాచ్య ఆర్థిక సంఘ సిబ్బందిలో కొంతమంది వాణిజ్య నిపుణులను నియమించి, ఈ పని చేయించవలెనని ఈ సమావేశములో తీర్మానింపబడినది.

ఆసియారాజ్యముల రవాణా సౌకర్యముల పరిస్థితిపై ఈ సమావేశములో చర్చలు జరిగెను. ఆసియా రాజ్యముల రవాణా ప్రతినిధు లందరు సమావేశమై, తమ ప్రాంతములో రవాణా సౌకర్యముల అభివృద్ధిని గురించి ఆలోచింపవలెనని భారతప్రతినిధి ఒక తీర్మానమును ప్రతిపాదించెను. రవాణా సౌకర్యము లభివృద్ధి ప్రాంతీయముగా గాక, ఏదేశమున కాదేశపు అవసరములనుబట్టియే జరుగవలెనని మలయా మొదలగు దేశముల ప్రతినిధులు సూచించిరి. చివరకు భారతప్రతినిధి తీర్మానమే నెగ్గినది.

జపాన్ పారిశ్రామికాభివృద్ధి ఎంతవరకు జరుగనివ్వవలెనను ప్రశ్ననుగూర్చి ఈ సమావేశములో చర్చలు జరిగెను. జపాన్ ఆర్థికవ్యవస్థ తిరిగి కోలుకొనవలెననియే అందరు భావించుచున్నారు. కాని ఇదివరకువలె ఇతర దేశములపై దురాక్రమణ జరుపుటకు సహాయపడగలంతగా జపాన్ ఆర్థికవ్యవస్థ వృద్ధిపొందనీయరాదనియే అందరి అభిప్రాయము. జపాన్ తన కాళ్లపై తాను నిలుబడగల్గుటకు అవసరమగునంత స్థాయికి పారిశ్రామికాభివృద్ధి జరుగనివ్వవలెను. జపాన్ పారిశ్రామికశక్తిని సంపూర్తిగా కోలుకొననిచ్చి, జపాన్‌నుండి ఇతర ఆసియా దేశములకు యంత్రసామగ్రి, నిపుణులను తెచ్చుకొనవలెనని కొందరు అభిప్రాయపడిరి. కాని అది సరియైన విధానము కాదు. జపాన్‌లో పరిశ్రమ లన్నియు ఇప్పుడు నాశనమై వున్నవి. వానిని పునరుద్ధరించుటకు యంత్రసామగ్రి ఇతర దేశములనుండి రావలెను. అట్లు జపాన్‌కు యంత్రసామగ్రి సరఫరాచేయుటకు బదులు అది ఇతర దేశములకే నేరుగా సరఫరా చేయవచ్చునుకదా జపాన్ శాంతిసంధి విషయము ఏమీ తేలలేదు. పైగా జపాన్‌ను గురించిన అన్నివిషయములు దూరప్రాచ్యసంఘము చర్చించవలెను కాబట్టి జపాన్ విషయమై ఈ సమావేశము ఎట్టి నిర్ణయము చేయుటకు వీలులేక పోయినది.

అధికార, అనధికారసంస్థలతో ఆసియా దూరప్రాచ్యసంఘ సంబంధములను గూర్చికూడ ఈ సమావేశములో చర్చలు జరిగెను. తన కార్యనిర్వహణకు తోడ్పడు ఎట్టి అధికార, అనధికార సంస్థతోనైనను ఈ సంఘము సహకార సంబంధము లేర్పరచుకొనవచ్చునని కొందరు వాదించిరి. ముఖ్యముగా సింగపూర్‌లోని బ్రిటిష్ హైకమీషనర్ చే నియమింపబడిన ఆర్థిక సంఘముతో తన కృషిని సమన్వయపరచుకొని ఈ సంఘము పనిచేయవచ్చునని బ్రిటిష్ ప్రతినిధులు వాదించిరి. కాని బ్రిటిష్‌వారు చేయునదంతయు తమ ప్రయోజనమును దృష్టిలో నిడుకొని జేతురు. వారు సేకరించు వివరములుకూడ అందుకు తగినట్లే యుండును. అందువలన, ఆ సంస్థనుండి సేకరించిన వివరములను యథార్థముగా అంగీకరింపరాదు. ఈ విషయమై రష్యన్ ప్రతినిధి చెప్పిన అభ్యంతరము త్రోసిపుచ్చబడినను దానిలో కొంతవరకు సత్యము లేకపోలేదు.

మొత్తముమీద ఆసియా దూరప్రాచ్య ఆర్థిక సంఘము ఊటకమండల సమావేశములో ఆశించినంతగా కృషి చేయక పోయినను, ఇదివరకటి సమావేశములకన్న ఈ సమావేశము చాల ఫలప్రదమైన దనుట నిస్సందేహము.

భారతరాజకీయాలు

(9 వ పేజీ తరువాయి)

గుర్తించినవారెవ్వరు ఇట్టి అవకాశము లేదనరు. కాబట్టి భారతసైనికులు, పోలీసులు ఒకవంక నిజాం సైనికులను, పోలీసులను, రజాకార్లను ప్రతిఘటించుటకు, వేరొకవంక మతకలహము నడచుటకు తగినంత బలముగా ఇక్కడ సమీకరింపబడవలెను. ఇండో-పాకిస్థాన్ సంబంధములు నిజాం సమస్యమూలమున కొంతవరకు చెడిపోవచ్చును ఒకవేళ పాకిస్థాన్ సహాయముతో నిజాం ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసినను చేయవచ్చును. కాని ఐక్యరాజ్యసమితి ఈ విషయమై జోక్యము కలిగించుకొనని రాకరించును. ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు జరిగినచో బ్రిటన్ తన చిత్తశుద్ధిని ప్రదర్శించి, సంస్థానములన్నీ ఏదోఒక అధినివేశములో చేరిపోవలసినదేగాని సర్వస్వతంత్రత ప్రకటించుకొనరాదనియే తన అభిప్రాయమైనట్లు ప్రకటింపవలసియుండును.

మొత్తముమీద నిజాంసమస్య శాంతియుతముగా పరిష్కారము కాదని తేలిపోయినది. ఇక ముందు ఎవరు, ఏ చర్యతో కార్యక్రమము నారంభింతురో చూడవలసియున్నది.

కీ॥ శే॥ దుగ్గిరాల సూర్యప్రకాశరావు

శ్రీ దుగ్గిరాల వెంకట సూర్యప్రకాశరావుగారు 1887 సం॥రంలో జన్మించిరి. 1885 సం॥రంలో బి. ఏ. ప్యాసయి 1887 సం॥రం ఆ ప్రాంతముల కాకినాడ కష్టమ్సు ఆఫీసులో వుద్యోగమునందు ప్రవేశించి దరిమిలాను కొంతకాలమువరకు కలెక్టరు కచ్చేరీలో సుమాస్తాగా ప్రవేశించి, హుజూరు ట్రెజరీ హెడ్డు అక్కౌంటెంటుగా పనిచేసి పెన్షను గైకొని, పురపాలక సంఘములోను, ఇతర పబ్లికు సంస్థలలోను సభ్యుడుగా చాలాకాలము పనిచేసి ప్రజాసేవ చేసినారు. గోదావరిజిల్లా సంఘమునకు చాలాకాలము కార్యదర్శిగా వుండి గోదావరిజిల్లా రైతాంగమునకు, నీటిపారుదల వగైరాలలో చేసిన వుపకారము మరువరానిదై వున్నది. శ్రీ పోలవరం జమీందారుగారి తాలూకు సుమారు మూడు నాలుగు వేల రూపాయీల కిమ్మతుగల, గ్రంథ సముదాయమును, బీరువాల సహా శ్రీ జమీందారువారి అవసాన కాలమందు జిల్లా సంఘమునకు, విరాళముగా యిప్పించిన ప్రోత్సాహకర్త. వీరు గవర్నమెంటు వుద్యోగములో వుండిన్నీ సుమారు పాతిక, ముప్పది సంవత్సరములు, ప్రతి సంవత్సరము, కాంగ్రెసుకు ప్రేక్షకుడుగా వెళ్ళుచుండెడివారు. కీర్తిశేషులైన, మదన మోహన మాలవ్యా, బాలగంగాధర తిలకు, సురేంద్రనాథ బెనర్జీ, మొదలగు దేశీయ నాయకుల మైత్రి సంపాదించినారు. వీరేశలింగం పంతులుగారి వితంతువివాహ సంఘమునకు ప్రోత్సాహకర్త. ఈయన తన వుద్యోగమును చేయుచు, అధికార్ల అనుమతిపైన పురపాలక సంఘములో సభ్యుడుగా వుండి చేసిన ప్రజాసేవ కీర్తింపతగ్గది. ఒకదఫా ఉపాధ్యక్షపదవినిపొంది, అధ్యక్షునకున్ను, పురపాలకసంఘ వుద్యోగులకున్ను వారి వుద్యోగవిధులయందు సహాయభూతులై వారి మన్ననలకు పాత్రుడై మెప్పొందినాడు. యీయనకు దృష్టిమాంద్యము సంభవించు వరకు అనగా రెండు సంవత్సరముల క్రితంవరకు రైతాంగమునకు కావలసినట్టి సదుపాయముల విషయంలో P. W. D. వారితోను, రివిన్యూ వారితోను వుత్తరప్రత్యుత్తరములు జరుపుచు ప్రజాసేవ చేయుచుండెడివారు. అట్టి ప్రకాశరావుగారు తమ 84 వ యేట ది 2-6-1948 తేదీ రాత్రి 12 ఘంటలకు దివంగతులైరి.

వల్లూరి సీతారామమూర్తి.

తిరుత్తనితాలూకాలో సహకార పద్ధతులతో వ్యవసాయ కేంద్రము

చెన్నరాజధాని ప్రొహిబిషన్ డెప్యూటి కమిషనరు శ్రీ పళనియప్పమొదలి, చిత్తూరు జిల్లా స్పెషల్ డెవలప్‌మెంటు ఆఫీసరు శ్రీ రఘునాథ రావు, వెటర్నరి ఆఫీసరు శ్రీ టి యల్. అనంత రామన్ మున్నగువారు నిన్నటిదినమీయూరి నుండి మాంబాకం గ్రామమునకు వెళ్లి, అచట నున్న పోరంబోకు భూములను తనిఖీజేసిరి. ఆ భూములలో ప్రస్తుతం 58 ఎకరముల మాగాణి భూమిని గ్రూపులక్రింద విభజించి సహకార పద్ధతులతో రైతుల కిప్పించి వ్యవసాయము మొనర్చి అధిక పంటల విస్తరణమునకు దోహదము గల్పించులాగు నిర్ణయించిరి.

ఆనాడు సాయంత్రమే అక్కడకు సమీపమగు కొరమంగలం గ్రామమున జరిగిన పోటీ పశువుల పశుప్రదర్శనములలో వీరు పాల్గొని సహకారపద్ధతులమీద జరుపవలసిన వ్యవసాయ విధానమునుగూర్చి ప్రబోధించిరి.

బూదూరు రామానుజులురెడ్డి,

యుగసంధి

(19 వ పేజీ తరువాయి)

తేరా లుండవని. చూడు. అరవయిఏళ్ల ముసలి వాడిని. నాకే లేవు అల్లాంటివి." (తనే ఈ ఉంగహాశీస్సులన్నీ ఏర్పాటుచేసినట్టు ఒప్పుకో డానికి వాసిలీఇవానోవిచ్‌కి సాహసం చాలలేదు. మతవిశ్వాసం అతని భార్యకు ఎంత ఉందో అతనికీ అంతా ఉంది.) "తరవాత ఫాదర్ అలెక్సీకి నీతో పరిచయం చేసుకోవాలని ఉంది. చూస్తావుగా. నీకు నచ్చుతాడు. పేకాటంటే అతని కేమీ అభ్యంతరం లేదు. తరువాత అప్పుడప్పుడు — మనలో మనమాట — పొగగొట్టంకూడా పీలుస్తాడు."

"సరే. కాస్తసేపు మూడుముక్కల ఆట ఆడదాం. భోజనం అయినతరవాత, అతన్ని పూర్తిగా ఊడ్చివేస్తాను."

"హా!హా!హా! చూద్దాం. ఏ జరుగుతుందో చూడాలి."

"నీది బాగా ఆరితేరిన చెయ్యి అని నాకు తెలుసు," బజరోవ్ ఒత్తిచెపుతూ అన్నాడు.

వాసిలీఇవానోవిచ్ చెక్కిళ్లు అసంబద్ధంగా కొద్దిగా ఎర్రబడ్డాయి.

"సిగ్గు! సిగ్గు! యవ్‌గనీ......గడిచిపోయినవి గడిచిపోనీ, ఆ పిచ్చి నాకు చిన్నతనంలో ఉండేదన్న సంగతి ఈ పెద్దమనిషిముందు ఒప్పుకుంటాను దాని దుష్ఫలితాలుకూడా అనుభవించాను. అబ్బ! ఎంత వేడిగా ఉంది. కాస్సేపు మీతో కూర్చుంటాను మీకేమీ అడ్డుగ లేదుగదా?"

"అబ్బే. లేదులేదు" ఆర్కాడీ జవాబు చెప్పాడు.

వాసిలీఇవానోవిచ్ గడ్డిమీద వాలాడు, నిట్టూర్పుతూ "మీరు విశ్రమిస్తున్న ఈ ప్రదేశాన్ని చూస్తే నేను సైన్యంలో పని చేసే రోజుల్లో మావిహారాలు జ్ఞాపకం వస్తున్నాయి. రోగుల్ని తీసుకుపోయేటప్పుడు మధ్యమధ్య మకాములు. ఎక్కడో ఇల్లాంటి గడ్డిమేటి కనిపించేది. అదిమాత్రమన్నా కనిపించినందుకు ఎంతో సంతృప్తిపడేవాళ్లం." అతను నిట్టూర్చాడు. "నా జీవితంలో నాకు ఎన్నో ఎన్నో అనుభవాలు కల్గాయి. ఉదాహరణకి, మీకు వినాలనుంటే, బెస్సరేబియాలో ప్లేగు వచ్చినప్పుడు జరిగిన ఒక సంఘటన చెపుతాను."

"నీకు వ్లాడిమిర్ నిలువు బహుమతి ఇచ్చిన సంఘటనేనా?" బజరోవ్ అన్నాడు. "మాకు తెలుసు. మాకు తెలుసు......అయితే అది ఇవాళ పెట్టుకోలేదేం?"

"నాకు అటువంటి గొప్ప లేవీ లేవని చెప్పానుగా," వాసిలీఇవానోవిచ్ తనలో తను గొణుక్కున్నాడు. (కితం సాయంకాలమే ఆ నిలువుని కోటునుంచితీసివేశాడు) తరువాత ప్లేగును గురించిన కథ చెప్పడం ప్రారంభించాడు. "అరే, నిద్రపోతున్నాడే," చటుకుని యవ్‌గనీని చూపిస్తూ స్నేహపూర్వకంగా కన్నులు సగం మూస్తూ ఆర్కాడీతో అన్నాడు. "యవ్‌గనీ! లే లే!" గట్టిగా అన్నాడు. భోజనానికి పోదాం రండి."

ఫాదర్ అలెక్సీ చాలా ప్రపంచజ్ఞానమున్నవాడున్నూ, పరిస్థితులకు అనుగుణంగా సరిపెట్టుకోగలవాడున్నూ. ఒత్తయినజుట్టు నున్నగా దువ్వుకున్నాడు. పట్టు అంగరకామీద రంగు రంగుల కాశికోకచుట్టాడు. తన ఆశీర్వచనాలు వాళ్లకి అక్కరలేదని ముందుగానే గ్రహించినట్టు ముందుగా తనే ఆర్కాడీ బజరోవ్‌ల కరస్పర్శ చేశాడు. ఏమీ సంకోచంలేకుండా స్వేచ్ఛగా ప్రవర్తించాడు. తన గౌరవాన్ని భంగపరుచుకోనూ లేదు. ఇతరులకు నొప్పికలిగించనూ లేదు. యజమాని లాటిన్ భాష ప్రకర్షకు కొద్దిగా చిరునవ్వునవ్వాడు. ఒకచిన్న పాత్రలో మధువు రెండుసార్లు తాగాడు, మూడోసారి నిరాకరించాడు. ఆర్కాడీ ఇచ్చిన చుట్ట తీసుకున్నాడుగాని కాల్చలేదు; ఇంటికి తీసుకుపోయి కాలుస్తానన్నాడు. ఒక్కటే ఏవగింపు కలిగించే అలవాటుంది అతనికి — ముఖం మీదవాలిన ఈగలను పట్టుకోవడంకోసం అతి జాగ్రత్తగా పట్టువలగా చేతిని అప్పుడప్పుడు ముఖం దగ్గరకు ఎత్తుతూంటాడు. అప్పుడప్పుడు, ఈగను పట్టుకొని చంపగలుగుతుంటాడు. పేకాటకు కూర్చున్నప్పుడు చాలా జాగ్రత్తగా తన సంతృప్తిని వెలిబుచ్చాడు, చివరకు బజరోవ్‌దగ్గర నుంచి రెండున్నరరూబుల్సు నెగ్గాడు. అరినా వ్లాసీవ్నా మామూలులాగే తనకొడుకుపక్కని కూర్చుంది. (ఆమె పేక ఆడదు) మామూలు లాగే గుప్పిటమీద తన చెక్కిల్ని ఆన్చి చూస్తూ కూర్చుంది. అవసరమయిన తినుబండారాలు తెమ్మని చెప్పడానికి మాత్రం అప్పుడప్పుడు లేస్తుండేది. బజరోవ్ వంటిమీద చెయ్యివేసి నిమురడానికి ఆమెకు భయంవేసింది, బజరోవ్ ముఖంలో కూడా ఆమెను ప్రోత్సహించే చనువు లేదు; అతను ఆమె బుజ్జగింపులను అసలు వాంఛించలేదు. అతనికి ఆశ్లేష ‘చిరాకు’ పుట్టించవద్దని వాసిలీఇవానోవిచ్ ముందే జాగ్రత్తకోసం చెప్పాడు "యువకులకు అల్లాంటివన్నీ నచ్చవు," అన్నాడు. (భోజనం ఎల్లా ఉందో వేరే చెప్పనక్కరలేదు. టిమోఫీచ్ తనే స్వయంగా ఎద్దుమాంసంకోసం తెల్లవారగట్లే దౌడుతీశాడు. చేపలకోసం ఇతర పదార్థాల కోసం గుమాస్తా ఇంకోపక్కకు పరుగెత్తాడు. ఒక్కొక్క కుక్కగొడుగు * కోసమే ఒక ఆడమనిషికి నలభయిరెండు రాగినాణాలు ఇచ్చారు) కాని అరినావ్లాసీవ్నా చూపులు బజరోవ్‌మీద కేంద్రీకరించి ఉన్నాయి; ఆచూపుల్లో ప్రేమ, అనురాగం మాత్రమే కాదు, విషాదంకూడా భయంతోనూ కుతూహలంతోనూ మిళితమయి ఉంది. అణకువతో కూడిన నిందారోపణకూడా వాటిలో కనబడుతూంది.

అయితే తల్లి చూపులను విశ్లేషించి చూసే మనస్థితిలో లేడు బజరోవ్; ఆమెవేపు ఎప్పుడో గాని చూసేవాడే కాదు; అప్పుడుకూడా ఏదో ప్రశ్నార్థకంగానే చూసేవాడు. పేకాటలో విగ్రహంకోసమని ఒకసారి ఆమెచేతిని జాపమన్నాడు, బిగుసుకుపోయిన విశాలమయిన అతని చేతిలో ఆమె తన చిన్నచేతిని మృదువుగా ఉంచింది

"ఏమయింది," అని కొంతసేపయిన తరవాత అడిగింది, "ఏమన్నా అదృష్టం మారిందా?"

"ఇదివరకుకన్న పాడయింది," అన్నాడు నిర్లక్ష్యంగా నవ్వుతూ.

"అతను చాలా తొందరపడతాడు," ఫాదర్ అలెక్సీ తన గడ్డాన్ని నిమురుకుంటూ, సానుభూతి చాటుతూ అన్నాడు.

"నెపోలియన్ పద్ధతి. ఫాదర్, నెపోలియన్ పద్ధతి," అన్నాడు వాసిలీఇవానోవిచ్ ఒక ఆసు ఆడుతూ.

ఆ పద్ధతి అతన్ని చివరికి సెంటుహెలెనా దాకా తీసుకువచ్చింది," ఫాదర్ అలెక్సీ అన్నాడు. తురుపుతో ఆసుని కొడుతూ.

"ఎన్యూష, నీకు కాస ఎండుద్రాక్ష. టీ అక్కరలేదూ?" అరినావ్లాసీవ్నా అడిగింది.

బజరోవ్ సమాధానం చెప్పకుండా భుజాలు ముడుచుకున్నాడు.

"లాభం లేదు," మరునాడు అతను ఆర్కాడీతో అన్నాడు, "రేపు ఇక్కడినుంచి పోతున్నాను ఏమీ తోచటం లేదు. నాకు పని కావాలి. కాని ఇక్కడ పని చెయ్యలేను. మీ ఇంటికి వస్తాను. అక్కడే నా పనిముట్లన్నీ వదిలేశాను కూడా. మీయింట్లో అయినా ఎక్కడో తలుపులు మూసుకుని ఏకాంతంగా నయినా కూర్చోవచ్చు ఇక్కడుంటే మానాన్న వచ్చి, నాపఠనమందిరం తీసుకో—ఎవరూ నిన్ను పలకరించరు అంటాడు. అని తనే ఒక గజం దూరమన్నా అవతలికి పోడు. అతను రాకుండా తలుపులు గడియ వేసుకొని కూర్చోవటమంటే నాకు అసహ్యంగా అనిపిస్తుంది అమ్మకోటీ ఇదే సమస్య. గోడ అవతలనించి ఊపిరి ఆమె నిట్టూర్పులు వినబడుతూ టాయి. తీరా దగ్గరకు వెడితే మాట్లాడ్డానికి ఏమీ ఉండదు."

"ఆమె చాలా బాధపడుతుంది," అన్నాడు ఆర్కాడీ, "మీనాన్న కూడా."

"మళ్ళీ వాళ్ళదగ్గరకు తిరిగి వస్తానుగా."

"ఎప్పుడు?"

"ఏమీ, పీటర్స్‌బర్గు పోయేటప్పుడు."

"మీ అమ్మని చూస్తే నాకు మరీ జాలిగా ఉంది"

"ఎంచేశ? పూతికపళ్లఫలహారంతో నీ హృదయాన్ని వశపరచుకుందా ఏమిటి?"

ఆర్కాడీ కిందికిచూస్తూ అన్నాడు, "యవ్‌గనీ, నువ్వు మీఅమ్మని పూర్తిగా అర్థంచేసుకో లేదు. ఆమెలో మంచితనం ఒక్కటే కాదు, నిజమైన తెలివికూడా ఉంది. ఈ వేళ ఒక అరగంటసేపు నాతో మాట్లాడింది. ఎంత సబబుగా ఎంత సరదాగా మాట్లాడిం దనుకున్నావు!"

అంతసేపూ నా గుణగణాలను వివరించిం దనుకుంటాను."

"నిన్నొక్కడినిగురించేకాదు మాట్లాడింది."

"బహుశా మొగవాళ్లకి మంచిచెడ్డలు బాగా కనిపెడతాయనుకుంటాను. మా నాన్నకి చిరాకు కలిగించాలని పుట్టింది బుద్ధి నాకు ఇందాకా. మొన్న ఎప్పుడో తన రైతుల్లో ఒకడిని కట్టివేసి చబుకుతో కొట్టించాడట. అవునవును. నువ్వంత నిర్ఘాంతపడుతూ నావేపు చూడనక్కరలేదు. అతను చెయ్యవలసిన పని చేశాడు. అతని తప్పు ఏమీ లేదు. ఆ రైతు శుద్ధదొంగ, తాగుబోతు. పాపం మా నాన్నకి, నాకు ఇవన్నీ తెలిశాయని తెలియదు. చాలా బాధపడిపోయాడు, అతని మతి ఇంకా కాస్త చెడిపోతుంది ఈ సంగతి చెపితే. ఏమీ ఫరవాలేదు!......అంతలో చితికిపోడు. తట్టుకోగలడు."

బజరోవ్ "ఫరవాలే"దన్నాడు; కాని వాసిలీఇవానోవిచ్‌తో తననిశ్చయాన్ని చెప్పడానికి అతను ఆ రోజల్లా నిర్ధారణ చేసుకోలేక పోయాడు. చివరికి అతన్ని పడుకోమని చెప్పివెళ్లి పోతున్నప్పుడు, ఆవులిస్తున్నట్టు నటిస్తూ అన్నాడు—

"అహా......అన్నట్టు నీతో చెప్పడం మరిచిపోయాను...రేపు ఫెడోట్‌ని కబురంపు మాకు గుర్రాలు కావాలని"

వాసిలీఇవానోవిచ్ నోటమాట రాలేదు. "అయితే కిర్సనోవ్‌గారు వెళ్లిపోతున్నారా?"

"సరే. అతనితో నేనుకూడా వెడుతున్నాను."

వాసిలీఇవానోవిచ్ ఈసారి తూలిపోయాడు, "నువ్వు వెళ్లిపోతున్నావా?"

"అవును తప్పదు......గుర్రాలను తప్పకుండా సిద్ధం చేయిద్దూ."

"మంచిది......"ముసలితండ్రి తడబడుతూ అన్నాడు, "ఫెడోటికి కాదూ......సరే...మంచిది...ఎందుకు?"

"కొద్దిరోజులు అతనితో గడపాలి. తరవాత ఇక్కడికి తిరిగి వస్తాను"

"ఆ—! కొద్దిరోజులు......మంచిది." వాసిలీఇవానోవిచ్ జేబురుమాలు పైకిలాగాడు. చీదుకున్నాడు. కొంచెం ఇంచుమించుగా తూలి కిందపడిపోయాడు "ఏరే...అన్నీ సిద్ధం అవుతాయి. ఇంకా కొన్నాళ్లు నువ్వు మాతో ఉంటావని అనుకున్నాను. మూడురోజులు...... మూడేళ్లతరవాత. ఇంత తక్కువకాలం, యవ్‌గనీ!"

"నేను వెంటనే తిరిగివస్తానని చెపుతున్నానుగా, నేను వెళ్లవలసిన అవసరం ఉంది."

"అవసరం......సరే! ముందుగా కర్తవ్యమే చూసుకోవాలి. అయితే గుర్రాలు సిద్ధం చేయిస్తాను. సరే మంచిది. అరీనా నేనూ ఇలా అవుతుందని అనుకోలేదు. ఇరుగుపొరుగు నుంచి పువ్వులు తెప్పిస్తోంది. ఈగది నీకోసం అలంకరించాలనుకుంటోంది." (ప్రతి ఉదయమూ ఇంకా దుస్తులు మార్చుకోకుండానే టిమోఫీచ్‌ని పిలిచి, అతనితో సలహాచేస్తున్నట్టు, వణుకుతున్న చేతులతో ఒక రూబుల్ నోటు తరవాత మరొకటి పైకి తీసి ఎన్నో వస్తువులు కొనుక్కురావడానికి అతనికి ఇస్తున్నట్టూ, ముఖ్యంగా తినే వస్తువులు, మంచివి ఎర్రటి మధువు మెండయినవి, తను చూసినంతవరకు ఆ యువకులకు ఇష్టమయినవి తను తెప్పిస్తున్నట్టూ, అతను సూచనగా అయినా అనలేదు.)

"స్వేచ్ఛ ... చాలా గొప్పది. అది నా నమ్మకం...నీకు నేను అడ్డుతగలను...లేదు..."

చటుకుని అతని ధోరణి ఆగిపోయింది. తొందరగా గుమ్మంవేపు తిరిగి వెళ్లిపోతున్నాడు.

"మళ్ళీ తొందరలోనే తప్పకుండా కలుసుకుంటాం నాన్నా!"

వాసిలీఇవానోవిచ్ వెనక్కి తిరగకుండానే చెయ్యి ఊపి అవతలికి వెళ్ళిపోయాడు. తన పడక గదిలోకి వెళ్ళేసరికి అతని భార్య అప్పుడే పడుకునిఉంది. ఆమె లేపకుండా మెల్లగా ప్రార్థించాడు. కాని ఆమెకు మెలకువ వచ్చింది. "వాసిలీఇవానోవిచ్?" అని అడిగింది.

"ఆ, నేనే."

"ఎన్యూషాదగ్గరనించేనా? ఆ సోఫామీద వాడికి సుఖంగా ఉండదని నా నమ్మకం తెలుసా. నీ జంబుకానా పరిచి కొత్త తలగడాలు వెయ్యమని అన్ఫీసుష్కాతో చెప్పాను. మన మెత్తటి పరుపు వెయ్యవలసింది అసలు. కాని బొత్తిగా మెత్తని పరుపయితే వాడికి నచ్చదు అన్నట్టు..."

"పోనీలెద్దూ. నువ్వేమీ బాధపడకు. వాడి కేమీ లోటు లేదూ. భగవాన్ ఈ పాపిని కరుణించుము," అంటూ తన ప్రార్థన ముగించాడు. ఆ ముసలి భార్యను చూస్తే అతనికి విచారం వచ్చింది మరునాడు ఆమె ఎంత దుఃఖపడవలసి ఉందో, ఆ రాత్రి ఆమెతో అతడు చెప్పలేక పోయాడు.


బజరోవ్ ఆర్కాడీలు మరునాడు ప్రయాణమయి వెళ్ళిపోయారు. ఉదయాన్నించీ ఇంట్లో విషాదం ఆవరించింది. అన్ఫీసుష్కా చేతులోనించి ఫలహారాలపళ్ళెం జారిపోయింది. ఫెడ్కాకూడా కంగారుపడిపోయి తనచెప్పులు విప్పివేసుకున్నాడు. వాసిలీఇవానోవిచ్ రోజాంతంటే కంగారుగా తిరిగాడు. తన బాధ తగ్గించుకోడానికి ప్రయత్నించాడు. గట్టిగా మాట్లాడాడు. కాళ్ళు చప్పుడుచేస్తూ నడిచాడు. కాని అతని ముఖం పిచ్చిగా అయిపోయింది. అతని కళ్ళు కొడుకుని తప్పించుకుని చూశాయి. అరినా వ్లాసీవా నిశ్శబ్దంగా ఏడిచింది. ఆమెహృదయం పూర్తిగా చితికిపోయింది. తన భర్త రెండు గంటలసేపు దగ్గరకూర్చుని నచ్చచెప్పకపోతే ఆమె ఆపుకోలేక పోయేది. తన తల్లిదండ్రుల కౌగిళ్ల నించి విడిపించుకుని ఒక నెలరోజుల్లో తప్పకుండా వస్తానని అనేకపర్యాయాలు వాగ్దానం చేసి బజరోవ్ బండి ఎక్కినతరవాత; చక్రాలు తిరుగుతూ, గంటలు మోగుతూ బండి కదలిన తరువాత; లేచిన దుమ్ముకూడా అణిగిపోయి, ఇంక దారివేపు చూసినా ప్రయోజనం ఏమీ లేదనుకున్న తరువాత; టిమోఫీచ్ కూడా తడబడుతున్న కాళ్ళతో వంగిన నడుముతో తన గదిలోకి చేరుకున్న తరువాత; ఆ ముసలి దంపతులు ఒంటరిగా ఆ ఇంట్లో మిగిలిపోయినతరువాత; (ఆ ఇల్లు ముడుచుకుపోయి కుంగిపోయినట్టు అయిపోయింది) వాసిలీఇవానోవిచ్ మెట్లమీద నిలబడి హృదయపూర్వకంగా చేతిరుమాలు ఊపి ఊపి చివరికి ఒక కుర్చీలో కూలబడిపోయాడు. అతని ముఖం గుండెలమీదకి వాలిపోయింది. "మనని వదలి వెళ్ళిపోయాడు, మనని వదలివేశాడు;" అన్నాడు తడబడుతూ; "వదలి వెళ్ళిపోయాడు, వాడికి ఇక్కడ తోచలేదు. ఒంటరిగా ఒంటరిగా!" ఎన్నోసార్లు ఆమాట పునశ్చరణ చేశాడు. తరువాత అరినా వ్లాసీవ్నా అతని దగ్గరకు వెళ్లింది. తన నెరసినతల అతని నెరసిన తలకు ఆన్చి అంది, "వాస్యా! మనంచేసేది ఏమీ లేదు. చెట్టునుంచి వేరయిపోయిన కొమ్మలాంటివాడు కొడుకంటే. ఇష్టం వచ్చినప్పుడు గూటికి చేరుకుంటూ మళ్ళీ ఎగిరిపోతూండే పిట్టలాంటివాడు. మనం చెట్టుతొర్రలో మొలిచిన కుక్కగొడుగు వంటివాళ్లం. ఒకరి ప్రక్కని ఒకరం స్థిరంగా కూర్చుని ఉంటాం. మనం కదలం నేనూ నీకూ నువ్వు నాకూ మారకుండా మిగిలిపోతాం."

వాసిలీఇవానోవిచ్ ముఖాన్ని కప్పిన తన చేతులు తీసి తనకి జన్మతః సహచరాలయిన భార్యను, తన యౌవనంలో కూడా ఎరగనంత గట్టిగా కౌగలించుకున్నాడు. ఆమె అతని దుఃఖాన్ని ఉపశమింపజేసింది.


---

* కొన్నిరకాల కుక్కగొడుగులను చాలా ఆప్యాయంగా పాశ్చాత్యులు తింటారు.

వార్తా చిత్రాలు




దక్షిణాఫ్రికా భారతీయులకొరకై మహాత్ముని అస్థికలను, యస్. యస్. టాలీర్ ఓడపై బొంబాయినుంచి దర్బాన్‌కు సోహ్రాబ్‌రస్తంజీగారు జాగ్రత్తగా తీసుకెళ్లారు. అస్థికలను అక్కడి భారతీయులు గౌరవంతో అందుకొని పూజించినప్పటి చిత్రం.



ఈమన్, డి, వెలరా, మాజీ ఐరిష్ రిపబ్లిక్ అధ్యక్షుడు, ఢిల్లీవచ్చినప్పుడు విమానాశ్రయం వద్ద తీసిన ఛాయాచిత్రం.




రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షునిఎన్నికలు చీరాలలో జరిగినప్పుడు సభా వేదికపై కాంగ్రెస్ నాయకులు.




కీ. శే. డానియల్ థామస్.


గత మంగళవారంనాడు రాత్రి స్వర్గస్థులయిన మద్రాసు మంత్రి డానియల్ థామస్ గారు.



చిత్తూరు హిందీ విశ్వవిద్యాలయ పీఠంవారు మే 31 న ప్రథమ వార్షికోత్సవం జరుపుకొన్నప్పుడు తీసిన చిత్రం.



సింహళంలో ఇండియా హైకమీషనర్ శ్రీ వి. వి. గిరిగారు, సింహళ భారతీయ కాంగ్రెస్ అధ్యక్షులు, అజీజ్ గారూ, మద్రాసు మౌంటురోడ్డులో నిరేజియనల్ ఎంప్లాయిమెంటు ఆఫీసు బ్రాంచ్‌లశాఖను సందర్శించినప్పుడు తీసిన చిత్రం.



మధిరతాలూకా మడిపల్లి గ్రామంలో ముస్లిముగుండాలు నైజాముపోలీసులు హిందువుల యిండ్లు తగులపెట్టిన దృశ్యం.



హైదరాబాదు సంస్థానంలో ముస్లిముగుండాలు పోలీసు సహాయంతో అలీనగరం (మధిరతాలూకా) గ్రామంలో హిందువుల యిండ్లను తగులపెట్టిన దృశ్యం.

Regd. No M. 4479

కర్త: కళాప్రపూర్ణ
కీ॥ శే॥ కాశీనాధుని నాగేశ్వరరావుగారి
ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర

పరిశోధనపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయ చరిత్రకు విశుద్ధదర్పణం.
పాతచరిత్రల నన్నిటిని అవలోడనచేసి, సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర.
శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండిఉండి, నన్నయ ధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంలో బైట పడి, నానాటికి నవనవో న్మేషంగా వికసించిన మన వాఙ్మయం పోయినవలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.

వెల రు 2-0-0లు, తపాలాఖర్చు ప్రత్యేకము.

ఆంధ్రగ్రంథమాల,

పోస్టు బాక్సు నం. 212, మదరాసు.

ఆంధ్రవిజ్ఞానసర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి "అధ్వర్యు" వరకును గల విషయము గలదు. త్రివర్ణ పటములు ౮, ఇతరపటములు ౧౨౫, వివిధ విషయములు ౮౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. "అగ" మొదలుకొని "అశ్విని" వరకు గల విషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౨ అమరావతీ స్తూపమునకును ౨ అనాహతమునకును చెందినవియు, ౬ దేశ చిత్రపటములును గలవు ఇవిగాక మరి ౫ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతీ స్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతి శిల్పమునకు సంబంధించిన ఫోటోల బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేష భూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయమను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేలువేలు హస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందు షట్చక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆయా వ్యాసములకు చెందిన చిత్రములు మొత్తముమీద ౨౫౦కి పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౮౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను బంగారు రేఖలతోడను సంపుటీకృతము. ప్రతిసంపుటమున ౬౦౦ పుట లుండును.

ప్రతిసంపుటము వెల రూ. ౧౦.

పోస్టుద్వారా: రూ. ౧౦-౮-౦.

రైలుద్వారా దగ్గరస్టేషన్లకు ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,

ఆంధ్రవిజ్ఞానసర్వస్వ కార్యాలయము,

నెం. 7, తంబుశెట్టివీధి, మదరాసు.



గాంధీమహాత్ముని

ఆత్మకథ

ప్రథమసంపుటము

[చతుర్థముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి
అనువాదము

★

ద్వితీయసంపుటము
(త్వరలో వచ్చుచున్నది)

ఖద్దరుబైండు వెల రూ. 5-0-0 తపాలచార్జి అ. 0-9-0

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212, మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. No. 7 Thambu Chetty St., G.T Madras.